# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com | E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శనివారం 10-8-2019 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :25 | సంచిక: 278 | పేజీలు 8 | వెల: రూ.1/-


## ఈ నెల 11వ తేదీ వరకు కొచ్చి విమానాశ్రయం మూసివేత

తిరువనంతపురం, ఆగష్టు 9: ప్రతికూల వాతావరణంతో ఈ నెల 11వ తేదీ వరకు కొచ్చి విమానాశ్రయం మూసివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. కొచ్చి విమానాశ్రయం మూసివేతతో శంషాబాద్ నుంచి వెళ్లాల్సిన విమానాలు రద్దు చేశారు. కొచ్చి వెళ్లేందుకు ముందుగానే టికెట్‌లు బుక్ చేసుకున్న ప్రయాణికులకు వెసులుబాటు కల్పించారు. సంబంధింత ఎయిర్‌లైన్స్‌ను సంప్రదించాలని శంషాబాద్ విమానాశ్రయ ప్రతినిధులు సూచించారు.

# త్రిశూలీ నదిలో పడిపోయినబస్సు

## 50మందివరకు గల్లంతు

ఖాట్మండ్,ఆగస్ట్9(ఆర్ఎన్ఎ): నేపాల్ లోని ధడింగ్ జిల్లాలో ఘోరప్రమాదం చోటుచేసుకుంది. 50 మంది ప్రయాణికులతో వెళు న్న బస్సు ప్రమాదవశాత్తు బెనిఘాట్ రోరంగ్ మున్సిపాలిటీ-3 పరిధిలోని త్రిశూలీ నదిలో పడిపోయింది. ఈ ప్రమాదంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. 16 మందికి గాయాలయ్యాయి. మరో 23మంది ఆచూకీ గల్లంతైంది. సమాచారమందుకున్న దడింగ్ జిల్లా పోలీసులు, రెస్క్యూ టీం ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి. బస్సు మలంగావ నుంచి ఖాట్మండ్ వెళు ండగా ఈ ప్రమాదం జరిగింది.

# కారును ఆపిన కానిస్టేబుల్‌పై దాడి

## దంపతులను అరెస్ట్ చేసిన పోలీసులు

గురుగ్రావ్,ఆగస్ట్9(ఆర్ఎన్ఎ): ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఆగకుండా వెళ్లడమే కాక అడ్డుకున్న ట్రాఫిక్ పోలీసు అధికారిని తమ కారుతో తొక్కించుకోని పోయేందుకు ప్రయత్నించడంతోపాటు ఇద్దరు జర్నలిస్టులపై కూడా దాడి చేసిన ఒక జంటను పోలీసులు శుక్రవారం ఉదయం ఇక్కడ అరెస్టు చేశారు. ఉదయం 9.45 గంటలకు సోనా రోడ్డుపైన వాటికా చౌక్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్‌ను జంప్ చేసిన ఒక హోండా సిటీ కారును ట్రాఫిక్ పోలీసు కానిస్టేబుల్ సునీల్ కుమార్ ఆపాడు. కారు ఆపిన డ్రైవర్ కిందకు దిగగా వెనుక సీట్లో కూర్చున ఇద్దరు వ్యక్తులు కారు ముందు సీట్లోకి మారారు. మహిళ డ్రైవింగ్ సీట్లో కూర్చుని కారు యాక్సిలేటర్‌ను రైజ్ చేస్తూ కారును ముందుకు పోనిచ్చింది. దీంతో కానిస్టేబుల్ కారు బానెట్‌పైన పడ్డాడు. కారు అలాగే కొంత దూరం ముందుకు వెళ్లింది. ఈ దృశ్యాన్ని రికార్డు చేస్తున్న ఒక స్థానిక న్యూస్ చానల్‌కు చెందిన ఇద్దరు జర్నలిస్టులపై దాడి చేసిన ఆ మహిళ వారి చేతిలోని కెమెరాను లాక్కుని వారిపై చేయిచేసుకుంది. 28 ఏళ్ల ఆ మహిళ చార్టెర్డ్ అకౌంటెంట్ కాగా 32 ఏళ్ల ఆమె భర్త ఇంజనీర్ అని ఎసిపి షంషేర్ సింగ్ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఆయన చెప్పారు.

# కాంగ్రెస్ చీఫ్ రేసులో ముఖుల్ వాస్నిక్

హైదరాబాద్, ఆగష్టు 9: కాంగ్రెస్ పార్టీ చీఫ్ ఎవరన్న దానిపై శనివారం క్లారిటీ రానున్నది. సోనియా గాంధీ నివాసంలో జరిగే సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకోనున్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష రేసులో ముఖుల్ వాస్నిక్ ముందంజలో ఉన్నట్లు తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘోరంగా ఓటమి చెందడంతో రాహుల్ గాంధీ ఆ పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. దీంతో ఆ పోస్టు ఇంకా ఖాళీగానే ఉన్నది. 134 ఏళ్ల కాంగ్రెస్ పార్టీ చరిత్రలో ఎక్కువ శాతం నెహ్రూ-గాంధీ కుటుంబమే పార్టీని శాసించింది. పార్టీ అధ్యక్షుడిగా చేసిన రాహుల్‌కు సీడబ్ల్యూసీ మీటింగ్‌లో కృతజ్ఞతలు తెలియజేయనున్నారు. కాంగ్రెస్ ముఖ్య నేతలు ఏకే ఆంటోనీ, అహ్మద్ పటేల్, కేవీ వేణుగోపాల్ సమావేశంలో పాల్గొనున్నారు.

# కేరళను ముంచెత్తుతున్న వరదలు

## భారీ వర్షాలకు విరిగిపడ్డ కొండచరియలు

## వయనాడ్‌లో 22మంది మృతి

తిరువనంతపురం,ఆగస్ట్9(ఆర్ఎన్ఎ): : కేరళను వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. వరదలు ముంచెత్తుతున్నాయి. కుండపోత వర్షాల కారణంగా ప్రాజెక్టులకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. భారీ వరదల నేపథ్యంలో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గురువారం నుంచి నేటి



వరకు వరదలకు 22 మంది ప్రాణాలు కోల్పోయారు. వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడడంతో 200 మందికి గాయాలయ్యాయి. అక్కడ ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. వయనాడ్ నుంచి 22 వేల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. 14 జిల్లాల్లో పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. భారీ వర్షాల కారణంగా కేరళ ప్రభుత్వం రెడ్ అలర్ట్ ప్రకటించింది. ముఖ్యమంత్రి పినరయి విజయన్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారులతో మాట్లాడి వరద పరిస్థితిపై వివరాలను తెలుసుకున్నారు. ఇక ఆదివారం వరకు పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల వరకు కొచ్చి అంతర్జాతీయ విమానాశ్రయాన్ని మూసివేయనున్నారు. ఈ ఎయిర్‌పోర్టుకు సమీపంలోని పెరియార్ నదికి వరద ఉధృతి ఎక్కువైంది. ఆగస్టు 15వ తేదీ వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. కేరళలో భారీ వర్షాలకు పెరియార్ నదిపై ఉన్న ఆనకట్టలో వరద ఉద్ధృతి పెరిగింది. దీంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. భారీ వర్షాల కారణంగా కొచ్చి ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టులోకి భారీగా వరదనీరు వచ్చి చేరింది. రన్ వే పై వరదనీరు చేరడంతో ఎయిర్ పోర్టును తాత్కాలికంగా మూసివేశారు. ఆదివారం మధ్యహ్నాం మూడు గంటలవరకు ఎయిర్ పోర్టులో సేవలను నిలిపివేస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. భారీగా కురుస్తున్న వర్షాల కారణంగా వయనాడ్, ఇడుక్కి, మలప్పురం, కొజికోడ్ తదితర జిల్లాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షాలతో కేరళ సిఎం పినరయి విజయన్ విపత్తు నిర్వహణ విభాగం అధికారులతో సమీక్ష చేశారు. ఎయిర్ పోర్టు మూసివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

# 17నుంచి ప్రధాని భూటాన్ పర్యటన

## - రెండు రోజులు పర్యటించనున్న మోదీ

న్యూఢిల్లీ, ఆగస్టు9(ఆర్ఎన్ఎ): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 17 నుంచి రెండు రోజుల పర్యటన నిమిత్తం భూటాన్ వెళ్లనున్నారు. భూటాన్ ప్రధాని లొటయ్ త్సెరింగ్ ఆహ్వానం మేరకు మోదీ అక్కడికి వెళ్లనున్నారు. భారత్‌కు నమ్మకమైన మిత్రుడిగా, పొరుగుదేశంగా భూటాన్‌కు పేరుంది. భూటాన్‌తో స్నేహానికి భారత్ ఎంత ప్రాధాన్యత ఇస్తుందన్న విషయం ప్రతిబింబించేలా ప్రధాని పర్యటన ఉంటుందని భారత విదేశాంగ శాఖ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. 'పొరుగు దేశాలకే తొలి ప్రాధాన్యం' అన్న తన విధానంలో భాగంగా రెండోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన కొద్ది రోజులకే మోదీ భూటాన్ వెళ్లనుండడం విశేషం. తన పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ భూటాన్ రాజు జిగ్మే కేసర్ నంగ్యేల్ వాంగ్చుక్, మాజీ రాజు జిగ్మే సింగ్యే వాంగ్‌చుక్‌లతో పాటు భూటాన్ ప్రధాని త్సెరంగ్‌తో సమావేశమైన చర్చలు జరపనున్నారు. కాగా విదేశాంగ మంత్రిగా జైశంకర్ బాధ్యతలు చేపట్టిన తర్వాత జూన్‌లో తన తొలి విదేశీ పర్యటనగా భూటాన్ వెళ్లడం గమనార్హం. తన పర్యటనలో భూటాన్ ప్రధాని త్సెరంగ్‌తో సమావేశమైన జైశంకర్.. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత మెరుగుపర్చడంపై చర్చలు జరిపారు.

# ఎదురుకాల్పుల్లో మావోయిస్టు హతం

రాంచీ,ఆగష్టు 9 : జార్ఖండ్‌లోని కుంతి జిల్లాలో ఇవాళ ఉదయం సీఆర్పీఎఫ్ బలగాలు, మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. తోల్కోబేరా అటవీ ప్రాంతంలో జరిగిన ఈ ఎదురుకాల్పుల్లో ఓ మావోయిస్టు హతమయ్యాడు. ఘటనాస్థలిలో భారీగా ఆయుధాలు, మందు గుండు సామాగ్రి, రైఫిల్, డబుల్ బ్యారెల్ గన్, ఏకే-47ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇక 10 మొబైల్ ఫోన్లు, ఆధార్ కార్డులు, పాస్‌బుక్స్‌ను కూడా స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

# కశ్మీర్ నుంచి ఆగ్రా జైలుకు 30 మంది ఖైదీలు



న్యూఢిల్లీ, ఆగష్టు 9 : సుమారు 30 మంది ఖైదీలను కశ్మీర్ జైలు నుంచి ఆగ్రా జైలుకు తరలించినట్లు తెలుస్తోంది. జమ్మూకశ్మీర్‌లో నెలకొన్న పరిస్థితులు, బక్రీద్ పండుగ నేపథ్యంలో భద్రతా కారణాల దృష్ట్యా.. 30 మంది ఖైదీలను ప్రత్యేక హెలికాప్టర్‌లో ఆగ్రాకు తరలించినట్లు సమాచారం. ఈ ఖైదీలు సమస్యలు సృష్టించే అవకాశం ఉందని భావించి.. ముందస్తు జాగ్రత్తగా జైలు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఆర్టికల్ 370ని రద్దు సందర్భంగా 300 మంది రాజకీయ నాయకులను పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో అక్కడి జైళ్లల్లో స్థలం సరిపోవడం లేదని అధికారులు పేర్కొన్నారు. మాజీ సీఎంలు మెహబుబా ముఫ్తీ, ఒమర్ అబ్దుల్లాను కూడా హౌస్ అరెస్టు చేశారు. జమ్మూ కశ్మీర్‌లో 40 వేల మంది పోలీసులతో భద్రత కట్టుదిట్టం చేశారు.

# కాశ్మీర్‌లో పాక్షికంగా ఆంక్షల సడలింపు

## పరిస్థితిని సమీక్షిస్తున్న గవర్నర్ సత్యపాల్ మాలిక్

శ్రీనగర్,ఆగస్ట్9(ఆర్ఎన్ఎ): గత ఐదు రోజులుగా బయటి ప్రపంచంతో కశ్మీరీలకు సంబంధాలు తెగిపోయిన సందర్భంలో కశ్మీరీలకు ఊరటనిచ్చేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇంటర్నెట్, ఫోన్ సర్వీసులపై విధించిన ఆంక్షలను పాక్షికంగా సడలించింది. శుక్రవారం నాటి ప్రార్థనలను దృష్టిలో పెట్టుకుని .. ఆంక్షల సడలింపు నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఆర్టికల్ 370 తొలగింపు, రాష్ట్ర విభజన నేపథ్యంలో కశ్మీర్‌లో కేంద్రం కర్ఫ్యూ విధించింది. ఇంటర్నెట్, ఫోన్ సర్వీసులను పూర్తిగా నిలిపేసింది. నగరంలోని ప్రధానమైన జమా మసీదు తెరవకపోయినప్పటికీ.. చిన్నచిన్న మసీదుల్లో ప్రార్థనలకు అనుమతిచ్చారు. ప్రార్థనలపై ఎలాంటి ఆంక్షలు లేవని అధికారులు తెలిపారు. ఇదిలా ఉంటే కశ్మీర్ లోయ భద్రతాబలగాల పహారాలో ఉంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. వేలాది మంది సైనికులు కశ్మీర్ నలువైపులా మోహరించి ఉన్నారు. గవర్నర్ సత్యపాల్ మాలిక్ పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమీక్షలు జరుపుతూ.. కేంద్రానికి నివేదిస్తు న్నారు.

### కాశ్మీర్‌లో విద్యార్థుల సంబరాలు

జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేయడాన్ని అక్కడి విద్యార్థులు స్వాగతించారు. ఈ సందర్భంగా కథువాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలపై జాతీయ జెండాను విద్యార్థులు ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ విద్యార్థి నాయకుడు మాట్లాడుతూ.. ఆర్టికల్ 370ని రద్దు చేయడం వల్ల ఈ ప్రాంతం అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. జమ్మూ-కశ్మీర్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా ఏర్పాటు చేయడం శుభపరిణామం అన్నారు. క్రూరమైన నాయకత్వం నుంచి తమకు విముక్తి లభించిందని పేర్కొన్నారు. తమకు ఇప్పుడు స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. ఈ ప్రాంతంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉండేది. ఇప్పుడు మరిన్ని ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉందన్నారు.

# ఆదివాసీల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం: మంత్రి అల్లోల



నిర్మల్ , ఆగష్టు 9: ఆదివాసీల అభివృద్ధే తమ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర అటవీశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. నిర్మల్ పట్టణంలోని శుక్రవారం నిర్వహించిన ఆదివాసీ దినోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. అంతకుముందు పట్టణంలోని రాంజీగోండు విగ్రహనికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఆదివాసీ సంప్రదాయ వేషధారణలో మంత్రి అలరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత ఆదివాసుల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిం దన్నారు. అదివాసీల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపా రు. ఆదివాసుల జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకు అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. త్వరలోనే పోడు భూముల సమస్యను పరిష్కరించి, అర్హులైన వారికి ఆర్ఓఎఫ్ఆర్ కింద పట్టాలను అందిస్తామని స్పష్టం చేశారు. ఆదివాసీ గ్రామాల్లో ప్రభుత్వం స్వయంపాలన అమలుచేస్తున్నదని, అందులో భాగంగానే గిరిజన గ్రామాలను పంచాయతీలుగా చేసిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శశిధర్ రాజు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఎఫ్ఎస్ సిఎస్ చైర్మన్ రాంకిషన్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్, ఆదివాసి సంఘం నాయకులు మొసలి చిన్నయ్య, భూమయ్య, మంద మల్లేష్, భీంరావు, టీఆర్ఎస్ నాయకులు ముడుసు సత్యనారాయణ,రాంచందర్, ఉద్యోగ సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రకటన



న్యూఢిల్లీ, ఆగష్టు 9: 66వ జాతీయ చలన చిత్ర అవార్డులను శుక్రవారం ఢిల్లీలో ప్రకటించారు. జాతీయ ఉత్తమ హిందీ చలన చిత్రం- అంధాధున్, జాతీయ ఉత్తమ తెలుగు చలన చిత్రం- మహానటి, జాతీయ ఉత్తమ ఆడియోగ్రఫీ- రంగస్థలం (రాజాకృష్ణన్), ఉత్తమ మేకప్ అవార్డు- అ, జాతీయ ఉత్తమ స్క్రీన్ ప్లే- చి.ల.సౌ, జాతీయ ఉత్తమ సినిమాటోగ్రఫీ చిత్రం- పద్మావత్, ఉత్తమ సంగీత దర్శకుడు- సంజయ్ లీలా భన్సాలీ(పద్మావత్), జాతీయ ఉత్తమ ఉర్దూ చిత్రం- హమీద్, జాతీయ ఉత్తమ యాక్షన్ చలన చిత్రం- కేజీఎఫ్, బెస్ట్ సినిమాటోగ్రఫీ - ఎంజే రాధాకృష్ణన్(మలయాల చిత్రం ఉలు), బెస్ట్ ఫీమేల్ ప్లేబ్యాక్ సింగర్- బిందుమాలిని(కన్నడ చిత్రం నాతిచారామి), బెస్ట్ కొరియోగ్రఫీ- కృతి మహేశ్ మాధ్య, జ్యోతి తోమర్(పద్మావత్ మూవీలోని గోమర్ పాట), విస్తృత ప్రచారం పొందిన బెస్ట్ ఎంటర్‌టైన్‌మెంట్ చిత్రం- బదాయి హో, బెస్ట్ ఫీచర్ ఫిల్మ్- హెల్లారో(గుజరాత్),

## చరిత్రలో నేటినిజం



కం॥ "తల్లి తెలుంగు"కు చరిత
"మల్లెల పూదండ"నిడు చు - మహాత్ముండై
ఉల్లము ఝల్లను గీతిక
నల్లుట కే పుట్టె "సుందరాచారి" - ధరన్ !!

-రాధశ్రీ

( ఆగష్టు 10 శంకరం బాడి సుందరాచారి జననం) సెల్: 9494481210

# సమస్తం లక్ష్మీదేవి వీక్షణ కటాక్షాలే!!

నేటినిజం
శనివారం 10-8-2019

విద్య, ఐశ్వర్యం, సుఖం, ఆరోగ్యం, ఆనందం, ధనం, ధాన్యం జయం మొదలయినవన్నీ ఎవరికి గుర్తుగా చెబుతారో, ఆమె పేరే లక్ష్మి అని అంటాం. లక్ష్మి అనేది ధాతువునుండి ఏర్పడుతుంది. లక్షణ యుక్తులను గుర్తించి లోక్షణంగా చేసే దేవత కనుక ఆమె లక్ష్మి అయింది. విష్ణువు లాగా లక్ష్మి కూడా నిత్య సర్వాంతర్యామి. విష్ణువు అర్థం అయితే లక్ష్మీదేవి శబ్దం. విష్ణువు నామం జ్ఞాన సముపార్జనం అయితే లక్ష్మి బుద్ధి. విష్ణువు ధర్మం అయితే లక్ష్మి సత్క్రియ. కాకుంటే మనలో విష్ణువు హరినామంగానూ, లక్ష్మి పరమ పదమయినదిగానూ ప్రవచించబడుతోంది. ఫాల్గుణమాసంలో ఉత్తర ఫల్గుణి నక్షత్రం వచ్చేరోజును లక్ష్మీ జయంతిగా పరిగణిస్తారు. భృగుమహర్షి భార్య ఖ్యాతి. ఆమె పుత్రికా సంతానం కోసం తపస్సు చేస్తే ఆదిపరాశక్తి అంశతో ఆమె భార్గవిగా జన్మించింది. అది స్వయంభువ మన్వంతరం స్వారోచిష మన్వంతరంలో అగ్నినుండి ఔత్తమ మన్వంతరంలో స్వచ్ఛమయిన జలంనుంచి అవతరించింది. తామస మన్వంతరంలో భూమినుంచి జనించింది. ఇలా ఫాల్గుణ మాసం ఉత్తరా నక్షత్రంలో శక్రవారం నాడు క్షీరసాగరంనుంచి ఉద్భవించిందంటారు. క్షీర సాగర కన్యగా లక్ష్మీ అవతరణం ఒక సంకేతార్థంగానూ భావించవచ్చు. ఈ జగత్తు ఒక సాగరం. అది సంసారమా? లేక ధనమా? లేక ధాన్యమా ఏదయినా కావచ్చు. ఏదో ఒకటి కావాలనుకునే తపన కావచ్చు ఏదయినా మనలోని దుర్గుణాలను దేవమానవులుగా సంపద కోసం మనం చేసే మధనమే క్షీర సాగరమధనం. ఈ మధనంలో హాలాహలం వంటి చేదు అనుభవాలు. అపుడు భగవంతుడు ఏదో ఒకరూపం అది శివుడు కావచ్చు, విష్ణువు కావచ్చు ఏదో ఒకరూపంలో వచ్చి మనల్ని అనుగ్రహిస్తాడు. మరింతగా సాధన చేస్తే సంపదలు వస్తాయని, ఈ సంపదలను కూడా భావగర్భితంగా స్వీకరించాలని అన్వయిస్తారు. ఈ భావమే క్షీరసాగరం నుంచి ఆవిర్భవించిన లక్ష్మిని హరి చేపట్టడం. లక్ష్మీనారాయణుని కళ్యాణం కూడా ఫాల్గుణమాసంలో ఉత్తరా నక్షత్రయుక్తంగానే జరిగిందని విజ్ఞులు చెబుతారు. శ్రీరాముని ధర్మపత్ని సీతమ్మ జననం కూడా ఫాల్గుణ శుద్ధ పూర్ణిమ ఉత్తర నక్షత్ర ద్వితీయపాదంలోనే త్రేతాయుగంలో జరిగిందని పండితులు చెబుతారు. శ్రీ లక్ష్మి కరుణా రూపిణి. ఈ లోకంలో మంగళకరమయినవి, ఉత్తమమయినవి, ప్రకాశవంతమయినవి. ఘనమయినవి. పవిత్రమయినవి. అదృష్టమయినవి పదార్థాలన్నీ ఆ లక్ష్మీ కరుణావీక్షణాలే అనడానికి సందిగ్ధం అవసరంలేదు.. అష్ట లక్ష్ముల ఇష్ట లక్ష్ముల రూపాల్లో ఆకాశంలో కొంతభాగం. నేలపై మరికొంతభాగం అవతరించినా అన్నీ ఆమె అంశాలే కానీ మరే ఇతరాలు కానేకావు. కానీ లక్ష్మి ఎక్కడుంటుంది? ఇంటా బయటా అనేది ఒక ప్రశ్నే? ఉంటుంది అంటే అన్నింటా, లేదేమో అనుకుంటే లేకుండానే ఉంటుంది.. విష్ణువు అవతారాలకు దేహధారిణి అవుతుందని భక్తుల నమ్మకం అటుంచితే, శుభ్రత, స్వచ్ఛత,సౌమ్యత, నమ్రత లాంటివి ఎక్కడ ఉంటే అదే లక్ష్మీనారాయణుని ఆలయమవుతుందని చెపితే మీకు అర్థమవుతుందా?

## జిల్లాలో జోరుగా హరితహారం

### 27 ప్రభుత్వ శాఖలకు లక్ష్యాల నిర్దేశం

జనగామ,ఆగస్ట్9(ఆర్ఎన్ఎ): జిల్లాలో అడవుల శాతం పెంచి కరువును తరిమికొట్టేందుకు జిల్లా యంత్రాంగం ముందుకు సాగుతున్నది. పండ్ల మొక్కలు, గృహాల్లో పెంచుకునే మొక్కలు, రోడ్లు, కాలువలు, చెరువుల పక్కన నాటే మొక్కలు, రైతులు పొలాల్లో నాటుకునేందుకు టేకు, ఎర్రచందనం, వెదురు, సిల్వర్ఓక్, ఈత, కానుగ, ఫెల్టోఫామ్, గుల్మొహర్, రేల, రెయిన్ట్రీ, నిమ్మ, జామ, మునగ, కరివేపాకు, వేప, రావి, అల్లనేరడు, మర్రి సహా ఉద్యానశాఖ ద్వారా 12 లక్షల పండ్ల మొక్కలు నాటుతున్నారు. జిల్లా వ్యాప్తంగా వరుసగా కురుస్తున్న మోస్తరు వర్షాలతో ఐదో విడత హరితహారం కార్యక్రమం ఊపందుకున్నది. జిల్లా యంత్రాంగం మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఇప్పటికే ప్రతీ గ్రామానికి ఐదు వేల చొప్పున మొక్కలు సరఫరా చేసిన అధికారులు గుంతలు తీసి వాటిని నాటించి రక్షణ కోసం ముళ్లకంచెలు ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ఇంటి ఆవరణలో ఒక్కొక్కరు ఆరు మొక్కల చొప్పున నాటేందుకు రంగం సిద్ధమైంది. ఈ విడత జిల్లాలో 1.68 కోట్ల మొక్కలు నాటే లక్ష్యంతో 305 నర్సరీల్లో మొక్కలు పెంచి ప్రభుత్వ శాఖల వారీగా లక్ష్యాలను నిర్దేశించారు. ప్రధానంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతను ఆయా గ్రామాల సర్పంచులకు అప్పగించడంతో మహిళా, యువజన, స్వచ్ఛంద సంస్థలు, వివిధ సంఘాల సహకారంతో విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో జిల్లాలోని 27 ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, ఉద్యోగుల భాగస్వామ్యంతో గ్రామానికి ఐదు వేల మొక్కలు నాటే మెగా హరిత ప్లాంటేషన్ నిర్దేశించారు. లక్ష్యాలకు అనుగుణంగా గ్రామాల వారీగా అధికారులు, సిబ్బందిని కేటాయించగా ఉదయం నుంచే ఎంపిక చేసిన ప్రాంతాల్లో గుంతలు తీసి మొక్కలు సిద్ధం చేసుకొని ఒకేసారి నాటారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఖాళీ స్థలాల్లో అన్ని రకాల మొక్కలు, వ్యవసాయ పొలం గట్ల వెంట టేకు మొక్కలు నాటారు.

## సభ్యత్వ నమోదులో ముందున్న వారికి గుర్తింపు

### గ్రామ కమిటీల్లో పెద్దపీట వేయనున్న టిఆర్ఎస్

కామారెడ్డి,ఆగస్ట్9(ఆర్ఎన్ఎ): గ్రామ పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికలతో గ్రామాల్లో ప్రజా మద్దతును కూడగట్టుకున్న తెలంగాణ రాష్ట్ర సమితి మరింత బలోపేతం దిశగా అడుగులు వేస్తున్నది. ఇందులో భాగంగా గ్రామ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేస్తూ క్యాడర్కు నూతన బాధ్యతలను అప్పగిస్తున్నది. పార్టీ పదవులను చేపట్టేందుకు గ్రామ స్థాయిలో నేతలు పోటీ పడుతున్నారు.

కామారెడ్డి నియోజకవర్గంలో గ్రామ కమిటీ బాధ్యతలతో కింది స్థాయి నాయకులందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆదేశాల మేరకు జూన్, జులై నెలల్లో చేపట్టిన సభ్యత్వాల సందడి పూర్తవ్వగా గ్రామ, వార్డు స్థాయి కమిటీల ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతున్నది. జిల్లా వ్యాప్తంగా 2లక్షల సభ్యత్వాల నమోదు ప్రక్రియ పూర్తవ్వగా ఇప్పుడు కమిటీల రూపకల్పనలో పార్టీ ఇన్చార్జులతో కలిసి ఎమ్మెల్యేలు కసరత్తు చేస్తున్నారు.

గ్రామ కమిటీల నియామకం మొదలవ్వడంతో తెలంగాణ రాష్ట్ర సమితి క్యాడర్లో జోష్ కనిపిస్తున్నది. పార్టీని మరింతగా బలోపేతం చేయడంతో పాటుగా వాడవాడలో తెలంగాణ ప్రభుత్వ లక్ష్యాలను తీసుకుపోతామని అంటున్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పథకాలను క్షేత్ర స్థాయికి తీసుకు పోయేందుకు కృషి చేస్తామని వారంతా ధీమా వ్యక్తం చేస్తున్నారు. గ్రామ కమిటీల కూర్పుపై టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దృష్టి సారించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పకడ్బంది వ్యూహాలకు తగ్గట్లుగా నియోజకవర్గానికి 50వేల సభ్యత్వాలను పూర్తి చేసిన తదుపరి కమిటీలపై నేతలు దృష్టి సారించారు.

జిల్లాలో కామారెడ్డి, బాన్సువాడ, జుక్కల్, ఎల్లారెడ్డి నియోజకవర్గాలు లక్ష్యాన్ని చేరుకున్నాయి. డిజిటలైజేషన్ ప్రక్రియను సైతం పూర్తి చేసుకుని తదుపరి ప్రక్రియ అయినటువంటి గ్రామ కమిటీల నియామకంపై ముఖ్య నాయకులంతా దృష్టి సారించారు. పార్టీ సభ్యత్వాల డ్రైవ్ ఇన్చార్జులు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకుల సమక్షంలో గ్రామ కమిటీల కూర్పుపై మండలానికి నలుగురేసి బృందాలను నియమించారు. ఈ నలుగురు పార్టీ నాయకులు కలిసి గ్రామ కమటీలకు బాధ్యులను ఎంపిక చేసి జాబితాలను ఎమ్మెల్యేలకు అందజేస్తారు.

# కశ్మీర్ అభివృద్ధికి కఠిన చర్యలే మందు

హైదరాబాద్, ఆగష్టు 9:అందాల కశ్మీర్ను మళ్లీ భూతలస్వర్గం చేద్దామని ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు విపక్షాలకు కనువిప్పు కావాలి. కాశ్మీర్ పునర్నిర్మాణంలో అంతా తమవంతు పాత్ర నిర్వహించాలి. కాశ్మీర్ విషయంలో రాజకీయాలు పక్కన పెట్టాలి. దేశం యావత్తూ ఈ విషయంలో ఒక్కటిగా ఉందన్న సమాచారాన్ని ప్రజలకు ప్రపంచానికి తెలియచేయాలి. ఇందులో భాగంగా అంతా కలసి కాశ్మీర్ అభివృద్ధికి తమవంతుగా నడుం బిగించాలి. రాజకీయ విమర్శలు మాని అభివృద్ధికి పాటుపడాలి. అప్పుడే ప్రజలు విపక్షాలను ఆదరిస్తారు. లేకుంటే కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలతో సహా చిన్నాచితకపార్టీలకు కూడా భారత రాజకీయాల్లో ఇక స్థానం లేకుండా చేస్తారు. ఇకపోతే జాతీయభద్రతా సలహాదారు అజిత్ ధోవల్ కాశ్మీర్ పర్యటనలో స్థానికులతో కలసి టీ తాగడం,భోజనం చేయడంపై ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి,రాజ్యసభలో విపక్ష నేత గులాంబీ ఆజాద్ చేసిన వ్యాఖ్యలు ఆయన కుత్సిత బుద్ధిని చాటాయి. ఇన్నేళ్ల రాజకీయంలో ఓ సమస్యకు పరిష్కారం చూపే క్రమంలో చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా అజిత్ ధోవల్ కాశ్మీర్లో పర్యటిస్తున్నారు. ధోవల్ ఫోటోలను చూసి కిరాయి మనుషులను తెచ్చుకున్నారని ఆజాద్ చేసిన వ్యాఖ్యలు ఆజాద్ కుళ్లురాజకీయ నేత అన్న విషయాన్ని చాటుకున్నారు. ఆజాద్కు కాశ్మీర్ బాగుపడడం ఇష్టం లేదని తేలిపోయింది. ఇకపోతే కరణ్ సింగ్ తదితరులు కూడా కాశ్మీర్ విషయంలో సానుకూల వ్యాఖ్యలుచేసి తమ ఔన్నత్యాన్ని చాటుకున్నారు. పాక్ బాలలహక్కుల నేతగా నోబెల్ ప్రైజ్ పొందిన మలాలా కూడా కాశ్మీర్ విషయంలో తన కుత్సిత బుద్ధిని చాటుకున్నారు. ఆమెకు ఉదారభావాలు లేవని బయటపడ్డారు. పాక్లో తాలిబన్ల మారణ హోమాలు మరచి పోయి కాశ్మీర్ గురించి మాట్లాడడం ఆమె సంకుచిత స్వభావానికి నిదర్శనంగా చూడాలి. తాలిబన్ల దాడుల నుంచి ఆమె ప్రాణాలు దక్కించుకుని ప్రవాసజీవితం గడుపుతున్న విషయం మరచి పోయినట్లుగా ఉన్నారు. పాక్ గురించి,తాలిబన్ల ఘాతుకాల గురించి మాట్లాడలేని మలాలా కాశ్మీర్ గురించి మాట్లాడడం క్షంతవ్యం కాదు. అందుకే ప్రధాని మోడీ తన ప్రసంగం ద్వారా రాజకీయాలు లేని కాశ్మీర్ అభివృద్ధి గురించి మాట్లాడారు. కాల్పుల మోతలు వినిపించని, ఉగ్ర భూత విషఛాయలు లేని ప్రశాంత కశ్మీరాన్ని సృష్టించు కుందామని నవ సంకల్పాన్ని జాతి ముందు ఆవిష్కరించారు. త్వరలోనే మంచి రోజులొస్తాయని కశ్మీరీలకు హామీ ఇచ్చారు. జమ్మూ-కశ్మీర్కు స్వయం ప్రతిపత్తిని అందించే అధికరణం 370 రద్దు.. దేశం చరిత్రలో ఓ చారిత్రక ఘట్టంగా నిలచిపోతుంది. ఇలాంటి సాహసోపేత, చరిత్రాత్మక నిర్ణయానికి దారితీసిన పరిస్థితులు, కలిగే ప్రయోజనాలను దేశానికి, ప్రపంచానికి ప్రధాని మోడీ వివరించే క్రమంలో తన సంకల్పాన్ని ప్రకటించారు. ప్రధాని మోదీ కశ్మీరీ ప్రజలకు నమ్మకం, ఆశావహ దృక్పథాన్ని కలిగించే సందేశాన్నిచ్చారు. భవిష్యత్తులో అసెంబ్లీకి జరిగే ఎన్నికలతో ఉత్సాహవంతులైన యువత ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్యమంత్రి అవుతారని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ సంకల్పంలో నిజాయితీ ఉంది. దీనికి అనుగుణంగా ప్రధాని నడుచుకునేలా రాజకీయపార్టీలు పనిచేయాలి. ఈ మహాజ్ఞంలో భాగస్వాములు అవుతారా లేదా అన్నది రాజకీయా పార్టీలు నిర్ణయించుకోవాలి. నిజానికి 370 అధికరణ రద్దు అన్నది కేవలం బిజెపికి మాత్రమే సాధ్యం అయిన చర్య. ఎన్నోఏళ్ఉలగా అపరిష్కృత సమస్యగా, గుదిబండగా ఉన్న 370 ఆర్టికల్ను పీకి పారేయడం అంత తేలికైనదిగా చూడరాదు. ఉగ్రవాదులకు మానవులను చంపడమే తెలుసు. వారిని బతికించడం లేదా కాపాడడం తెలియదు. ఇస్లాం పేరుతో సృష్టిస్తున్న మారణహోమం కారణంగా కాశ్మీర్ సహా ప్రపంచవ్యాప్తంగా దశాబ్దాలుగా లక్షలమంది హతమవుతున్నారు. అమాయక ప్రజలు జీవితాలను కోల్పోతున్నారు. ఎందరో క్షతగాత్రులగా జీవితనరకం అనుభవిస్తున్నారు. ఉగ్రదాడులకు తెగబడుతున్న వారు ఇస్లాంపేరు చెప్పి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. భారత్లో ఎన్నో ఉగ్రదాడులు జరిగాయి. ప్రపంచం యావత్తూ కన్నా భారత్లోనే దాడులు ఎక్కువగా ఉన్నాయి. ఐఎస్ సృష్టిస్తున్న మారణహోమం వల్ల ఎందరో అమాయక ప్రజలు ఆహుతవుతున్నారు. సరిహద్దుల్లో స్వయంగా పాక్ ప్రభుత్వం ఉగ్రదాడులను ప్రేరేపిస్తున్నది. ఆల్ఖైదా, ఐసిస్, తాలిబన్, లష్కరే తోయిబా ఇలా పేర్లు ఏవైనా మారణహోమం సృష్టించడమే వారి పనిగా ఉంది. కాశీ÷-మర్ నిత్యరావణకాష్టంగా రగిలిపోవడానికి ఉగ్రవాదుల దుశ్చర్యలే కారణం. పైశాచికానందం వారికి అలవాటయ్యింది. ఇలాంటి సంస్థలను, ప్రోత్సహిస్తున్న వారిని అంతకుఅంతగా దారుణంగా తెగనరకాలి. పట్టుబడ్డవారిని విచారణలప పేరుతో కాలయాపన చేయరాదు. ప్రధానంగా భారత్లో ఉగ్రవాదులకు కొమ్ముకాస్తున్న వారిని బహిరంగంగా కడతేర్చాలి. ఇలాంటి చర్యలతో వారు ఉగ్రవాదులకు సాయం అందించాలంటేనే భయం కలిగేలా చేయాలి. కాశ్మీర్లో శాతంఇ కోసం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా అభివృద్ధి లక్ష్యంగ ముందుకు సాగే క్రమంలో కేంద్రం కఠిన చర్యలకు ఉపక్రమించాలి. ఉగ్ర మూకలకు సహకారం ఇస్తున్న వరిని కిరాతకంగా శిక్షించాలి. రాబోయే రోజుల్లో మరింత విధ్వంసానికి సిద్ధంగా ఉండమని ఐఎస్ హెచ్చరిస్తున్న నేపథ్యంలో ప్రపంచం యావత్తూ అప్రమత్తం కావాలి. ఉమ్మడిగా ఉమ్మడి శత్రువును ఎదుర్కోవాలి. కాశ్మీర్ కోసం ఎంతటి సాహసోపేత నిర్ణయాలకైనా వెనకాడరాదు. సీమాంతర ఉగ్రవాదాన్ని నిరోధించేందుకు ఎంతటి చర్యలకైనా దిగాల్సిందే. మతం పేరుతో సాగించే మారణహోమాన్ని తుదముట్టించి కాశ్మీర్ ప్రజలకు భరోసా ఇచ్చే క్రమంలో కేంద్రం అనేక విధాలుగా కసరత్తు చేయాలి. అభివృద్ధికి నిధులు వెచ్చించాలి. విద్య,వైద్యం,ఉపాధి రంగాలను మార్గాలుగా ఎంచుకుని ముందుకు సాగాలి. అప్పుడే విజయం సాధ్యం అవుతుంది.

# ఉగ్రవాద నిర్మూలనకు ఉమ్మడి ఎజెండా కావాలి

### ప్రపంచ దేశాలు కలసికట్టు పోరు సాగించాలి
### ఐరాస ఆధ్వర్యంలో ప్రత్యేక విభాగం ఏర్పరచాలి

న్యూఢిల్లీ,ఆగస్ట్9(ఆర్ఎన్ఎ): ప్రపంచ దేశాలన్నీ ఉగ్రమూకలను చెండాడే క్రమంలో ఏకాభిప్రాయంతో ముందుకు సాగాలి. ఉగ్రవాద నిరోధక చట్టాలను సమీక్షించి, వాటికి మరిన్ని కోరలు తొడిగే పని చేయాలి. బ్రిటన్, శరణార్థులను నియంత్రించే చర్యలు చేపట్టింది. శరణార్థుల ప్రవేశాన్ని అడ్డుకుంటే ఉగ్రవాద దాడులు తగ్గిపోతాయని బ్రిటన్ పాలకులు తప్పుడు భావాన్ని ప్రజల్లో ఎక్కిస్తున్నారు. ఉగ్రవాదులు మూకుమ్మడిగా ఆయుధాలతో దాడి చేయడం ఒకప్పటి పద్ధతి. ఇప్పుడు దాని రూపం మారింది. గుంపు దాడి స్థానే ఏక వ్యక్తి తరహా దాడులను అది అనుసరిస్తున్నది. మాంచెస్టర్, లండన్, పారిస్, నీస్, బ్రస్సెల్స్, స్టాకహే?మ్, బెర్లిన్, కోపెన్ హాగెన్లలో ఇటీవల చోటు చేసుకున్న దాడుల్లో ఎక్కువ భాగం ఈ కోవకు చెందినవే. దీనికి పెద్ద నెట్వర్కు ఏమీ అవసరం వుండదు. ఇంటర్నెట్ వుంటే చాలు. తనకు తాను చావడానికి సిద్ధమైనవారు ఆత్మాహుతి బాంబర్లుగా మారతారు. వీరి లక్ష్యాలు జనం రద్దీ ఎక్కువగా వుండే రైల్వేస్టేషన్లు, సబ్వేలు, మార్కెట్లు, ఎరీనాలే. ఈ తరహా ఉగ్రవాదం నేడు మానవాళికి ఒక సవాలుగా మారింది. డబ్బు, అధునాతన టెక్నాలజీ, మానవ వనరులను మరింతగా వెచ్చిస్తే ఉగ్రవాదం పీచమణచేయడం ఏమంత కష్టం కాదని ట్రంప్ మొదలుకుని మన ప్రధాని మోడీ దాకా కొందరు నేతలు వాదిస్తుంటారు. ఈ రకమైన విధానంతో ఉగ్రవాదాన్ని ఓడించిన దాఖలాలు ప్రపంచంలో ఎక్కడా కానరావు. అపారమైన మానవ వనరులు వృథా కావడం తప్ప. ఉగ్రవాదానికి ఆజ్యం పోసే విధానాలొకవైపు అనుసరిస్తూ, మరో వైపు ఉగ్రవాదం అంతు చూస్తామని ప్రగల్భాలు పలకడం పాలకుల ద్వంద్వ ప్రవృత్తికి నిదర్శనం. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తరువాత ఇస్లామిక్ ఫోబియాను అమెరికా విదేశాంగ విధానంలో ఒక భాగంగా మార్చేశారు. ఇరాక్లో చమురు వనరులతో సుసంపన్నమైన మోసుల్ను ఐసిస్ నుంచి వశపరచుకోవడం కోసం అమెరికా, బ్రిటన్ దళాలు ఆ ప్రాంతంపై బాంబుల వర్షం కురిపించి అనేక మంది అమాయక పౌరుల ప్రాణాలను తోడేశాయి. మోసుల్పై దాడికి ప్రతీకారమే మాంచెస్టర్ ఘటన అని చెప్పే ఐసిస్ వంటి సంస్థలది మరో రకమైన ఉగ్రవాదం. ఈ రెండు రకాల ఉగ్రవాదాలు మానవాళికి ప్రమాదకరమైనవే. ఐసిస్ను బూచిగా చూపి అమెరికా, పశ్చిమ దేశాల దుర్మార్గాలకు ప్రతీకారం పేరుతో ఐసిస్ దాడులకు దిగుతున్నాయి. చివరికి ఇదొక విషవలయంగా మారిపోయింది. అంతిమంగా దీనికి సమిధలవుతున్నది అమాయక ప్రజానీకం. ఈ విషవలయాన్ని ఛేదించాలి. ఉగ్రదాడుల ఘటనలు పునరావృతం కాకుండా చూడాలంటే వాతావరణంపై అంతర్జాతీయ స్థాయిలో చొరవ చూపినట్లుగానే, ఉగ్రవాదంపైనా ఐరాస చొరవ చూపాలి. ప్రజల మధ్య విద్వేషాలు, అపోహలు, అపనమ్మకాలు పెంచే విచ్ఛిన్నకర పోకడల స్థానే పరస్పర విశ్వాసం, సౌభ్రాతృత్వం ఆలంబనగా అందరూ ఒక్కటేనన్న భావన ప్రజల్లో పెంపొందించాలి. సహనం, పరస్పర గౌరవం వంటి విలువలకు పట్టం గట్టాలి. ఈ మార్గం విడిచిపెట్టి ఉగ్రవాదంపై పోరు పేరుతో తమకు గిట్టని దేశాలపైన దాడులు చేయడం, వాటి సార్వభౌమత్వాలను కాలరాయడం వంటి దుస్సాహసిక చర్యలను కొనసాగించడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదు. ఇఅ చేస్తూ పోతే మరింతగా ఊతమిచ్చిన వారం అవుతాం తప్పమరోటి కాదు.

# ఉపాధి పనుల్లో అక్రమాలకు చెక్

### స్థానిక అవసరాలకు అనుగుణంగా పనులు

ఆదిలాబాద్,ఆగస్ట్9 (ఆర్ఎన్ఎ): ఉపాధి పనుల్లో అక్రమాలు జరగకుండా చర్యలు చేపడుతున్నామని జిల్లా గ్రామీణా భివృద్ధిశాఖాధికారి స్పష్టం చేశారు. పనుల విభజన మొదలు వివిధ పనులను అవసరం ఉన్న మేరకు తీసుకుంటున్నామని అన్నారు. పక్కాగా పనులకు సంబంధించి ప్రణాళిక చేపట్టి, ఉపాధిహామీ పథకం ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు. రైతులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ క్షేత్రసహాయకులను సంప్రదించి వీటిని ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ పథకలను రైతులు వినియోగించుకోవాలని అన్నారు. ఈ పథకం ద్వారా కూరగాయల పందిళ్లు, శ్మశానవాటికలు, పశువులపాకలు, నీటితొట్టెలు, నాడెపు కంపోస్టులు, మల్బరితోటలు, ఇంకుడుగుంతల నిర్మాణం, మట్టికట్టలు వేయుట, సమతల కందకాలు తవ్వటం, వూటకుంటలు, పండ్లతోటల పెంపకం, వర్షపునీరు నిల్వచేసే కట్టడాలు, నర్సరీల పెంపకం, గ్రామాల్లో ఆటస్థలాలు, సీసీ రోడ్ల నిర్మాణం, పాఠశాలల్లో కిచెన్షెడ్లు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంతో పాటు ఇతరాత్ర చాలా వరకు ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. వీటిని పూర్తిగా వందశాతం రాయితీతో ఏర్పాటు చేసుకునే సౌలభ్యం ఉంటుందని పేర్కొన్నారు.

## కాశ్మీర్లో 370 ఆర్టికల్ రద్దుతో బిజెపి శ్రేణుల్లో జోష్

### వచ్చే ఎన్నికలే లక్ష్యంగా కార్యాచరణ

కొత్తగూడెం,ఆగస్ట్9(ఆర్ఎన్ఎ): కాశ్మీర్లో 370 ఆర్టికల్ రద్దుతో ఇప్పుడు బిజెపి శ్రేణుల్లో జోష్ కనిపిస్తోంది. బిజెపికి పల్లె ప్రాంతాల్లోనూ ఇప్పుడు ప్రజలుజేజేలు పలుకుతున్నారు. దీనిని త్వరలో జరిగే మున్సిపల్ ఎన్నికల్లో అనుకూలంగ ఆమార్చుకోవాలని చూస్తున్నారు. కొత్తగా ఏర్పడ్డ భద్రాద్రి జిల్లాలో మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటాలని బిజెపి ఉవ్విళ్లూరుతోంది. అందుకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ వేస్తోంది. జిల్లాలో మొత్తం ఆరు మున్సిపాలిటీలు ఉండగా, కేవలం రెండు మున్సిపాలిటీలకు మాత్రమే ఎన్నికలు జరుగనున్నాయి. ఇ÷-లలెందు, కొత్తగూడెం మున్సిపాలిటీల్లో మాత్రమే అధికార యంత్రాంగం వార్డుల హేతుబద్ధీకరణ, రిజర్వేషన్ల సర్వే చేపడుతోంది. ఈ నేపథ్యంలో బీజేపీ ఈ రెండు మున్సిపాలిటీల్లో బలం పెంచుకునేందుకు తగిన ప్రయత్నాలు చేస్తోంది. కొత్తగూడెం పట్టణంలో ఆ పార్టీకి కొంతమేరకు ఓటింగ్ ఉండగా, ఇల్లెందు మున్సిపాలిటీలో మాత్రం కొన్ని వార్డుల్లో బహుముఖ పోటీ జరిగితే గెలుపొందే అవకాశాలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణ ప్రాంతాల్లో కొంతమేరకు బలం కలిగిన బీజేపీ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సరికొత్తగా ముందుకు వెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పూర్తిగా ఏజెన్సీ జిల్లా కావడంతో జిల్లాలో ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావును తరచూ పర్యటించేలా ప్రణాళికలు తయారుచేస్తున్నట్లు చెప్పారు. ఆదివాసీ గిరిజనుల సమస్యల పట్ల పూర్తి అవగాహన ఉండి, సుదీర్ఘకాల పోరాటాలు చేసిన బాపూరావు పర్యటనల వల్ల పార్టీకి మేలు కలుగుతుందని, బలపడేందుకు అవకాశాలు పెరుగుతాయని అంటున్నారు. జిల్లాలోనూ ఆదివాసీల పోడుభూముల సమస్య ఎక్కువగానే ఉంది. ఈ క్రమంలో ఆదివాసీల సమస్యల విషయంలోనూ ఏజెన్సీలో బాపూరావును విస్తృతంగా తిప్పాలని యోచిస్తున్నారు. ఇప్పటికే గ్యాస్ పంపిణీ ద్వారా మహిళలకు దగ్గరయ్యామని, ఈడబ్ల్యూఎస్కు 10 శాతం రిజర్వేషన్ ద్వారా యువతకు దగ్గరయ్యామని, తాజాగా మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పట్టణ ప్రాంతాలపై మరింత దృష్టి పెట్టినట్లు తెలిపారు. వివిధ పార్టీల్లోని అసంతృప్త నాయకులను కేంద్ర మంత్రుల సమక్షంలో చేర్చుకు నేందుకు తగినవిధంగా పలువురితో మంతనాలు సైతం జరుపుతున్నారు. ముఖ్యంగా ఎన్నికలు జరుగుతున్న రెండు మున్సిపాలిటీలపై ఎక్కువ దృష్టి సారించారు. వార్డుల్లో బహుముఖ పోటీ ఉంటే గెలుపొందే అవకాశాలున్న నాయకులపై మరింత నజర్ పెట్టారు. ఆగస్టు 12వ తేదీ నుంచి బూత్ కమిటీలను వేయనున్నారు. సెప్టెంబర్ ప్రణాళికలు పొందించుకుంటున్న బీజేపీ ఈ రెండు మున్సిపాలిటీలపై ప్రత్యేక దృష్టి సారించింది. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పూర్తి మెజారిటీతో ఉండడంతో పాటు, రాష్ట్రంలోనూ 4 పార్లమెంటు స్థానాలు గెలవడంతో కొంతమేరకు జిల్లాలోనూ జోష్ పెరిగిందని జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్రెడ్డి చెబుతున్నారు.

## రైతుల సంక్షేమమే సిఎం కెసిఆర్ లక్ష్యం

### కాంగ్రెస్ నేతలు విమర్శలు మానుకోవాలి: ఎమ్మెల్యే

నిజామాబాద్,ఆగస్ట్9(ఆర్ఎన్ఎ): రైతులకు అండగా నిలబడి, వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు తెలంగాణ సిఎం కెసిఆర్ నడుం బిగించారని అర్బన్ ఎమ్మెల్యే బీగాల గణెశిశ్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక రైతు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రైతుల ముఖాల్లో చిరునవ్వులు నింపుతోందని అన్నారు. పంట పెట్టుబడి కోసం రైతులు వడ్డీ వ్యాపారులకు చేయి చాపకుండా ఉండాలని సీఎం కేసీఆర్ రాష్ట్రంలోరైతుబంధు చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. రాత్రింబవళ్లు పొలాల వద్ద కష్టపడి పని చేసే రైతులు దుర దృష్టవశాత్తు చనిపోతే కుటుంబం రోడ్డున పడుతుందని, సీఎం కేసీఆర్ రైతుకు బాసటగా ఉంటూ రైతుబీమా అనే బృహత్తర పథకాన్ని అమలు చేసి రైతు కుటుంబాలకు అండగా నిలిచారని కొనియాడారు. శ్రీరాం సాగర్ పునరుజ్జీవ పథకంతో రైతులకే కాకుండా ప్రజలకు కూడా తాగునీటి సమస్య శాశ్వతంగా తొలగిపోగలదని అన్నారు. ఈ పథకం ఏడాదిలోనే పూర్తి చేయాలన్న సంకల్పమే గొప్పదని అన్నారు. నీటి విడుదలకు సంబంధించి కాంగ్రెస్ నేతలు రాజకీయాలు మానుకోవాలన్నారు. మిషన్ భగీరథ కింద వాటర్ ట్యాంక్, పైపు లైన్ ఏర్పాట్లు చురకుగా సాగుతున్నాయని అన్నారు. ఈ ఏడాది చివరికల్లా ప్రతి ఇంటికి తాగునీరు అందించే దిశగా మిషన్ భగీరథ పనులు జరుగుతున్నాయన్నారు. ప్రాజెక్టులకు అడ్డుపడి కోర్టు కేసులతో రైతాంగం కడుపుకొట్టే పనికి పూనుకుంటున్న కాంగ్రెస్ నాయకులను ఎక్కడికక్కడ నిలదీయాలని పిలుపునిచ్చారు. ప్రతి నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు రూ. 50 కోట్లు చొప్పున

ప్రత్యేక నిధులను కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. నీళ్లు, నిధులు, సంక్షేమ ఫలాల అమలులో ప్రపంచ దేశాలన్నీ తెలంగాణ వైపే చూస్తున్నాయని, కళ్లులేని కబోదిల్లాగా కాంగ్రెసోళ్లు వ్యవహరించడం వారి అనైతికం అని విమర్శించారు. 70ఏళ్ల పాలనలో కాంగ్రెస్ చేయని విధంగా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ కేవలం పాలనలో తూచా తప్పకుండా అమలు చేసిన ఘనత సీఎం కేసీఆర్కు మాత్రమే దక్కిందన్నారు. ఇకపోతే సంక్షేమమే లక్ష్యంగా సిఎం కెసిఆర్ డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించి ఇస్తున్నారని అన్నారు.

# భారీ వర్షాలతో అంతటా నదులకు జీవం

## ఎగువన వర్షాలు లేక జలకళ తప్పిన మంజీర మంచినీటి పథకాలకు తీవ్ర ఇబ్బందులు

సంగారెడ్డి,ఆగస్ట్9(నేటినిజం ప్రతినిధి) దేశవ్యాప్తంగా నదులు ఉప్పొంగుతున్నా, వరదుల ముంచెత్తుతున్నా జీవనది మంజీర మాత్రం జలకళను సంతరించుకోలేదు. ఎగువన కర్నాటక తీరంలో వర్షాలు కురియకపోవడంతో మంజీరకు నీటి రాక స ఆగడం లేదు. నదిలోకి నీరు రాకపోవడంతో జిల్లావాసులు కలవర పడుతున్నారు. రాష్ట్రంలోని ఆయా ప్రాంతాల్లోని ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతున్నా మంజీరా నదిలో మాత్రం నీరుచేరలేదు. ఓ వైపు గోదావరి,మరోవైపు కృష్ణానదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కర్ణాటక రాష్ట్రంలో పుట్టి ప్రవహించే మంజీరా నది జిల్లాలోని నాగల్‌గిద్ద మండలం గౌడ్‌గాంజన్‌వాడ వద్ద ప్రవేశిస్తుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో నది ప్రవేశ ప్రాంతం నుండి ఎక్కడా నీరు రాలేదు. కర్నాటక రాష్ట్రంలో కురిసే భారీ వర్షాలు, వరదలతో నదిలోకి నీరు వచ్చి చేరే అవకాశాలు ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం బీదర్ ప్రాంతంలో కూడా వర్షాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. కర్ణాటకలో కురిసిన వర్షం వల్ల మంజీరాకు ఎగువన బీదర్ జిల్లా హుమ్నాబాద్ ప్రాంతంలో ఉన్న కరంజా ప్రాజెక్టులోకి కొంత నీరు వచ్చి చేరింది. ఈ ప్రాజెక్టు నుండి నీటిని కిందకు వదలడం లేదు. కరంజా ప్రాజెక్టులోకి భారీగా వరదలు వచ్చి చేరినప్పుడే ఈ ప్రాజెక్టు నుండి దిగువకు వరద నీరు వదిలే అవకాశం ఉంది. మంజీరాపై ఆధారపడి నారాయణఖేడ్‌తోపాటు జహీరాబాద్, అందోల్ నియోజకవర్గాల నీటి పథకాలు పని చేస్తున్నాయి. నదిలో నీరు లేని కారణంగా మూడు నెలలుగా నీటి పథకాలు వట్టిపోయాయి. వందల గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తింది. చాలా గ్రామాల్లో బోర్లను కిరాయికి తీసుకోవడం, ట్యాంకర్లను ఏర్పాటు చేసి తాగునీటిని అందిస్తున్నారు. వందల గ్రామాలకు దీనిద్వారానే తాగునీరు సరఫరా అవుతుంది. ఈ నీటి పథకాల ఇన్‌టెక్ వెల్‌లు అన్నీ మంజీర నదిపైనే ఉన్నాయి. నది ఎండిపోవడంతో సమీప గ్రామాలతోపాటు బోర్లు కూడా ఎండపోతున్నాయి.

# ఆపరేషన్ ముస్కాన్‌లో 13మందికి విముక్తి

హైదరాబాద్,ఆగస్టు9 (ఆర్ ఎన్‌ఎ): ఆపరేషన్ ముస్కాన్‌లో మరో 13 మంది బాలలను రక్షిచారు. బిహార్ రాష్ట్రానికి చెందిన 13 మంది చిన్నారులను వెట్టిచాకిరి నుంచి రాచకొండ పోలీసులు రక్షించారు. వీరంతా 10 నుంచి 12 ఏళ్ల వయస్సు గల బాల, బాలికలు. బాలాపూర్ ఆరాఫత్ కాలనీలో గల ఓ గాజుల తయారీ పరిశ్రమలో గత కొంతకాలంగా పనిచేస్తున్నారు. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా పోలీసులు గాజుల తయారీ కేంద్రంపై దాడి చేసి బాలలను రక్షించారు. చిన్నారులను పనిలో కుదిర్చిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# తెలంగాణలో కాంగ్రెస్ పని అయిపోయింది

హైదరాబాద్,ఆగస్టు9(ఆర్‌ఎన్‌ఎ): తెలంగాణలో కాంగ్రెస్ దుకాణం క్లోజ్ అయ్యిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ నేతలపై తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ నేతలకు దిక్కుతోచక ఎవరు ఏమి మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పరిస్థితి ఖేల్ ఖతం దుకాణం బంద్ అన్నారు. కాంగ్రెస్ నుండి పోయే వాళ్ళే తప్ప వచ్చే వారు ఎవరన్నా ఉన్నారా? ఉత్తం కుమార్ రెడ్డి చెప్పాలని ప్రశ్నించారు లక్ష్మణ్. మిలిటరీలో పని చేసిన ఉత్తమ్ కుమార్ రెడ్డి దేశభక్తిని చూపించాల్సింది పోయి మతిలేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. తెలంగాణ బిల్ పెట్టినప్పుడు గందరగోళం చేసింది కాంగ్రెస్ ఎంపీలు కాదా? అని ప్రశ్నించారు. పెప్పర్ స్ప్రే కొట్టింది మీ పార్టీ ఎంపీ కాదా? అని అన్నారు. బీజేపీ మద్దతు లేకుంటే తెలంగాణ వచ్చేదా

## టీఆర్‌ఎస్‌కు బిజెపియే ప్రత్యామ్నాయం: లక్ష్మణ్

అన్నది ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు రాజ్యాంగబద్ధంగా జరగలేదని అమిత్ షా అన్నట్టుగా కాంగ్రెస్ విషప్రచారం చేస్తోందని ధ్వజమెత్తారు. సొంత ఎమ్మెల్యేలను కాపాడుకోలేని ఉత్తమ్.. బీజేపీని విమర్శించడం సిగ్గుచేటు అని వ్యాఖ్యానించారు. బీజేపీ మద్దతు లేకుంటే తెలంగాణ వచ్చేది కాదన్నారు.

చిన్న సమస్య రాకుండా బీజేపీ మూడు రాష్ట్రాలను ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. హైదరాబాద్ లేని తెలంగాణ వద్దని సుష్మాస్వరాజ్ పార్లమెంట్‌లో గర్జించారని తెలిపారు. ఇల్లు చక్కదిద్దుకోవడం చేతకాని ఉత్తమ్.. బీజేపీని విమర్శించడం దుర్మార్గమన్నారు. కాంగ్రెస్ పార్టీ దిక్కుతోచని స్థితిలో ఉందని విమర్శించారు. జమ్మూ కాశ్మీర్ విషయాన్ని కూడా రాద్ధాంతం చేయడం కరెక్ట్ కాదన్నారు. ఉత్తమ్ కుమార్ బీజేపీపై బురద జల్లుతున్నారని అన్నారు. కాంగ్రెస్ అస్త్ర సన్యాసం చేసిందని.. అధికార పార్టీపై పోరాటం చేయలేక పోతోందన్నారు. టీఆర్‌ఎస్ కు బీజేపీనే ప్రత్యమ్నాయం అని ప్రజలు భావిస్తున్నారని అన్నారు. సెక్రటేరియట్ ని కూల గొట్టడాన్నితాము వ్యతిరేకిస్తున్నామన్నారు. కేసీఆర్ ఉద్యోగులను ముప్పుతిప్పలు పెడుతున్నారని.. ఏదో ఒక రోజు వాళ్ళు కర్రు కాల్చి వాతలు పెడతారని వ్యాఖ్యానించారు. వాజ్‌పెయ్ స్మారకానికి స్థలం ఇస్తామని చెప్పిన కేసీఆర్ ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. తెలంగాణలో పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టామని అన్నారు. కెసిఆర్ నిరంకుశ వైఖరిని ఎండగడతామని అన్నారు. ప్రజలకు అండగా నిలుస్తామని అన్నారు.జ్యోతిరాధిత్య సింధియా బీజేపీలోకి వస్తే ఆహ్వానిస్తామన్నారు. సచివాలయానికి రానప్పుడు.. కేసీఆర్‌కు కొత్త సెక్రటరియేట్ ఎందుకు? అని ప్రశ్నించారు. వేల కోట్ల విలువైన సచివాలయాన్ని కూల్చటాన్ని బీజేపీ వ్యతిరేకిస్తోందని చెప్పారు. తెలంగాణ విమోచన దినం సందర్భంగా భారీ సభను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సభకు అమిత్ షాను ఆహ్వానించటానికి రెండ్రోజుల్లో ఢిల్లీ వెళ్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణ విమోచన దినోత్సవ ప్రాముఖ్యతను దేశ వ్యాప్తంగా తెలియజేస్తామని పేర్కొన్నారు.

# టీఆర్ఎస్ నేతల్లో అసంతృప్తి

## ఒంటెత్తుపోకడలేకారణం: శశిధర్ రెడ్డి

సంగారెడ్డి,ఆగస్ట్9(నేటినిజం ప్రతినిధి): రాష్ట్రంలో టీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ప్రజలకు అసంతృప్తి మొదలైం దని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే పి.శశిధర్ రెడ్డి ఆరోపించారు. కెసిఆర్ ఒంటెత్తు పోకడలతో పార్టీలో కూడా అసంతృప్తులు మొదలయ్యాయని అన్నారు. 370 ఆర్టికల్ రద్దుతో ఇప్పుడు ప్రజల్లో బిజెపి పట్ల భరోసా పెరిగిందన్నారు. ఏవనయినా బిజెపి మాత్రమే చేయగలదన్న విశ్వాసం ఏర్పడిందన్నారు. కేంద్రం ద్వారా నిధులను వస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం దీనికి అనుగుణంగా ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మిషన్ కాకతీయ ద్వారా ఎక్కడ చెరువులు నిండాయో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నయీం కేసులో నిందితులకు శిక్ష అమలు చేసి, బాధితులకు వెంటనే న్యాయం చేయాలని అన్నారు. అసలు ఇందులో దోషులెవరో తేల్చాలని అన్నారు. తెలంగాణలో బీజేపీకి ఎదురు లేదని, బీజేపీ సభ్యత్వ నమోదు చూసి టీఆర్‌ఎస్ గుండెల్లో గుబులు పుడుతోందని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం పథకం 'ఆయుష్మాన్ భవ' రాష్ట్రంలో అమలు చేయకుండా తెలంగాణ ప్రభుత్వం అడ్డుపడుతుందని విమర్శించారు. రాష్ట్రంలో అవినీతి బాగా పెరిగిపోతుందని, ఆరోగ్య శ్రీ పేరిట జోరుగా అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

# జూరాలకు పెరిగిన వరదనీరు

గద్వాల,ఆగస్టు9 (ఆంఎన్ఎ): కృష్ణా నదికి వరద నీరు కొనసాగుతోంది. ఆల్మట్టి నుంచి నారాయణపూర్‌కు, అక్కడ నుంచి జూరాలకు భారీగా వరదనీరు వస్తోంది. జూరాలకు 3లక్షల 30వేల క్యూసెక్కులకుపైగా వరద నీరు వస్తోంది. దీంతో అధికారులు దాదాపు మూడున్నర లక్షల క్యూసెక్కుల నీటిని దిగవకు వదులుతున్నారు. జూరాలకు వస్తున వరదను చూస్తే సముద్రాన్ని తలపిస్తోంది. 36 గేట్లను ఎత్తారు. జూరాలకు ఇంత రికార్డు స్థాయిలో వరద రావడం గత 2009 తర్వాత ఇదే మొదటిసారని అధికారులు చెబుతున్నారు. ఇక్కడ పవర్ జనరేషన్ ప్రాజెక్టు నుంచి రెండు యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. అయితే ఎప్పుడు లేని విధంగా బీమా ప్రాజెక్టు నుంచి కూడా వరద నీరు వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు.

# కాళేశ్వరంతో కాంగ్రెస్ విమర్శలకు స్థానం లేదు

## గోదావరి జలాలతో తీరనున్న ఆకాంక్షలు: ఎమ్మెల్యే

యాదాద్రి,ఆగస్ట్9(ఆర్‌ఎన్‌ఎ): కాళేశ్వరం పూర్తయితే వెనకబడ్డ యాదాద్రి జిల్లాకు కూడా గోదావరి జలాలు తరలి వస్తాయని ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీత అన్నారు. సీఎం కేసీఆర్ ముందుచూపుతో కాళేశ్వరం కోసం అహరహరం శ్రమించారని అన్నారు. ప్రజల కోసం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్రంలో ప్రతిపక్షాల విమర్శలకు ప్రాధాన్యం లేకుండా పోతోందని అన్నారు. కాళేశ్వరం పూర్తి కావడంతో ఇప్పుడు కాంగ్రెస్ తదిర పార్టీల విమర్శలకు అర్థం లేకుండా పోయిందన్నారు. కాళేశ్వరంలో భాగంగా ఆలేరు నియోజకవర్గానికి కూడా గోదావరి జలాలు రానున్నాయని అన్నారు. శ్రీరాంసాగర్ రివర్స్ పంపింగ్‌తో రైతాంగానికి భరోసా కలుగుతుందని అన్నారు. కాంగ్రెస్, టిడిపిల వల్ల వట్టిపోయిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు పునరుజ్జీవ పథకంతో ప్రాణం వస్తుందన్నారు. బంగారు తెలంగాణ సాధించే క్రమంలో రాష్ట్ర రైతాంగం కష్టాలు తీర్చేందుకు సీఎం కేసీఆర్ ఆలోచనల్లోంచి పుట్టుకు వచ్చిన పథకమే ఇదన్నారు. శ్రీరాంసాగర్ పునరుజ్జీవ పథకంతో ఉత్తర తెలంగాణ సస్యశామలం అవుతుందని అన్నారు.ఏడాదికి ఈ పథకం పూర్తయి ఎస్సారేస్పీకి పునర్జీవం వస్తుందన్నారు. అందుకే ప్రభుత్వ కార్యక్రమాలకు ఆకర్షితులై అనేకమంది గులాబీ కండువా కప్పుకుంటున్నారని అన్నారు. ఇకపోతే నిరుపేద కుటుంబాలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు వరమని అన్నారు. గతంలో పేద కుటుంబాలకు ఆడపిల్లలు పెండ్లిళ్లు భారం కావడంతో తల్లిదండ్రులు అప్పు చేసి పెండిళు చేసేవారన్నారు. కానీ నేడు అలాంటి పరిస్థితులు తలెత్తకుండా సీఎంకేఆర్ ఇంటికి పెద్ద కొడుకులా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు చేపట్టి రూ.1 ,00,116లను అందిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా ఆడ పడుచులు నీళ్ల కోసం ఇబ్బందులు పడకుండా మిషన్ భగీరథ ద్వారా ప్రతీ ఇంటికి నల్లా నీటిని అందిస్తున్నారన్నారు. గ్రామాల్లో మరుగుదొడ్లు లేక ఆడపడుచులు ఎన్నో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ప్రతీ ఇంట్లో కచ్చితంగా మరుగుదొడ్డిని నిర్మించుకోవాలని, అందుకు ప్రోత్సాహంగా రూ.12 వేలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి కార్మికుడికి ప్రభుత్వం, పార్టీ అండగా ఉంటుందని, డబుల్‌బెడ్‌రూం ఇల్లు, సంక్షేమ పథకాలల్లో ప్రాధాన్యత కల్పిస్తామని ఇచ్చారు. పేదల ఆకలి దప్పిక తెలిసిన మొదటి ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు.

# చిన్నారి కేసులో న్యాయం జరిగింది: కేటీఆర్

హైదరాబాద్,ఆగస్టు9(ఆర్‌ఎన్‌ఎ): తొమ్మిది నెలల పసిపాపపై అత్యాచారం చేసి హత్య చేసిన కేసులో వరంగల్ ఫాస్ట్ ట్రాక్ కోర్టు.. నిందితుడికి ఉరిశిక్ష విధించడాన్ని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వాగతించారు. చిన్నారి తరపున పోరాడిన లాయర్లకు అభినందనలు తెలిపారు. కామాంధులను శిక్షించేందుకు కఠిన చట్టాలు రావాలని ఆకాంక్షించారు. 9 నెలల చిన్నారిపై అత్యాచారం చేసి హతమార్చిన కేసులో ముద్దాయి ప్రవీణ్ కుమార్‌కు ఉరిశిక్ష విధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వరంగల్ లో చిన్నారిపై అత్యాచారం, హత్య కేసులో వరంగల్ అదనపు కోర్టు తీర్పును స్వాగతిస్తున్నట్లు కేటీఆర్ ట్వీట్ చేశారు. ఇటువంటి కేసుల విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు అవసరం. ఇలాంటి కేసుల విచారణకు మరింత కఠినమైన చట్టాలు తేవాలి. చిన్నారి కేసులో న్యాయం కోసం వాదించిన న్యాయవాదులకు అభినందనలు అని కేటీఆర్ ట్వీట్‌లో పేర్కొన్నారు.

# ఆర్టికల్370పై తప్పుడు ప్రచారాలు

## డిజిపికి లాయర్ల ఫిర్యాదు

హైదరాబాద్,ఆగస్టు9 (ఆంన్ఎ): ఆర్టికల్ 370 రద్దుపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర న్యాయవాదులు కోరారు. ఇదే విషయంపై గురువారం తెలంగాణ డిజీపీ మహేందర్ రెడ్డికి పలువురు న్యాయవాదులు ఫిర్యాదు చేశారు. 370 ఆర్టికల్ రద్దు తర్వాత ట్విట్టర్, ఫేస్ బుక్ వేదికగా చేసుకుని భారత్ జవాన్ల పై తప్పుడు ప్రసారాలు చేస్తున్నారని తెలిపారు. అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. పేస్ బుక్ సీఈవో జుకెన్ బర్గ్, ట్విట్టర్ సీఈవో జాక్ ప్యాట్రిక్ డోర్ సే పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. పాకిస్థాన్ ప్రేరేపిత మూకలకు కొమ్ముకాస్తున్న ట్విట్టర్, ఫేస్ బుక్ సీఈవోలపై దేశ ద్రోహం కేసు నమోదు చేయాలని తెలిపారు. ఫేక్ ఐడీలతో తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై ఎందుకు చర్యలు చేపట్టడం లేదన్నారు. అమెరికాలో ఉంటూ భారత దేశ సర్వభౌమత్వం దెబ్బతీయలని చూస్తే ఉరుకోమని లాయర్లు తెలిపారు.

# మల్లయోధులు ఒక్కటయ్యారు

## బజరంగ్‌పునియా,సంగీతాఫోగట్ ల వివాహబంధం

చండీగఢ్,ఆగస్టు9(ఆర్‌ఎన్‌ఎ): ప్రపంచ నెంబర్ వన్ మల్లయోధుడు బజరంగ్‌పునియా, అంతర్జాతీయ స్థాయి మల్లయోధురాలు సంగీతాఫోగట్ త్వరలో వివాహబంధంతో ఒక్కటికానున్నారు. ఈ మేరకు సమాచారాన్నిగురవారం ఇరువురి కుటుంబాలు వెల్లడించాయి. 2020 టోక్యో ఒలింపిక్స్ ముగిసిన తర్వాత వీరి వివాహం జరుగనుంది. పునియా ప్రపంచస్థాయి కుస్తీ ర్యాంకింగ్స్‌లో 65 కేజీల విభాగంలో అగ్రస్థానంలో కొనసాగుతుండగా, సంగీతా ఫోగట్ మహిళల 59 కేజీల విభాగంలో జాతీయస్థాయిలో విజేతగా నిలిచింది. సంగీతా ఫోగట్ తండ్రి, ఒకప్పటి మల్లయోధుడు మహవీర్‌సింగ్ మీడియాతో మాట్లాడుతూ 'పిల్లల అభిప్రాయాన్ని తాము గౌరవిస్తున్నామని ' వెల్లడించారు. మల్లయోధురాలు, 2010 కామన్‌వెల్త్ గేమ్స్‌లో కుస్తీపోటీల్లో బంగారుపతక విజేత గీతాఫోగట్, సంగీతాఫోగట్‌కు సోదరి. ఆమె కూడా పవన్‌కుమార్ అనే మల్లయోధుడిని 2016లో వివాహం చేసుకుంది. ఇద్దరు కూతుళ్లను అంతర్జాతీయ స్థాయిలో మల్లయోధులుగా తీర్చిదిద్దిన వారి తండ్రి మహవీర్‌సింగ్ జీవితం అధారంగానే అమిర్‌ఖాన్ ముఖ్యపాత్ర పోషించిన 'దంగల్' సినిమాను చిత్రీకరించిన సంగతి తెలిసిందే. అంతర్జాతీయ స్థాయిలో ఈ చిత్రం భారతీయ సినిమా సత్తా చాటింది. రానున్న ఒలింపిక్స్‌లో బజరంగ్‌పునియా భారత్ తరపున ఫేవరెట్‌గా బరిలోకి దిగనున్నాడు.

# రైతుబీమాతో మరింత భరోసా

## సంక్షేమమే కెసిఆర్ లక్ష్యం

సంగారెడ్డి,ఆగస్ట్9(నేటినిజం ప్రతినిధి):: రైతులను అడ్డం పెట్టుకుని కాంగ్రెస్ నాయకులు రాజకీయం చేస్తున్నారన్నారని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో కనీవిని ఎరుగని రీతిలో ముఖ్యమంత్రి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అండగా ఉండాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు బీమా పథకం అన్నదాతకు భరోసా అని ఎమ్మెల్యే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుబంధు జీవిత బీమా రైతుల కుటుంబాలకు భరోసాను కల్పిస్తోందని చెప్పారు. రాష్ట్రంలో 55లక్షల మంది రైతులకు జీవిత బీమా పత్రాలను అందజేస్తున్నట్లు తెలిపారు. రైతులు ప్రమాదవశాత్తు మరణిస్తే ప్రభుత్వం రూ.ఐదు లక్షల బీమాను ఉచితంగా అందిస్తోందని చెప్పారు. ప్రభుత్వం, సీఎం కేసీఆర్ నిరంతరం రైతు శ్రేయస్సు కోసం కృషి చేస్తున్నట్లు వివరించారు.రైతులు 60 ఏళ్ల పాటు అరిగోస పడ్డారని, రైతులకు పెట్టుబడి, రైతుబంధు బీమాతో ఇప్పుడు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. గతంలో కరంట్‌తో బోరుబావుల మోటర్లు కాలిపోయేవని, ఎప్పుడు కరంట్ వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం అలా లేదని అన్నారు. ఇప్పుడు రైతులకు 24గంటల నాణ్యమైన కరంట్‌ను ప్రభుత్వం సరఫరా చేస్తోందని, ఒక్క మోటారు కూడా కాలిపోవడం లేదని చెప్పారు. గోదావరి జలాలతో పంటలు సాగు చేసుకోవాలనే రైతుల కల.. త్వరలోనే సాకారం అవుతందని తెలిపారు. కాళేశ్వరం ద్వారా శ్రీరాం సాగర్ ప్రాజెక్ట్ పునరుజ్జీవ పథకం చరిత్రలో నిలిచిపోనుందన్నారు. 85 టీఎంసీల సామర్థ్యం ఉన్న మధ్య మానేరు ప్రాజెక్టు నిర్మాణ పనులను

యుద్ధప్రాతిపదికన చేస్తున్న తీరును కాంగ్రెస్ నేతలు వెళ్లి చూడాలన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే తోటపల్లి మీదుగా గౌరవెల్లి, గండిపల్లి రిజర్వాయర్లకు నీరు వస్తుందన్నారు. తొందరగా ప్రాజెక్టుల నిర్మాణాలను పూర్తి చేస్తే రైతుల కష్టాలు తీరుతాయన్నారు. రైతులు బ్యాంకుల నుంచి రుణాలు పొందినపుడు సాగు చేసిన పంటలపైనా బీమా చేయించుకోవాలని సూచించారు

# ద్వైపాక్షిక వాణిజ్యం రద్దు పాక్‌కే ముప్పు

## నష్టపోయేది పాకే అంటున్న నిపుణులు

న్యూఢిల్లీ,ఆగస్టు9(ఆర్‌ఎన్‌ఎ): భారత్‌ను ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతో ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రద్దు చేసుకోవడం పాక్‌కే నష్టమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భారత్ ఎగుమతి చేసే వస్తువులకు ఇతర ఆసియా దేశాల్లో కూడా డిమాండ్ ఉందని,దానివల్ల భారతకు పెద్దగానష్టం ఉండదని అంటున్నారు. ఈ రకంగా పాకిస్థాన్ తాను తీసుకున్న గొయ్యిలో తానే పడుతున్నట్లుగా ఉందంటున్నారు. కశ్మీర్ వ్యవహారంలో తీవ్రంగా స్పందించిన దాయాది దేశం.. తమకే చేటు చేస్తుందనే చిన్న విషయాన్ని పాక్ మరిచిపోయినట్లుంది. ఎందుకంటే పాక్ నుంచి భారత్‌కు చేసే ఎగుమతుల శాతం చాలా ఎక్కువ. అదే సమయంలో భారత్ నుంచి పాక్‌కు చేసే ఎగుమతులు కేవలం అరశాతం మాత్రమే. ఇప్పుడు వాణిజ్యం రద్దు చేయడం వల్ల ఆ దేశం భారీగా నష్టపోవాల్సిన పరిస్థితి ఎదురైంది. ద్వైపాక్షిక వాణిజ్యం రద్దు చేసుకోవడం పాక్‌పైనే తీవ్ర ప్రభావం చూపిస్తుందని నిపుణులు అంటున్నారు. 'భారత్‌పై పాక్ చాలా ఎక్కువ స్థాయిలో ఆధారపడుతోంది. అందువల్ల భారత్‌తో వాణిజ్యం రద్దు ఆ దేశ ఆర్థిక వ్యవస్థకే చేటు చేస్తుంది' అని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ జనరల్ అజయ్ సహాయ్ అన్నారు. పాక్ నిర్ణయం ఆ దేశ వ్యాపారంపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ ప్రొఫెసర్ రాకేశ్ మోహన్ జోషీ అభిప్రాయం వ్యక్తం చేశారు. పుల్వామా దాడి తర్వాతే భారత్, పాక్ మధ్య వాణిజ్య సంబంధాలు తీవ్రంగా బెడిసికొట్టాయి. పాక్‌తో ఇక వ్యాపార ప్రోత్సాహం అక్కర్లేదని భావించిన భారత్.. ఆ దేశానికిచ్చిన మోస్ట్ ఫేవర్డ్ నేషన్ హోదాను వెనక్కి తీసుకుంది. ఆ వెంటనే పాక్ నుంచి భారత్‌కు వచ్చే వస్తువులపై 200 శాతం కస్టమ్స్ సుంకాన్ని విధించింది. దీంతో ఈ ఏడాది మార్చి నుంచి పాకిస్థాన్ నుంచి వచ్చే దిగుమతులు 90శాతానికి పైగా తగ్గాయి. మన దేశం మొత్తం ఎగుమతుల్లో పాక్‌కు చేసే ఎగుమతులు కేవలం అరశాతానికి మించి ఉండవు. వీటిల్లో ఎక్కువగా పత్తి, బాయిలర్స్, ప్లాస్టిక్ ఉత్పత్తులు, చక్కెర, కాఫీ, తేయాకు, చెప్పులు, ఆర్గానిక్ కెమికల్స్ తదితర ఉత్పత్తులు ఉన్నాయి. ఒకవేళ వీటిని పాక్‌కు ఎగుమతి చేయకపోయినా దక్షిణాసియా, మధ్యప్రాచ్య దేశాల్లో మన ఉత్పత్తులకు గిరాకీ బాగానే ఉంటుంది. కానీ, పాక్ మొత్తం ఎగుమతుల్లో భారత్‌కు చేసే ఎగుమతులు చెప్పుకోదగ్గ స్థాయిలోనే ఉన్నాయి. ఉల్లి ..తదితర వ్యవసాయ ఉత్పత్తులను కూడా పాక్.. భారత్‌కు భారీగానే ఎగుమతి చేస్తోంది. అయితే తాజాగా ఇమ్రాన్‌ఖాన్ తీసుకున్న నిర్ణయంతో ఈ ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడనుందని విశ్లేషకులు అంటున్నారు. ఏదేమైనా అసలే పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయిన పాక్‌కు ఇది మూలిగే నక్కపై తాటికాయ లాంటిదే మరి..!

# కాంగ్రెస్‌ను విమర్శించడం మానుకోవాలి

## తెలంగాణ ఇవ్వకుంటే ఎక్కడుండేవారో

మహబూబ్‌నగర్,ఆగస్ట్9(ఆర్ఎన్ఎ): ప్రాజెక్టులను కాంగ్రెస్ అడ్డుకుంటున్నదని రాజకీయంగా లబ్ది పొందాలని, సానుభూతి పొందాలని సిఎం కెసిఆర్ చూస్తున్నారని అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ ఉమార్ అన్నారు. అలాంటి దుస్థితి రాకుండా పనులు చేస్తే ప్రజలు హర్షిస్తారని గుర్తుంచుకోవాలన్నారు. 60 ఏళ్లలో కాంగ్రెస్ వాళ్లు ఏం చేశారని ప్రశ్నిస్తున్నారని, కాంగ్రెస్ ముందుకు రాకుంటే కెసిఆర్ సిఎం అయ్యేవారు కాదన్నారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియా తెలంగాణ ఇవ్వకుంటే కెటిఆర్ ఎక్కడుండేవారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఏం చేయకుంటే మీరెక్కడ ఉండేవారో ఆలోచించాలన్నారు. ఇలాంటి విమర్శలతో ప్రజలను తప్పుదోవ పట్టించలేరని అన్నారు. ప్రస్తుతం అంతటా కాంగ్రెస్ హయాంలో ఏర్పాటుచేసిన నీటి పథకాలు, పైపులైన్లే ఉన్నాయని, అన్ని ఇళ్లకు నల్లాలు ఉన్నాయని తెలిపారు. మిషన్ భగీరథ కింద ప్రజలకు చేసింది ఏముందని ప్రశ్నించారు. ప్రజలు తాగటానికి, అవసరాలకు నీరు డబ్బులు చెల్లించి కొనుగోలు చేస్తున్నారని, సమస్యను పరిష్కరించటంపై ప్రభుత్వం దృష్టిపెట్టాలని హితవు పలికారు. తమ పార్టీ పాలనలో చేపట్టిన రామన్‌పాడు పథకం ద్వారా నీటిని అందించవచ్చని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథను ఎక్కుగా చెప్పుకొంటూ ప్రచారం చేయటం తప్ప.. ప్రజల ఒరిగిందేమీ లేదని పేర్కొన్నారు. ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ గురించి చెబుతోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి పేరుపై ఉన్న ధ్యాస ప్రజల సమస్య పరిష్కారంపై లేదని విమర్శించారు. మిషన్ భగీరథ పనులు పూర్తయ్యే వరకు ప్రజలకు నీళ్లు వద్దా అని ప్రశ్నించారు.

# ఎమ్మార్ ప్రాపర్టీ విల్లాలపై చర్యలేవీ: రేవంత్

హైదరాబాద్,ఆగస్టు9 (ఆర్ఎన్ఎ):ఎమ్మార్ ప్రాపర్టీలోని విల్లాలపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎంపీ రేవంత్ రెడ్డి కోరారు. గురువారం జీహెచ్ఎంసీ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఆయన ఈ మేరకు అధికారులను కోరారు. విల్లాలకు టీఎస్ఐఐసి కింద భూములను కేటాయించినా.. బల్దియా అనుమతి లేదన్నారు. అనుమతి లేకుండా నిర్మించిన విల్లాలను.. ఎప్పటిలోగా కూల్చివేస్తారని రేవంత్ రెడ్డి అధికారులను ప్రశ్నించారు.

# వాఘావద్ద సంఝౌతాను వదిలేసిన పాక్

అమృత్‌సర్,ఆగస్టు9(ఆర్ఎన్ఎ): సంఝౌతా ఎక్స్‌ప్రెస్ రైలు అట్టారీకి చేరుకుంది. సంఝౌతా ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేస్తున్నట్లు పాక్ రైల్వే మంత్రి ప్రకటించిన నేపథ్యంలో రైలును నడిపే పాక్ సిబ్బంది వాఘా సరిహద్దు వద్ద రైలును నిలిపివేశారు.

భారత సిబ్బంది వచ్చి రైలును తీసుకువెళ్లాల్సిందిగా సమాచారం అందించడంతో భారత రైల్వే సిబ్బంది వెళ్లి రైలును భారత భూభాగంలోకి నడిపారు. లాహోర్ నుంచి వచ్చిన రైలును వాఘా సరిహద్దు వద్ద నుండి పంజాబ్‌లోని అట్టారీకి చేర్చారు. రైలులో మొత్తం 110 మంది ప్రయాణికులు ఉన్నారు.

# ప్రపంచబ్యాంక్ ఆర్థిక సాయంతో పనులు

## త్వరగా పూర్తి చేయాలన్న సిఎస్ ఎల్వీ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ

అమరావతి,ఆగస్టు9 (ఆర్ ఎన్ఎ): ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహాయంతో శ్రీకాకుళం, విజయ నగరం, విశాఖ, తూర్పు గోదావరి జిల్లాల్లో ఆంధ్రప్రదేశ్ డిజాస్టర్ రికవరీ ప్రాజెక్టు(ఎపిడిఆర్పి)కింద చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం ఆదేశించారు. ఈ మేరకు గురువారం అమరావతి సచివాలయంలో ఇందుకు సంబంధించి సిఎస్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ.... 68 శాతం ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహాయం 250 యుఎస్ మిలియన్ డాలర్లు, 32 శాతం రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులు 120 యుఎస్ మిలియన్ డాలర్లు మొత్తం 2వేల 220 కోట్ల రూ.లు అంచనాతో ఇప్పటికే 1813 కోట్ల రూ.లకు పరిపాలనా మోదం ఇచ్చి 6 కాంపోనెంట్లు గా చేపట్టిన వివిధ పనులను 5 ఏళ్ళ కాలవ్యవధిలోగా అనగా వచ్చే ఏడాది సెప్టెంబరు నెలాఖరులోగా పూర్తి చేయాల్సి ఉందని చెప్పారు. ఇప్పటికే సుమారు 700 కోట్ల రూ.లు వరకూ ఖర్చు చేయగా మిగతా పనులను నిర్దిష్ట కాలవ్యవధిలో పనులు పూర్తి చేసేందుకు సంబంధిత శాఖలు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ఎపిఇపిడిసిఎల్, పంచాయితీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి, రోడ్లు భవనాలు, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్, వుడా, ఎపి ఫారెస్ట్ అండ్ పిఎంయు విభాగాల ఆధ్వర్యంలో ఆరు కాంపోంనెంట్లలలో వివిధ దశల్లో జరుగుతున్న పనులను ప్రగతికి సంబంధించి ప్రతి 15 రోజులకు తనకు నివేదిక సమర్పించాలని ఈ ప్రాజెక్టు సభ్య కార్యదర్శి, రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ప్రత్యేక కమీషనర్ కె.కన్నబాబును సిఎస్ సుబ్రహ్మణ్యం ఆదేశించారు. ఎపిడిఆర్పి ప్రాజెక్టు పనుల వేగవంతం చేసేందుకు వీలుగా నంబంధిత శాఖల సిఇలతో ఒక కమిటీవేసి అన్ని అంశాలను చర్చించాలని అలాగే ఇఎపి ప్రాజెక్టులకు(ఎక్స్టర్నల్ ఎయిడెడ్ ప్రాజెక్టులు)జిఎస్టికి సంబంధించిన అంశాలపై కూడా సిఇలతో కమిటీ వేసి వెంటనే అన్ని అంశాలను చర్చించుకుని సకాలంలో పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని సిఎస్ ఆదేశించారు. అంతేగాక ప్రతి పనికి ఒక నిర్ధిష్ట టైమ్లైన్ పెట్టి ఆప్రకారం పనులు పూర్తయ్యేలా చూడాలని స్పష్టం చేశారు.అదేవిధంగా ప్రొక్యూర్మెంట్ కు సంబంధించి విశాఖపట్నంలో సంబంధిత శాఖలు, ఏజెన్సీలతో ఒక సమావేశాన్ని నిర్వహించాలని ఆదేశించారు. అంతేగాక ప్రొక్యూర్మెంట్ ను కూడా ఒక నిర్ధిష్ట వ్యవధిలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. అంతకు ముందు ఎపిడిఆర్పి టాస్క్ ఫోర్స్ టీం లీడర్ దీపక్ సింగ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రాజెక్టు పనుల ప్రగతి,ఇతర అంశాలను వివరించారు. అనంతరం సిఎస్ అధ్యక్షతన ఎపిడిఆర్పి 3వ రాష్ట్ర స్థాయి స్టీరింగ్ కమిటీ నమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు మన్మెహన్ సింగ్, నీరబ్ కుమార్ ప్రసాద్, రోడ్లు భవనాలు, పంచాయితీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖల ముఖ్య కార్యదర్శులు యం.కృష్ణ బాబు, గోపాల కృష్ణ ద్వివేది, రాష్ట్ర అగ్నిమాపక శాఖ డిజి ఎఆర్. అనురాధ, ఇంధన శాఖ కార్యదర్శి ఎన్.శ్రీకాంత్ ,పిసిసిఎఫ్ రిజ్వి,ఎపిడిఆర్పి టాస్క్ ఫోర్స్ టీం లీడర్ దీపక్ సింగ్,రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ప్రత్యేక కమిషనర్ కె.కన్నబాబు, రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ కార్యదర్శి శ్యామల రావు, ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శి కె.సత్యనారాయణ, ఎపిఎస్పి బెటాలియన్స్ ఐజి జి.శ్రీనివాస్, ఇంకా పంచాయితీరాజ్,ఆర్అండ్బి, ఎపిఇసిడిసిఎల్, మున్సిపల్ తదితర శాఖల చీఫ్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

# వైకాపా దాడులపై మండిపడ్డ బాబు

గుంటూరు,ఆగస్టు9 (ఆర్ ఎన్ఎ): వైసీపీకి చెందిన వారు టీడీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారని తెలుగదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం చంద్రబాబు నాయుడు మండిపడ్డారు. వైసీపీ దాడులను ఖండిస్తూ.. టిడీపీ నాయకులను శుక్రవారం పల్నాడు ప్రాంతానికి పంపుతున్నట్లు చెప్పారు. గురువారం టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో కార్యకర్తల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అందరూ శాంతిని కోరుకుంటునారని అన్నారు.కృష్ణా జిల్లా భీమవరానికి చెందిన శ్రీహరి కుటుంబానికి నిలువనీడ లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ తరుపున శ్రీహరి కుటుంబానికి యాభైవేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందిస్తామని చంద్రబాబు ప్రకటించారు.

# భార్యను కత్తితో పొడిచి..ఆపై ఆత్మహత్య

### చిత్తూరులో దారుణ ఘటన

చిత్తూరు,ఆగస్టు9 (ఆర్ ఎన్ఎ): చిత్తూరు జిల్లా కేంద్రంలోని దుర్గానగర్ కాలనీలో గురువారం దారుణ ఘటన చోటు చేసుకుంది. ఆటో డ్రైవర్ ఓ వివాహితను కత్తితో పొడిచి చంపేశాడు. అనంతరం పురుగుల మందు తాగి తానూ ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుల వివరాలు తెలియరాలేదు. పోస్టుమార్టం కోసం ఇద్దరి మృతదేహాలను ఆస్పత్రికి తరలించారు. కుటుంబ కలహాల కారణంగానే ఈ ఘటన జరిగి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

# ఎంపీ సుమలతపై నెటిజన్లు ఫైర్

బెంగళూరు, ఆగస్టు9 (ఆం ఎన్ఎ) : బీజేపీ అగ్రనాయకురాలు సుష్మా స్వరాజ్ మృతితో ఆ పార్టీ శ్రేణులు విషాదంలో మునిగిపోయిన విషయం తెలిసిందే. పార్టీలకతీతంగా నేతలు ఆమెకు ఘనంగా నివాళులు అర్పించారు. సోషల్ మీడియా ద్వారా ఆమెతో తమకున్న జ్ఞాపకాలను పంచుకుంటూ.. ఆమె మృతికి సంతాపాలు ప్రకటించారు. ఈ నేపథ్యంలో మాండ్య స్వతంత్ర పార్టీ ఎంపీ సుమలత చేసిన ట్వీట్ నెటిజన్ల విమర్శలపాలైంది. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 6న సుష్మా స్వరాజ్ కన్నుమూశారు. అదే రోజు రాత్రి ఢిల్లీలోని కర్ణాటక భవన్లో సీఎం యడియూరప్ప ఆధ్వర్యంలో రాష్ట్ర సమస్యలపై ఓ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సుమలత కూడా పాల్గొన్నారు. ఈ విషయాన్ని చెబుతూ.. సమావేశానికి చెందిన ఫొటోను అర్ధరాత్రి సమయంలో ట్వీట్ చేశారు. దీనిపై బీజేపీ కార్యకర్తలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఓ గొప్ప నేత చనిపోతే.. ఆ విషయాన్ని పక్కనపెట్టి ఈ ట్వీట్ ఏంటంటూ ప్రశ్నించారు. దీంతో వెంటనే అలర్ట్ అయిన సుమలత.. బుధవారం సుష్మా స్వరాజ్కు నివాళులు అర్పిస్తూ ట్వీట్ చేశారు.

## ఏపీ వార్తలు

# విద్యావ్యవస్థలో సమూలమైన మార్పులు

### సిఎం వైఎస్ జగన్ లక్ష్యంఅదే
### త్వరలో పండిట్ పోస్టుల భర్తీ: ఆదిమూలపు సురేశ్

విజయవాడ,ఆగస్టు9 (ఆం ఎన్ఎ): విద్యావ్యవస్థలో సమూలమైన మార్పులు తేవాలన్నదే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి లక్ష్యమని విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్ తెలిపారు. అందుకు అనుగుణంగా సంస్కరణలు తీసుకువస్తామన్నారు. అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయాలతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు. త్వరలోనే 10,224 లాంగ్వేజ్ పండిట్ పోస్టులను భర్తీ చేస్తామని వెల్లడించారు. గురువారం విజయవాడలో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయ సంఘాలు, అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై ఆయన అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పారిశుధ్య కార్మికుల జీతాలను పెండింగ్లో పెట్టిందని గుర్తు చేశారు. రెండేళ్లలో రూ. 63వేల కోట్ల నిధులను టీడీపీ తప్పుదారి పట్టించిందని విమర్శించారు. ఎన్నికల్లో లబ్ది పొందడానికి ఆ నిధులను పసుపు కుంకుమ పథకానికి మళ్లించిందని మండిపడ్డారు. పారిశుధ్య కార్మికుల సమస్యపై సీఎం వైఎస్ జగన్ సానుకూలంగా ఉన్నారని తెలిపారు. చంద్రబాబు ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్ది పరిస్థితిని గాడిలో పెడతామని చెప్పారు. విద్య, వైద్యం, వ్యవసాయంకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. రెండు నెలల్లోనే మేనిఫెస్టోలోని 80 శాతం అంశాలను అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్కే దక్కుతుందన్నారు. రెండేళ్లుగా పెండింగ్లో ఉన్న 6,267 మందికి ప్రమోషన్లు ఇచ్చామని, బడ్జెట్లో విద్యాశాఖకు రూ. 33వేల కోట్లు కేటాయించామని.. ఇది విద్యాశాఖకు సీఎం వైఎస్ జగన్ ఇస్తున్న ప్రాధాన్యత అని పేర్కొన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్న హాస్టల్స్పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పారిశుధ్య రంగానికి 152 కోట్లు కేటాయించమని వెల్లడించారు. యూనిసెఫ్ సౌజన్యంతో కెరీర్ కౌన్సిల్ పోర్టల్ను ప్రారంభించామని పేర్కొన్నారు. ఇకపోతే పాధ్యాయులు సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ పోర్టల్ అనే ఆన్లైన్ సైట్ను ఏర్పాటు చేస్తున్నట్టు మంత్రి ఆదిమూలపు తెలిపారు. ఉపాధ్యాయులు తమ సమస్యలను ఆన్లైన్ ద్వారా తెలియజేస్తే 25 రోజుల్లో పరిష్కారం చూపుతామని వెల్లడించారు. త్వరలో మూతబడిన పాఠశాలలను రీ ఓపెన్ చేయిస్తామని ప్రకటించారు. 18004252428 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా దీనికి సంబంధించిన మరింత సమాచారం తెలుసుకోవచ్చని సూచించారు. 72,73,74 జీవోలపై ఉన్న స్టేల పక్కన పెట్టి ప్రమోషన్స్ ఇవ్వాలని చూస్తున్నామని అన్నారు. ఆర్థిక శాఖ నుంచి అనుమతులు వచ్చిన వెంటనే విద్యాశాఖలో ఖాళీలను భర్తీ చేపడతామని స్పష్టం చేశారు.

# ముంపు బాధిత కుటుంబాలకు అండగా నిలవండి

### నిత్యావసర వస్తువులు పంపిణీ చేయండి

- ముంపు ప్రాంతాల్లో 70శాతానికిపైగా గిరిజన గ్రామాలున్నాయి
- ఒక్కో కుటుంబానికి రూ.5వేల చొప్పున ఆర్థికసాయం
- పంటలు దెబ్బతిన్న ప్రాంతాల్లో పరిహారం ఇస్తాం
- ఉచితంగా విత్తనాలను కూడా పంపిణీ చేస్తాం
- ఏపీ సీఎం జగన్మోహన్రెడ్డి
- ముంపు ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించిన జగన్
- ఢిల్లీ నుంచి నేరుగా ఏరియల్ సర్వేలో పాల్గొన్న సీఎం
- వరదల ఉధృతిపై మంత్రులు, అధికారులతో సమీక్ష

ఏలూరు, ఆగస్టు9(ఆర్ఎన్ఎ) : వరదలు, వర్షాల కారణంగా ముంపుకు గురైన కుటుంబాలకు నిత్యావసర వస్తువులు వెంటనే అందజేయాలని, శిబిరాల్లోకి తరలించిన వారికి భోజన సదుపాయం, వసతులు సమకూర్చాలని ఏపీ సీఎం జగన్మోహన్రెడ్డి మంత్రులు, అధికారులను ఆదేశించారు. పోలవరం ముంపు ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించారు. హెలికాప్టర్లో కాఫర్ డ్యామ్ కారణంగా ముంపునకు గురైన ప్రాంతాలను పరిశీలించారు.. వరద పరిస్థితి ఆరా తీశారు. ఢిల్లీ నుంచి నేరుగా ముంపు ప్రాంతాల్లోని వరద పరిస్థితిని ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు. సీఎం వెంట మంత్రులు పిల్లి సుభాష్ చంద్రబోస్, అనిల్కుమార్ యాదవ్లు ఉన్నారు. ఏరియల్ సర్వే తర్వాత ముఖ్యమంత్రి రాజమహేంద్రవరం విమానాశ్రయంలో ఏటీసీ టవర్ భవనంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రులు, అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ముంపు బాధిత ప్రాంతాల్లోని కుటుంబాలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలన్నారు. పునరావాస శిబిరాలకు తరలించిన కుటుంబాలకు భోజనాలు అందించాలని అధికారులకు సూచించారు. వాటితో పాటు అదనంగా ఆయా కుటుంబాలకు రూ.5వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేయాలని ఆదేశించారు. ఇళ్లు, పంట నష్టపోయినా నిబంధనల ప్రకారం అందే సహాయం కాకుండా ప్రత్యేకంగా రూ.5వేల ఆర్థిక సహాయం చేయనున్నట్టు సీఎం స్పష్టం చేశారు. ముంపునకు గురైన ప్రాంతాల్లో దాదాపు 70శాతానికి పైగా గిరిజన గ్రామాలు ఉన్నాయన్నారు. వరదల కారణంగా వారి జీవనోపాధి దెబ్బతిందని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకనే ప్రత్యేకంగా ఈ రూ.5వేలు సహాయం అందించాలని అధికారులకు సీఎం సూచించారు. మానవతా దృక్పథంతో గిరిజనులను ఆదుకోవాల్సి ఉన్నందునే ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. పంటలు దెబ్బతిన్న ప్రాంతాల్లో పరిహారం మాత్రమే కాకుండా ఉచితంగా విత్తనాలను కూడా పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. పోలవరం ప్రాజెక్టుకోసం సేకరించిన భూముల్లో సాగుచేసిన పంటలు కూడా వరదల కారణంగా దెబ్బతింటే.. అక్కడున్న వారికీ పరిహారంతో పాటు సబ్సిడీపై విత్తనాలు ఇవ్వనున్నట్టు చెప్పారు. ఇదిలా ఉంటే ధవళేశ్వరంకు ఎగువన ఉన్న దేవీపట్నం సహా ఇతర ప్రాంతాల్లో వరద పరిస్థితిని సీఎం అడిగితెలుసుకున్నారు. గోదావరిలో 10-11 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చినా పెద్దగా ముంపు ఉండేదికాదని.. కానీ, ఈసారి ముంపు ఎక్కువగా ఉందని ఎమ్మెల్యేలు, అధికారులకు సీఎం జగన్కు చెప్పారు. పోలవరం కాఫర్ డ్యామ్ కారణంగా ముంపు పెరిగిందని పలువురు ఎమ్మెల్యేలు సీఎంకు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితి రాకుండా తగిన ప్రణాళిక వేసుకోవాలని అధికారులకు సీఎం సూచించారు. ధవళేశ్వరం వద్ద నీటిమట్టాన్ని ప్రామాణికంగా తీసుకోకుండా పోలవరం వద్ద ప్రస్తుతం నిర్మిస్తున్న ప్రాజెక్టు వద్ద నీటిమట్టాన్ని పరిగణలోకి తీసుకుని, దానికి అనుగుణంగా ముందుజాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వచ్చే వరద, ముంపునకు గురయ్యే ప్రాంతాలను పరిగణలోకి తీసుకుని ఆమేరకు పోలవరం పునరావాస పనులు చేపట్టాలని ఆదేశించారు. త్వరగా ముంపునకు గురయ్యే ప్రాంతాలను మొదటి ప్రాధాన్యతగా తీసుకుని పునరావాస కార్యక్రమాలను వేగవంతం చేయాలన్నారు. పోలవరం పునరావాస కార్యక్రమాలను వేగవంతంగా చేపట్టి సమస్యలను వెంటనే పరిష్కరించడానికి వీలుగా ఒక ఐఏఎస్ అధికారిని నియమిస్తున్నట్టు సీఎం చెప్పారు. తక్షణమే ఆ అధికారి బాధ్యతలు తీసుకుని పునరావాస కార్యక్రమాలను వేగవంతం చేస్తారన్నారు.

# వైకాపా ప్రభుత్వానికి ఆర్నెళ్లు సమయమిస్తాం

- ఆర్టికల్ 370 రద్దుకు చాలా పార్టీలు సహకరించాయి
- బాబుకి సాధ్యంకావని చెప్పిన అంశాలే జగన్కు కూడా వర్తిస్తాయి
- ఎన్ఎమ్సీ బిల్లు విషయంలో అపోహలు వద్దు
- బిల్లు విషయంలో అనుమానాలు ఉంటే చర్చలతో నివృత్తి చేసుకోవచ్చు
- బీజేపీ అధికార ప్రతినిధి జీవీఎల్ నర్సింహారావు

విజయవాడ,ఆగస్టు9(ఆర్ఎన్ఎ): వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెన్నెళ్లే అవుతుందని, ఆ ప్రభుత్వానికి ఆరునెలల సమయమిస్తామని, తరువాతనే ప్రభుత్వం తీరుపై స్పందిస్తామని బీజేపీ అధికార ప్రతినిధి జీవీఎల్ నర్సింహారావు అన్నారు. గురువారం విజయవాడలో జరిగిన విలేకరుల సమావేశంలో జీవీఎల్ మాట్లాడారు.. జమ్మూకశ్మీర్కు ప్రత్యేక హక్కులు, స్వయం ప్రతిపత్తి కల్పిస్తున్న ఆర్టికల్ 370 రద్దుకు చాలా పార్టీలు సహకరించాయని తెలిపారు. ఏపీ ప్రభుత్వం లిఖితపూర్వకంగా కోరితే రామాయపట్నం పోర్టు పనులను ప్రారంభమవుతాయని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపై చంద్రబాబు ఆత్మవిమర్శ చేసుకోవాలనీ, చాలా కష్టపడ్డానంటూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడం సరికాదని హితవు పలికారు.

సాధ్యంకావని చెప్పిన అంశాలనే సీఎం జగన్ కోరడం విడ్డూరంగా ఉందని జీవీఎల్ అన్నారు. కొన్ని అంశాలు అమలు చేయడం సాధ్యం కాదని గతంలో చంద్రబాబుకు చెప్పామనీ, అవే జగన్కూ వర్తిస్తాయని స్పష్టం చేశారు. వైసీపీ ప్రభుత్వానికి ఆరు నెలల సమయం ఇస్తున్నామనీ, ఆ తర్వాతే ప్రభుత్వ పనితీరుపై స్పందిస్తామని చెప్పారు. ఏపీ ప్రభుత్వం కాంట్రాక్టులు రద్దుచేస్తే టీడీపీ నేతలు అంతలా ఎందుకు బాధపడుతున్నారని జీవీఎల్ ప్రశ్నించారు. టీడీపీ కాంట్రాక్టర్ల పార్టీనా అని ప్రశ్నించారు. తప్పులు జరిగినప్పుడు కాంట్రాక్టులు రద్దుచేయడం తప్పుకాదనీ, అయితే కావాలని రద్దుచేయడం తప్పని జీవీఎల్ అభిప్రాయపడ్డారు. ఎన్ఎమ్సీ బిల్లు విషయంలో అపోహాలు వద్దన్నారు. బిల్లు విషయంలో అనుమానాలు ఉంటే చర్చలు ద్వారా నివృత్తి చేసుకోవచ్చునని ఆయన సూచించారు. యాజమాన్యాలకు వత్తాసు పలికేలా బీజేపీ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోదన్నారు.

# వైసీపీ పిచ్చిపిచ్చిగా వ్యవహరిస్తే ఊరుకోం

- దాడుల గురించి కార్యకర్తలు భయపడొద్దు
- కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది
- టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు
- బాబును కలిసిన కృష్ణా జిల్లా టీడీపీ సానుభూతిపరులు

గుంటూరు, ఆగస్టు 9(ఆం ఎన్ఎ) : వైసీపీ నేతలు పిచ్చిపిచ్చిగా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకోమని, తగిన గుణపాఠం చెబుతామని టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. గుంటూరులోని టీడీపీ కార్యాలయంలో తనను కలుసుకున్న పార్టీ కార్యకర్తలతో చంద్రబాబు మాట్లాడారు. వైసీపీ నేతలు తమపై దాడులకు పాల్పడ్డట్టు కృష్ణా జిల్లాకు చెందిన టీడీపీ సానుభూతిపరులు ఆయనకు ఫిర్యాదు చేశారు. వైసీపీ దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇలాంటి దాడులను సహించమని హెచ్చరించారు. కృష్ణా జిల్లా వత్సవాయి మండలంలోని భీమవరానికి చెందిన శ్రీహరి అనే అతను టీడీపీకి సహకరించాడని, అతని ఇల్లంతా ధ్వంసం చేశారని మండిపడ్డారు. అతని కుటుంబానికి నిలువ నీడ లేకుండా చేశారని ధ్వజమెత్తారు. శ్రీహరి కుటుంబానికి పార్టీ పరంగా రూ.50 వేలు ఆర్థికసాయం చేసి ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

ఇది చాలా దారుణమని, తీవ్రంగా ఖండిస్తున్నట్టు చంద్రబాబు చెప్పారు. ఈ ఘటనపై సీఎం, ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అవసరముందని, వైసీపీ వాళ్లు పిచ్చిపిచ్చిగా వ్యవహరిస్తే ఊరుకోమని తీవ్రంగా హెచ్చరించారు. గుంటూరు జిల్లా పల్నాడులోని టీడీపీ కార్యకర్తలు, సానుభూతిపరులను వైసీపీ భయపెడుతుండటంతో వారు తమ గ్రామాలు విడిచే వెళ్లే పరిస్థితి వచ్చిందని చంద్రబాబు పేర్కొనడం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం టీడీపీ నాయకులను పల్నాడు ప్రాంతానికి పంపిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

### మనస్ఫూర్తిగా కియాను అభినందిస్తున్నా..

దక్షిణ కొరియా కార్ల తయారీ దిగ్గజం కియ పరిశ్రమ మేడిన్ ఇండియా పేరుతో తయారు చేసిన తొలి కారును గురువారం ప్రారంభించింది. దీనిపై స్పందించిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ కియా మొదటి కార్ గురువారం రోడ్డుపైకి వస్తున్న సందర్భంగా మనస్ఫూర్తిగా కియాను అభినందిస్తున్నానని అన్నారు. ఆటో మొబైల్ రంగంలో కియా ఒక నూతన ట్రెండ్ తీసుకురావాలని ఆకాంక్షించారు. కియా కోసం తీవ్ర ప్రయత్నాలు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. కియా ఎంతో మందికి ఉపాధి కల్పిస్తుందని, కియా సంస్థ యాజమాన్యానికి మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు చంద్రబాబు చెప్పారు

# సెయిల్ చైర్మన్పై హత్యాయత్నం

- ఇద్దరు దుండగులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

న్యూఢిల్లీ, ఆగస్టు9(ఆర్ఎన్ఎ) : స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్) చైర్మన్ అనిల్ కుమార్ చౌదరిపై హత్యాయత్నం జరిగింది. హైవే పెట్రోలింగ్ స్టాఫ్ ఆయనను కాపాడగలిగారు. న్యూఢిల్లీలో బుధవారం రాత్రి ఈ సంఘటన జరిగింది. గురువారం ఈ విషయాన్ని సెయిల్ ఓ ప్రకటనలో తెలిపింది.

సెయిల్ ప్రభుత్వం రంగంలోని అతి పెద్ద ఉక్కు ఉత్పత్తిదారు. అనిల్ కుమార్ (58) బుధవారం రాత్రి 10.30 గంటలకు తన కార్యాలయం నుంచి ఇంటికి బయల్దేరారు. మార్గమధ్యంలో ఆగస్ట్ క్రాంతి రోడ్డులో ఓ కారు వచ్చి, ఆయన కారును ఢీకొట్టింది. ఆ కారులోని నలుగురు దుండగులు అకస్మాత్తుగా కారు డ్రైవర్తోపాటు అనిల్పై ఇనుప రాడ్లతో దాడి చేశారు. డ్రైవర్ను ఓ వ్యక్తి పట్టుకోగా, మరో ముగ్గురు అనిల్పై దాడిచేశారు. ఆయన తల, మెడ, మోకాళ్ళు, కాళ్ళపై విపరీతంగా కొట్టారు. అదే సమయంలో డిఫెన్స్ కాలనీ హైవే పెట్రోలింగ్ స్టాఫ్ ఆ ప్రదేశానికి వచ్చి, అనిల్ను కాపాడారు. దుండగుల్లో ఇద్దర్ని పోలీసులు అరెస్ట్ చేశారు. యాక్సిడెంట్ చేసిన కారును స్వాధీనం చేసుకున్నారు. అనిల్పై హత్యాయత్నం తమను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని సెయిల్ ప్రకటన పేర్కొంది.

### రామాయపట్నం పోర్టుకు..

# సహజ అనుకూలతలు ఉన్నాయి

- బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నర్సింహారావు

ఒంగోలు, ఆగస్టు9(ఆర్ఎన్ఎ) : రామాయపట్నం పోర్టు నిర్మాణానికి అన్ని సహజ అనుకూలతలు ఉన్నాయని బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నర్సింహారావు అన్నారు. శుక్రవారం రామాయపట్నం పోర్టు ఏరియాను పరిశీలించిన జీవీఎల్.. పోర్టు వల్ల జరిగే మంచి చెడుల గురించి గ్రామసులతో చర్చించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గత టీడీపీ ప్రభుత్వం ప్రకాశం జిల్లాపై కక్ష సాధించిందని విమర్శించారు. రామాయపట్నం పోర్టు నిర్మాణానికి అన్ని అనుకూలంగా ఉన్నా గత టీడీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఆలోచించలేదని మండిపడారు. పోర్టుపై కేంద్ర ప్రభుత్వం లేఖ రాసినా.. టీడీపీ ప్రభుత్వం సమాధానం ఇవ్వలేదని చెప్పారు. రామాయ పట్నం పోర్టుకు సహజ అనుకూలతలు ఉన్నాయని వివరించారు. కానీ ప్రస్తుతం ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పోర్టుకు సానుకూలంగా ఉందన్నారు. పోర్టు కోసం తాను కూడా గట్టిగా ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. దీనిపై అవసరమైతే ప్రధానితో కూడా మాట్లాడతానని జీవీఎల్ పేర్కొన్నారు.

# కియో కారుకు లంఛనంగా ప్రారంభం

అనంతపురం,ఆగస్టు9 (ఆర్ ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్ ఆటోమొబైల్ రంగంలో నవశకం ఆరంభ మైంది. ఆంధ్రా తయారీ కియా కారు లాంఛనంగా మార్కెట్లోకి విడుదలైంది.

సెల్టాస్ మోడల్ వాహ నాన్ని గురువారం కియా సంస్థ ఆవిష్కరించింది. ఈ కార్యక్రమంలో కియా సంస్థ ప్రతినిధులతో పాటు రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి శంకరనారాయణ, ఏపీఐఐసీ ఛైర్పర్సన్ రోజా పాల్గొన్నారు. అనంతపురం జిల్లా పెనుకొండ సమీపంలో సుమారు 530 ఎకరాల విస్తీర్ణంలో రెండేళ్ల క్రితం ప్రారంభమైన కియా మోటార్స్ కంపెనీ అతివేగంగా నిర్మాణం జరిగింది. అంతేవేగంగా కార్ల ఉత్పత్తిని కూడా ప్రారంభించారు. ఈ ఎ÷-లాంట్లో తయారైన తొలి కారును గురువారం విడుదల చేశారు.

# ధర్నాలు, ర్యాలీలకు అనుమతులు తప్పనిసరి

### ఆందోళనల్లో హింసకు తావీయరాదు: సుచరిత

విశాఖపట్టణం,ఆగస్టు9(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో ధర్నాలు, ర్యాలీలు చేయదలచుకుంటే ముందుగా అనుమతి తీసుకోవాలని ఏపీ హోంమంత్రి మేకతోటి సుచరిత అన్నారు. శాంతియుతంగా చేపట్టే నిరసనలకు ప్రభుత్వం అనుమతిస్తుందని చెప్పారు. నిరసనల్లో హింసాత్మక ఘటనలకు పాల్పడవద్దని ఆమె విజ్ఞప్తి చేశారు. విశాఖలో 'మహిళా మిత్ర' కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం మీడియాతో ఆమె మాట్లాడారు. ఎంఎన్సీ బిల్లుకు వ్యతిరేకంగా బుధవారం విజయవాడలో జరిగిన ధర్నాలో జూనియర్ డాక్టర్లపై పోలీసులు చేయిచేసుకోవడాన్ని తాము ఖండిస్తున్నామన్నారు. ఆ ఘటనపై ఇప్పటికే విచారణకు ఆదేశించామని చెప్పారు. జూనియర్ డాక్టర్లు తమ హక్కుల కోసం ధర్నాలు చేసుకోవచ్చన్నారు. మరోవైపు విజయవాడలో జూనియర్ డాక్టర్లపై పోలీసుల దాడి అనుకోకుండా జరిగిన సంఘటన అని డీజీపీ గౌతమ్ సవాంగ్ అన్నారు. దానికి సంబంధించిన దృశ్యాలు చూస్తుంటే పోలీసులు పొరపాటు చేసినట్లే కనిపిస్తోందన్నారు. విజయవాడలో దాడి ఘటనపై విచారణకు ఆదేశించామని సవాంగ్ వివరించారు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో పరిస్థితి అదుపులో ఉందని డీజీపీ చెప్పారు. మావోయిస్టులు ప్రజల్లో ఉనికి కోసం పాకులాడుతున్నారని.. అందుకే హింసకు మార్గాలు వెతుకుతున్నారని ఆయన విమర్శించారు. కళాశాలల్లో విద్యార్థినుల రక్షణకు వర్చువల్ పోలీస్స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు డీజీపీ తెలిపారు.

# ఉగాదినాటికి లబ్దిదారులకు ఇళ్లపట్టాలు,ఇళ్ల పంపిణీ

**రూరల్, అర్బన్ సెక్టార్లలో ఇంటి స్థలాల లబ్దిదారుల ఎంపిక**

**రెవెన్యూ భూముల సంస్కరణలకు ఇదే సరైన సమయం**

**వాస్తవ భూములను గుర్తించడంలో కార్యాచరణ ప్రణాళిక**

**జాయింట్ కలెక్టర్ల సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మన్మోహన్ సింగ్**

అమరావతి,ఆగస్ట్9(ఆర్ఎన్ఎ): చట్టబద్ధమైన విధానాల్లో భూముల రీసర్వే తప్పనిసరిగా చేపట్టాల్సి ఉందని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మన్మోహన్ సింగ్ పేర్కొన్నారు. అందుకనుగుణంగా క్షేత్రస్థాయిలో కార్యాచరణ ప్రణాళికను రూపుదిద్ది పూర్తిస్థాయి శిక్షణతో సర్వేను చేపట్టాలన్నారు. అమరావతి సెక్రటేరియట్‌లోజాయింట్ కలెక్టర్లతో ఇండ్లస్థలాలు, భూములు, డాటెడ్ ల్యాండ్స్,రెవెన్యూ సంస్కరణలు తదితర అంశాలపై సమన్వయ శాఖల ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మన్మోహన్ సింగ్ మాట్లాడుతూ, గత నెలరోజులలో ప్రభుత్వం అనేక విప్లవాత్మకమైన నిర్ణయాలను తీసుకోవడం జరిగిందన్నారు. దేశంలోనే ప్రప్రథమంగా ల్యాండ్ టైటిలింగ్ బిల్లు-2019 ప్రవేశపెట్టడం ద్వారా భూయజమానులకు పూర్తి రక్షణ కల్పించడం జరుగుతోందన్నారు. అందులో భాగంగా డీడీ రిజిస్ట్రేషన్ కు బదులుగా టైటిల్ రిజిస్ట్రేషన్ చేపట్టడం జరుగుతోందన్నారు. సాగుదార్ల హక్కు చట్టం-2019 తీసుకురావడం ద్వారా సాగుదార్లకు ప్రత్యేక హక్కులు కల్పించడం తో పాటు పట్టాదారు హక్కుదార్లకు భంగం కలగకుండా చట్టం చేయడం జరిగిందన్నారు. సమగ్ర భూ సర్వేను చేపట్టడంలో భాగంగా ప్రతి గ్రామానికి ఒక సర్వేయర్ ను నియమించడం దేశ చరిత్రలోనే తొలిసారని ఆయన తెలిపారు. భూముల సమగ్ర సర్వేను చేపట్టడంలో నిర్దిష్టమైన ప్రణాళికలను రూపొందించుకొని తదనుగుణంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి సమగ్ర విధానాల్లో భూ సర్వేను చేపట్టాల్సి ఉందని, సిబ్బందికి తగిన విధంగా శిక్షణను అందించి పూర్తిస్థాయిలో సన్నద్ధం చేయాలన్నారు. 25 లక్షల మందికి ఉగాది నాటికి ఇళ్లు లేదా ఇళ్ల స్థలాలు అందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంకల్పించారని అందుకనుగుణంగా క్షేత్రస్థాయిలో ఆ దిశగా ప్రయత్నాలు 2020 ఫిబ్రవరి నాటికల్లా పూర్తి చేయాలని మన్మోహన్ సింగ్ తెలిపారు.లబ్దిదారుల ఎంపిక పూర్తి పారదర్శకంగా జరగాలని గ్రామసభలను నిర్వహించి ఎంపికను చేపట్టాలన్నారు. అనర్హులను ఎంపిక చేయకుండా తగిన జాగ్రత్తలను తీసుకోవాలని ఆయన తెలిపారు. రెవెన్యూ పరంగా 22డాటెడ్ ల్యాండ్స్ కు సంబంధించి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాటికి సకాలంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పరిష్కారం చూపాలన్నారు. రెవెన్యూ రికార్డుల స్వచ్ఛీకరణ(ప్యూరిఫికేషన్) ప్రక్రియను వేగవంతం చేయాలని వారికి వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించేలాగా క్రియాశీలకంగా వ్యవహరించాల్సి ఉందన్నారు. సమస్యలను ఒక డేటాబేస్‌గా రూపొందించుకొని పరిష్కారాలు చూపాల్సి ఉందన్నారు. మ్యూటేషన్, వెబ్ ల్యాండ్ అడంగల్ లలో వ్యత్యాసాలు ఉన్నాయని జిల్లాస్థాయిలో సమీక్షించి త్వరితగతిన పరిష్కారాన్ని చూపాలన్నారు. ప్రభుత్వ విధానాల్లో భాగంగా త్వరలోనే రెవెన్యూ సదస్సులను నిర్వహించడం జరుగుతుందన్నారు. రెవెన్యూ సంస్కరణల్లో జాయింట్ కలెక్టర్లు తగిన సలహాలు, సూచనలతో ముందుకు రావాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కోరారు. సమావేశాల్లో భాగంగా ఇంటిస్థలాలు, కౌలుదారు చట్టం, అటవీ భూములు), రీ సర్వే, గ్రామ సెక్రటేరియట్‌లు, శిక్షణ మరియు వినియోగం, స్పందన కార్యక్రమం, ల్యాండ్ సీలింగ్ పెండింగ్ కేసులు, భూ సంస్కరణలు, రెవెన్యూ సదస్సులు, రెవెన్యూ సంస్కరణలు, రోడ్లు,భవనాలు, పౌర సరఫరాలు తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో ముఖ్యమంత్రి కార్యాలయ ప్రధాన సలహాదారు అజేయకల్లాం, ప్రభుత్వ సలహాదారు ఎమ్.శామ్యూల్, ప్రత్యేక ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాంబశివరావు, వ్యవసాయ ముఖ్య కార్యదర్శి మధుసూధన్ రెడ్డి, సర్వే అండ్ సెటిల్ మెంట్ సంచాలకులు ప్రభాకర్ రెడ్డి, 13 జిల్లాల జాయింట్ కలెక్టర్లు, సర్వే లాండ్ రికార్డ్స్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో కూర్చుని వైద్యవ్యవస్థ నియంత్రిస్తారా?

**- జూడాల ఆందోళనలో కోదండరామ్**

**- వైద్యరంగంలో జరిగే తప్పులను మోడీ దృష్టికి తీసుకెళ్లాలి**

**- సినీ నటుడు రాజశేఖర్**

**- జూడాల ధర్నాలో పాల్గొని మద్దతు తెలిపిన ప్రముఖులు**

హైదరాబాద్, ఆగస్టు9(ఆర్ఎన్ఎ) : ఢిల్లీలో ఎవరో కూర్చుని ఇక్కడ వైద్య వ్యవస్థను నియంత్రించడం సరికాదని తెజస అధ్యక్షుడు కోదండరామ్ పేర్కొన్నారు. ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద వైద్యులు చేపట్టిన వైద్య గర్జనకు తెలంగాణ జనసమితి సంపూర్ణ మద్దతు ప్రకటించింది. గురువారం ఈ ధర్నాలో కోదండరాంతో పాటు సినీనటులు జీవిత, రాజశేఖర్ దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ.. గతంలో ఎన్ఎంసీ బిల్లు చట్టం కాకుండా అడ్డుకున్నామని చెప్పారు. ఇప్పుడు దాన్ని మార్చే వరకు ఊరుకోబోమని స్పష్టంచేశారు. వైద్య విధానం రాష్ట్రం పరిధి నుంచి కేంద్రం పరిధిలోకి తీసుకునేందుకే ఈ బిల్లు తీసుకొస్తున్నారని వివరించారు.

**వైద్యరంగంలో జరిగే తప్పులను మోడీ దృష్టికి తీసుకెళ్లాలి - రాజశేఖర్**

వైద్య రంగంలో జరిగే తప్పులను మోడీ దృష్టికి తీసుకెళ్లాలని, వైద్య రంగంలో అర్హత లేని డాక్టర్లు చాలా మంది ఉన్నారని నటుడు రాజశేఖర్ అన్నారు. వైద్య రంగంలో జరిగే తప్పులను మోడీ దృష్టికి తీసుకెళ్లాలని తెలిపిన రాజశేఖర్.. వైద్య రంగంలో కొత్త చట్టాలు, బిల్లులు అనేది వైద్యరంగ నిపుణుల ద్వారా తేవాలన్నారు. బిల్లు కోసం కమిటీ వేశారని..ఆ కమిటీలో ఐఏఎస్, రాజకీయ నాయకులు మాత్రమే ఉన్నారని తెలిపారు. ఆరునెలల కోర్సు చేస్తే డాక్టర్ అవుతాడు అనేది హాస్యాస్పదంగా ఉందన్నారు. బ్రిడ్జి కోర్సు వల్ల అర్హత లేని వాళ్ళందరూ డాక్టర్లు అయ్యే అవకాశం ఉంటుందని రాజశేఖర్ అన్నారు. ఇప్పటికే చెయ్యని తప్పులకు డాక్టర్లు ఇబ్బందులు ఎదురుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వం అనేది ప్రజలకు న్యాయం చేసే విధంగా నిర్ణయాలు ఉండాలన్న ఆయన.. తొందరపాటుగా నిర్ణయాలు ఉండకూడదన్నారు. ప్రజలకు అన్యాయం చేసే విదంగా నిర్ణయాలు ఉంటే ఎన్నికల్లో ప్రజలు సరైన తీర్పును ఇస్తారని చెప్పారు. ఎన్ఎంసీ బిల్లులో తప్పులను కేంద్రం సవరణలు చెయ్యాలని రాజశేఖర్ పేర్కొన్నారు.

**రాష్ట్ర వ్యాప్తంగా వైద్యుల నిరసనలు ..**

ఎన్ఎంసీ బిల్లుపై వైద్యులు, జూనియర్ వైద్యుల నిరసన గురువారం కూడా కొనసాగుతోంది. బిల్లును వ్యతిరేకిస్తూ వైద్య సేవలను నిలిపివేశారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆస్పత్రుల్లో వైద్య సేవలకు అంతరాయం ఏర్పడింది. ఐఎంఏ పిలుపు మేరకు వైద్యులు సమ్మెబాట పట్టారు. గురువారం ఉదయం 6గంటల నుంచి శుక్రవారం ఉదయం 6గంటల వరకు తమ నిరసన కొనసాగిస్తామని వైద్యులు ప్రకటించారు. అందులో భాగంగా అత్యవసర సేవలు మినహా సాధారణ సేవల్ని నిలిపివేశారు. హైదరాబాద్‌లోని ప్రధాన ఆస్పత్రుల ఎదుట ధర్నాకు దిగారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. వైద్యుల నిరసనతో గాంధీ, నిమ్స్ ఆస్పత్రుల వద్ద రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆదిలాబాద్, నిజామాబాద్ తదితర చోట్ల వైద్యులు విధుల్ని బహిష్కరించారు. తమకు నష్టం కల్గించే క్లాజ్‌ను కేంద్రం మార్చే వరకు తమ నిరసన కొనసాగిస్తామని జూడాలు స్పష్టం చేశారు.

# నిండుకుండలా శ్రీశైలం

**- ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీగా వరదనీరు**

**- 879.30అడుగులకు చేరిన శ్రీశైలం ప్రాజెక్టు నీటిమట్టం**

**- ప్రాజెక్టు మూడుగేట్లు ఎత్తిన ఏపీ మంత్రి అనిల్‌కుమార్**

**- నాగార్జున సాగర్‌కు పరవళ్లు తొక్కనున్న కృష్ణమ్మ**

శ్రీశైలం, ఆగస్టు9(ఆర్ఎన్ఎ) : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు శ్రీశైలం జలాశయానికి వరద నీరు పోటెత్తుతోంది. దీంతో శ్రీశైలం ప్రాజెక్టు నిండుకుండను తలపిస్తోంది. ఎగువ ప్రాంతమైన జూరాల ప్రాజెక్టు నుంచి 3,59,867 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలంలోకి వచ్చి చేరుతుంది. శ్రీశైలం పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా.. శ్రీశైలం ప్రస్తుత నీటి మట్టం 879.30 అడుగులకు చేరింది. దీంతో శుక్రవారం సాయంత్రం ఏపీ జలవనరుల శాఖమంత్రి అనిల్‌కుమార్ యాదవ్ మూడు గేట్లను ఎత్తి వరద నీటిని దిగువకు విడుదల చేయనున్నారు. జలాశయ పూర్తిస్థాయి సామర్థ్యం 215.81 టీఎంసీలకుగానూ ప్రస్తుత నీటి నిల్వ 184.27 టీఎంసీలుగా నమోదైంది. కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా 800 క్యూసెక్కులు, ఎడమగట్టు విద్యుత్ కేంద్రం ద్వారా 42,378 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కుడిగట్టు విద్యుత్ కేంద్రం ద్వారా 32,272 క్యూసెక్కులు, హంద్రీనీవా ప్రాజెక్టుకు 1351 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ ద్వారా 20,000 క్యూసెక్కులు, ముచ్చుమర్రి నుంచి కేసీ కెనాల్ కు 735 క్యూసెక్కులు నీటిని వదులుతున్నారు. మరోవైపు కృష్ణానదిలో వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది. ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల జలాశయాలు పూర్తిగా నిండిపోయాయి. ఆల్మట్టి పూర్తిస్థాయి సామర్థ్యం 129.72 టీఎంసీలుకాగా..ప్రస్తుతం 88.68 టీఎంసీల నీటి నిల్వ ఉంది.3,49,526 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. అంత కంటే ఎక్కువగా 3,64,052 క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు. నారాయణపూర్ జలాశయ పూర్తిస్థాయి సామర్థ్యం 37.64 టీఎంసీలకుగానూ..ప్రస్తుతం 20.04 టీఎంసీల నీటి నిల్వ నమోదైంది. నారాయణపూర్ జలాశయానికి 4,02,951 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోలో వస్తుండగా.. మొత్తం 4,18,637 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. జూరాల పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 9.66 టీఎంసీలు కాగా.. ప్రస్తుత నీటి నిల్వ 6.05 టీఎంసీలుగా ఉంది. జూరాలకు ఇన్ ఫ్లో 3,69,484 క్యూసెక్కులు, ఔట్ ఫ్లో 3,74, 600 క్యూసెక్కులుగా నమోదైంది. జూరాల ప్రాజెక్టులోని 38గేట్లు ఎత్తి అధికారులు శ్రీశైలం ప్రాజెక్టుకు నీటిని వదులు తున్నారు. మరోవైపు తుంగభద్ర జలాశయానికి కూడా వరద ప్రవాహం కొనసాగుతోంది. తుంగభద్ర పూర్తిస్థాయి సామర్థ్యం 100.86 టీఎంసీలు కాగా. .ప్రస్తుతం నీటి నిల్వ 60.72 టీఎంసీలుగా ఉంది. తుంగభద్రకు ఇన్ ఎ÷-లో 1,42,114 క్యూసెక్కులు, ఔట్ ఎ÷-లో 4,089 క్యూసెక్కులుగా ఉంది. నాగార్జున సాగర్ పూర్తిసాయి నీటి సామర్థ్యం 312.05 టీఎంసీలకు గానూ.. ప్రస్తుత నీటి నిల్వ 142.08 టీఎంసీలుగా ఉంది. నాగార్జునసాగర్ కు ఇన్ ఎ÷-లో 64,136 క్యూసెక్కులు వస్తుండ గా..9,271 క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు.

**హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు..**

ఎగువ ప్రాంతాల్లో పడుతున్న భారీ వర్షాలతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో పడుతున్న వర్షాలతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిన్నమొన్నటి వరకు నీరులేక ప్రాజెక్టులు బోసిపోయాయి. దీంతో ఈఏడాది వరిసాగు భారీగా తగ్గుతుందని అధికారులు అంచనా వేశారు. కాగా గత వారం రోజులుగా ఎగువ ప్రాంతాలతో పాటు తెలుగు రాష్ట్రాల్లో భారీగా కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టుల్లోకి నీరు వచ్చిచేంతుంది. ముఖ్యంగా తెలంగాణలోని జూరాల ప్రాజెక్టు, బీమా, శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల్లోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతుండటంతో ఆయా ప్రాజెక్టుల పరిధిలో ఆయకట్టు రైతులు వరినాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో నిన్న మొన్నటి వరకు రైతుల్లో ఆందోళన నింపిన వరుణుడు.. విజృంభించి ప్రాజెక్టులను నిండుకుండలా మార్చడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## పర్యావరణం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలునాటాలి

కామారెడ్డి,ఆగస్టు9 (ఆర్ఎన్ఎ): పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ సత్యనారాయణ అన్నారు. సదాశివ నగర్ మండలంలోని మల్లుపేట్‌లో మొక్కలనాటే కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఇప్పుడు మొక్కలు నాటితే భావితరాల వారికి స్వచ్ఛమైన గాలిని అందిస్తాయన్నారు. మొక్కలు నాటితే నీడతోపాటు ఆహారం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఇంటికి ఐదేసి మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి బాలకిషన్, ఎంపీపీ అనసూయ, నోడల్ అధికారి విఠల్‌రావు, ఎంపీటీసీ సభ్యురాలు సుజాత, గ్రామసంఘ ప్రతినిధులు పాల్గొన్నారు. సదాశివనగర్ మండలంలోని పద్మజావాడి గ్రామంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సర్పంచి కవిత గురువారం మొక్కలు పంపిణీ చేశారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రతి విద్యార్థికి రెండేసి పండ్ల మొక్కలను అందించారు. వాటిని విద్యార్థులు ఇంటి ఆవరణలో నాటి సంరక్షించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు గీత, ఎస్ఎంసీ ఛైర్మన్ రఫిక్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# కులభూషణ్ వ్యవహారంలో పాక్ మళ్లీ మెలిక

**నిబంధనల మేరకే అనుమతి అంటూ ప్రకటన**

ఇస్లామాబాద్,ఆగస్టు9 (ఆర్ఎన్ఎ): కాశ్మీర్ ఘటనల నేపథ్యంలో తిరోగమన చర్యలకు పాల్పడుతున్న పాక్ తాజాగా మరో మెలిక పెట్టింది. భారత నౌకాదళ విశ్రాంత అధికారి కుల్‌భూషణ్ జాదవ్ కేసులో భారత్ రాయబార కార్యాలయంనుంచి ప్రతిబంధకం లేని న్యాయ సహాయాన్ని పాకిస్థాన్ గురువారం తోసిపుచ్చింది. గతంలో ఆ దేశం ఇచ్చిన నిబంధనలతో కూడిన అనుమతిపై భారత్ అభ్యంతరం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఆయన్ను కలుసుకోడానికి ఎటువంటి ఆటంకం, పర్యవేక్షణ లేని వాతావరణాన్ని పాక్ కల్పించాలని కోరింది. అయితే ఈ విషయంలో ఐసీజే ఇచ్చిన తీర్పును కూడా దాయాది దేశం లెక్కచేయక పోవడం గమనార్హం. జులై నెలలో ఐసీజే ఇచ్చిన ఆదేశాల మేరకు జాదవ్‌ను కలవడానికి పాక్ అనుమతించిన సంగతి తెలిసిందే. ఐసీజే ఆదేశాల మేరకు భారత దౌత్యాధికారులు జాదవ్‌ను కలుసుకోవడానికి అంగీకరిస్తూనే.. పాకిస్థాన్ చట్టాల ప్రకారం మూడు నిబంధనలు పెడుతున్నట్లు పేర్కొంది. సమావేశంలో సమయంలో పాకిస్థాన్ అధికారి హాజరు, సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయడం వంటివి వాటిలో ఉన్నాయి. వాటిపై భారత్ అభ్యంతరం వ్యక్తం చేసింది. వియన్నా ఒప్పందం ప్రకారం.. విదేశాల్లో బందీలుగా ఉన్న వ్యక్తులను వారి దేశాలకు చెందిన అధికారులు ఏ ఆటంకం లేకుండా కలుసుకోవచ్చని నిబంధనలు చెబుతున్నాయని భారత్ వాదిస్తోంది. ఇదిలా ఉండగా, ఆర్టికల్ 370 రద్దు నేపథ్యంలో తీవ్ర నిర్ణయాలు తీసుకుంటున్న పాక్ తాజాగా 'పాకిస్థాన్ సినిమా థియేటర్లలో ఏ భారతీయ సినిమాను ప్రదర్శించం' అని ఆ దేశ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ప్రత్యేక సహాయకుడు డాక్టర్ ఫిర్దౌస్ ఆషిక్ అవాన్ వెల్లడించారు.

# ఇలాంటి తీర్పులతో దుర్మార్గులకు వణుకు

**తీర్పును స్వాగతించిన చిన్నారి తల్లిదండ్రులు**

వరంగల్,ఆగస్టు9 (ఆర్ఎన్ఎ): తొమ్మిది నెలల పసిపాపపై అత్యాచారం చేసి హత్య చేసిన ఘటనలో వరంగల్ ఫాస్ట్ ట్రాక్ కోర్టు న్యాయమూర్తి కె.జయకుమార్ గురువారం సంచలన తీర్పును వెలువరించడంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. ఇది సంచలన తీర్పుఅని బార్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. నిందితుడు ప్రవీణ్‌కు మరణ శిక్షను ఖరారు చేస్తూ తీర్పు చెప్పడంతో ఇక దుర్మార్గులకు వణుకు పుట్టాలన్నారు. వరంగలకు చెందిన పసిపాపపై ప్రవీణ్ అనే ఉన్మాది అత్యాచారానికి పాల్పడటం తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. తీర్పుపై స్పందించిన చైల్డ్ వెల్ఫేర్ ఛైర్మన్ పరశురాంమాట్లాడుతూ ఇది చాలా సంచలనాత్మమైన తీర్పని అన్నారు. 9 నెలల పాపపై అత్యాచారం చేయడం సిగ్గుచేటని అన్నారు. అత్యాచారానికి గురైన చిన్నారి తల్లి దండ్రులు మాట్లాడుతూ తాము ఆశించిన తీర్పు వచ్చిందని, న్యాయం జరిగినట్టే భావిస్తున్నామని.. కానీ ఉన్మాదికి శిక్ష అమలు జరిగిన నాడే తమకు నిజమైన సంతోషమని అన్నారు. దీనికి సహకరించినవారందరికీ వారు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే దేశవ్యాప్తంగా అత్యాచారానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న అన్ని కేసుల్లో ఇలాగే త్వరితగతిన తీర్పులు రావాలని, నిందితులకు ఉరిశిక్ష వడాలని కోరుకుంటున్నామని ప్రజా సంఘాలు, మహిళలు డిమాండ్ చేస్తున్నారు.

# కళింగ తీరం కోత..సముద్రంలోకి విగ్రహాలు

శ్రీకాకుళం,ఆగస్ట్9(ఆర్ఎన్ఎ): జిల్లా గార మండలంలోని కళింగపట్నం తీరం వద్ద వంశధార నది సముద్రంలో కలిసే ప్రాంతం భారీగా కోతకు గురైంది. గొట్టాబ్యారేజీ నుంచి వచ్చిన వరద ప్రవాహాన్ని వచ్చినట్లుగానే అధికారులు సముద్రంలోకి విడిచిపెట్టడంతో నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. కళింగపట్నం తీరాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అధికారులు గతంలో చర్యలు తీసుకున్నారు.దీనిలో భాగంగా పర్యాటకులను ఆకర్షించేందుకు రకరకాల విగ్రహాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ ప్రాంతం నది ఉద్ధృతికి కోతకు గురవడంతో విగ్రహాలు ప్రవాహంలో కొట్టుకుపోయాయి. అంతా చూస్తుండగానే ఒక్కో ఆకారం సముద్రంలో కలిసిపోయింది.

## తప్పిపోయిన బాలుడి గుర్తింపు

కాకినాడ,ఆగస్ట్9(ఆర్ఎన్ఎ): తూర్పుగోదావరి జిల్లా ఏలేశ్వరం మండలం ఎర్రవరం గ్రామానికి చెందిన 11ఏళ్ల బాలుడు తోట ధనుష్ అదృశ్యం కథ సుఖాంతమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రవరం గ్రామానికి చెందిన ధనుష్‌ఏలేశ్వరంలో ఓ ప్రైవేటు పాఠశాలలో ఆరోతరగతి చదువుతున్నాడు. స్వగ్రామం నుంచి ఏలేశ్వరం పాఠశాలకు ఆర్టీసీ బస్సులో రాకపోకలు సాగిస్తుండేవాడు. ఈ క్రమంలో గురువారం పాఠశాలకు వెళ్లిన బాలుడు.. సాయంత్రం ఇంటికి చేరుకోలేదు. అర్ధరాత్రి వరకు కుమారుడి ఆచూకీ లభ్యం కాకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. ఈ క్రమంలో పోలీసులకు ఏలేశ్వరం డిగ్రీ కళాశాల సమీపంలో స్వల్ప గాయాలతో పడివున్న బాలుడు ధనుష్నును గుర్తించారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నామని, పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని ఎస్పై కె.సుధాకర్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## అప్పులబాధతో కౌలురైతు ఆత్మహత్య

కరీంనగర్,ఆగస్టు8(ఆర్ఎన్ఎ): అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం పారువెల్ల గ్రామానికి చెందిన కౌలు రైతు వరుకోలు లచ్చయ్య(52) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గత రెండు సంవత్సరాలుగా రెండు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని లచ్చయ్య వ్యవసాయం చేస్తున్నాడు. అయితే లచ్చయ్య ఆత్మహత్యకు అప్పుల బాధే కారణమని స్థానికులు చెబుతున్నారు. లచ్చయ్యకు భార్య మణెమ్మ, కుమారుడు, కూతురు ఉన్నారు.

# పాక్ మాజీ ప్రధాని షరీఫ్ కుమార్తె అరెస్ట్

లాహోర్,ఆగస్టు9(ఆర్ఎన్ఎ): పాకిస్తాన్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ కుమార్తె, పీఎంఎల్ఎన్ పార్టీ ఉపాధ్యక్షురాలు మరియం నవాజ్ మరోసారి అరెస్ట్ అయ్యారు. చౌద్రీ సుగర్ మిల్స్ కేసులో పాకిస్తాన్ నేషనల్ అకౌంటబిలిటీ బ్యూరో (ఎన్ఏబీ) అధికారులు ఇవాళ ఆమెను అదుపులోకి తీసుకున్నారు. లోహోర్‌లోని కోట్ లక్‌పత్ జైల్లో ఉన్న తన తండ్రిని కలుసుకునేందుకు ఆమె వెళుతుండగా అధికారులు అరెస్ట్ చేసినట్టు స్థానిక మీడియా వెల్లడించింది. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు తనంత తానే ఎన్ఏబీ కార్యాలయానికి వెళ్లాలని భావించినప్పటికీ.. ఈలోగానే ఆమెను అదుపులోకి తీసుకోవడం గమనార్హం. అవెన్‌ఫీల్డ్ అవినీతి కేసులో తన భర్త, తండ్రితో పాటు మరియం కూడా గతేడాది జైల్లో గడిపిన సంగతి తెలిసిందే. కొద్దినెలల్లోనే ఈ ముగ్గురూ విడుదల కాగా.. అల్ అజీజియా స్టీల్ మిల్స్ కేసులో నవాజ్ షరీఫ్ మళ్లీ లాహోర్ జైలుకు వెళ్లారు.

# ఆదివాసీ వేడుకల్లో అపశృతి

**ట్రాక్టర్ ప్రమాదంలో ఒకరు మృతి**

ఖమ్మం,ఆగస్ట్9(ఆర్ఎన్ఎ): జిల్లాలోని సత్తుపల్లి మండలం బేతుపల్లి వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, 15 మంది తీవ్రంగా గాయపడ్డారు.

క్షతగాత్రుల్లో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

సత్తుపల్లిలో ఆదివాసీ వేడుకలకు ట్రాక్టర్‌లో వెళుతుండగా ప్రమాదం జరిగింది. బాధితులను నాయకులు సండ్ర వెంకటవీరయ్య, తాటి వెంకటేశ్వర్లు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు.

# వరంగల్ కోర్టు తీర్పుపై ఎమ్మెల్యే హర్షం

వరంగల్,ఆగస్టు9(ఆర్ఎన్ఎ): జిల్లాలో ముక్కువచ్చులారని 9నెలల చిన్నారిపై అత్యాచారం, హత్య చేసిన నిందితుడికి వరంగల్ కోర్టు ఉరిశిక్ష విధించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతుంది. కోర్టు తీర్పుపై వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ స్పందిస్తూ.. చిన్నారి శ్రీహిత కేసులో వరంగల్ న్యాయస్థానం ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. ఈ తీర్పుతో ఇలాంటి సంఘటనలకు తావు లేకుండా పోతుందన్నారు. ఇలాంటి సంచలనమైన తీర్పును వెల్లడించిన వరంగల్ న్యాయస్థానాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున అభినందిస్తున్నట్లు ఆయన తెలిపారు. నిందితుడు ప్రవీణ్‌కు తగిన శిక్ష వేసి ఆ తల్లి ఆవేదనకు.. చిన్నారి శ్రీహిత ఆత్మకు శాంతి చేకూరేలా చేశారన్నారు.

# భద్రాద్రి వద్దరెండో ప్రమాదహెచ్చరిక జారీ

భద్రాద్రి,ఆగస్ట్9(ఆర్ఎన్ఎ): ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరికి వరద నీరు పోటెత్తుతోంది. భద్రాచలం వద్ద నీటిమట్టం 48 అడుగులకు చేరింది, దీంతో అధికారులు రెండో ప్రమాదహెచ్చరికను జారీ చేశారు.

రామాలయం అన్నదాన సత్రం వద్ద గోదావరి బ్యాక్‌వాటర్ మోకాళ్లలోతుకు చేరుకుంది. దీనిని గోదావరిలోకి ఎత్తిపోసేందుకు సిబ్బంది యత్నిస్తున్నారు.అయితే నీటిని ఎత్తిపోసే మోటార్లు మొరాయించడంతో సత్రంలోకి వరదనీరు వచ్చి చేరుతోంది. దీంతో అక్కడి దుకాణాలను అధికారులు ఖాళీ చేయిస్తున్నారు. నదీపరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

# పాక్ లాంటి దేశం ఉండడం దురదృష్టం

న్యూఢిల్లీ,ఆగస్టు9(ఆర్ఎన్ఎ): పాకిస్థాన్‌పై కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. పాక్‌లాంటి పొరుగువారు ఎవరికీ ఉండకూడదనీ.. అలా అని దేవుడిని ప్రార్థిస్తున్నానన్నారు. గురువారం ఢిల్లీలోని ఓ కార్యక్రమంలో మాట్లాడిన రాజ్‌నాథ్.. ఈ విమర్శలు చేశారు. కశ్మీర్‌కు సంబంధించి ఆర్టికల్ 370ని రద్దు చేయడంతో పాక్ దౌత్య పరమైన చర్యలకు దిగిందాన్ని ఆయన ఖండించారు. స్నేహితులను మార్చుకోలం గానీ పాక్ లాంటి పొరుగువారిని మార్చుకోవడం మన చేతుల్లో లేదని రాజ్‌నాథ్ చెప్పుకొచ్చారు.

# ములుగు జిల్లాలను ముంచెత్తిన వానలు

## చెరువులు, కుంటలకు జలకళ

ములుగు,ఆగస్టు8(నేటినిజం ప్రతినిధి): ములుగు జిల్లాలో గత నాలుగు రోజుల నుండి కురిసిన భారీవర్షాలకు కుంటలు, చెరువులు, వాగులు పొంగి పొర్లడంతో రోడ్లు సైతం కొట్టుకపోతు న్నాయి. నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు రామప్ప సరస్సులో 26 అడుగులకు నీరు చేరుకుంది. మొత్తం సరస్సుకు 36 అడుగులు నీరు చేరుకుంటే రామప్ప చెరువు మత్తడి పడే అవకాశాలు ఉ న్నాయి. ఎడతెరపి వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతు న్నాయి. చెరువులో వచ్చిన నీటి మట్టాన్నిచూసి రైతులు ఈ సంవత్సరం కూడా రెండు పంటలు వేసుకోవచ్చని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గోవిందరావుపేట లక్నవరంలో సరస్సులో గత రెండు రోజులుగా మత్తిడి పొంగిపొర్లుతుంది. దానిని చూడటానికి చుట్టు ప్రక్కలప్రజలు తరలివస్తున్నారు. జిల్లాలో ఎడతెరపి వర్షాలకు ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న ప్రజలు వాగుల వద్ద నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మేడారం జాతరకు పోయే భక్తులు మాత్రం జాగ్రత్తగా పోవాలని హెచ్చరించారు. పస్రా , మేడారం సమీపంలో జంపన్న వాగు పొంగి పొర్లుతున్న క్రమంలో 23 మంది మేడారం జాతరను దర్శించుకుని పోయి అటే చిక్కిపోయారు. జంపన్న వాగు ఉద్రిక్తత ఎక్కువ కావడంతో ములుగు డిఎస్పీ విజయసారథి ఆధ్వర్యంలో పస్రా సిఐ, ఎస్సైల సహాయంతో 23 మందికి రక్షించడం జరిగింది. అందుకు నిదర్శనంగా నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు వాగులు పొంగుతు న్నాయి. అలాంటి ప్రదేశాలు ప్రజలు పోకూడదని ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సంబంధిత చర్యలు తీసుకుంటున్నారు. నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు దాదాపు 9 మండలాల్లో 1500 ఇళ్ళు కూలిపోయాయని పోలీసులు వెల్లడించారు. నష్టపోయిన ప్రజలకు అధికారులు వారి పేరును నమోదు చేసుకుని ఆ నివేదికను ప్రభుత్వానికి అందజేసే విధంగా చర్యలు చేపడుతున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలాల్లో ఉన్న తహసీల్దార్లు నాలుగు రోజులుగా కురిసిన వర్షాల వలన గ్రామాలలో కూలీన ఇండ్ల యాజమానుల పేర్లను నమోదు చేయాలని విఆర్ఒలకు ఆదేశాలు జారీ చేశారు. త్వరలోనే నష్టపోయిన వారికి ప్రభుత్వం ఆదుకుంటుందని అధికారులు చెబుతున్నారు.

# మిషన్ భగీరథలో నిర్లక్ష్యం సహించం: మంత్రి

సూర్యాపేట,ఆగస్ట్9(నేటినిజం ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా మొదలు పెట్టిన మిషన్ భగీరథ పనుల్లో జరుగుతున్న నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని మంత్రి జగదీష్ రెడ్డి స్పష్టం చేశారు. సకాలంలో పనులు పూర్తిచేయాల్సిందేనని కాంట్రాక్టర్లకు అల్టిమేటం జారీ చేశారు.ఇంటింటికి మంచి నీరు అందించే ఈ బృహత్ పథకంలో ఎక్కడ కూడా నిధుల లేమి లేకుండా ఉండేందుకు సీఎం కేసీఆర్ మంజూరు చేసిన నిధులను కూడా సకాలంలో ఖర్చు పెట్టలేక పోవటాన్ని జగదీష్ రెడ్డి తీవ్రంగా తప్పు పట్టారు. నల్గొండ, సూర్యాపేట జిల్లాలో కలిపి నిర్మించాల్సిన మూడు డబ్ల్యూటీపీల పురోగతి ఇప్పటికి కేవలం 70 శాతంమాత్రమే పూర్తి అయిందని చెప్పిన కాంట్రాక్టర్ల పని తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సకాలంలో పూర్తి అయ్యేలా అదనపు సిబ్బందితో పాటు అదనంగా మరిన్ని మిషన్లను వినియోగించాలని మంత్రి అధికారులకు నిర్దేశించారు. ఇంట్రా విలేజి ప్యాకేజీలను మొదలు పెట్టించి త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడాలని అధికారులకు ఆదేశించారు. మిగిలిన అగ్మెంటేషన్ పనులను పూర్తి చేసి సెప్టెంబర్ మాసాంతానికి మిషన్ భగీరథ పనులను పూర్తి చేయాలని మంత్రి జగదీష్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీచేశారు.

# ఏపీలో సుస్థిరమైన పాలన ఉంది

**- కేంద్ర ప్రభుత్వం అండదండలు రాష్ట్రానికి ఉన్నాయి**
**- అవినీతిలేని పారదర్శకమైన పాలన అందిస్తున్నాం**
**- ఏపీలో పెట్టుబడులకు అనేక అవకాశాలున్నాయి**
**- సుదీర్ఘ తీరప్రాంతం, మంచి వనరులు మా సొంతం**
**- వ్యవసాయం, విద్య, వైద్య రంగాల్లో మీ సహకారం కోరుతున్నాం**
**- పెట్టుబడిదారులకు కావాల్సిన రీతిలో యువతకు తర్ఫీదు ఇస్తాం**
**- భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకురావాలి**
**- డిప్లొమాటిక్ ఔట్ రీచ్ సదస్సులో ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి**

విజయవాడ, ఆగస్టు9(ఆర్ఎన్ఎ) : ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు చాలా అవకాశాలున్నాయని సీఎం జగన్ చెప్పారు. ఏపీలో పెట్టుబడులు చేయాల్సిందిగా.. పెట్టుబడిదారులను కోరారు. విజయవాడలో హోటల్ తాజ్ గేట్‌వేలో డిప్లొమాటిక్ ఔట్ రీచ్ సదస్సును శుక్రవారం జరిగింది. ఈ సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి సీఎం జగన్ ప్రారంభించారు. సీఎం జగన్. సదస్సుకు హాజరైన వివిధ దేశాల రాయబారులను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలో సుస్థిరమైన పాలన ఉందని.. కేంద్రం అండదండలు ఉన్నాయని చెప్పారు. పారదర్శకమైన పాలనతో రాష్ట్రంలో అవినీతి రహిత పాలన అందిస్తున్నామని వివరించారు. పెట్టుబడుల ఆకర్షణలో అవినీతి రహిత పాలన ముఖ్యమని సీఎం తెలిపారు. టీడీపీ ప్రభుత్వం చేపట్టిన విద్యుత్ కొనుగోలు ఒప్పందాల రద్దు వివాదాస్పదమైందని.. పీపీఏల వల్ల రాష్ట్రానికి లాభం లేకపోవటం వల్లే రద్దు చేశామని జగన్ వివరించారు. 60 రోజుల పాలనలో ఎన్నో మార్పులు చేసి చూపించామన్నారు. హైదరాబాద్ లాంటి నగరం మాకు లేదని, కానీ మాకు బలం ఉందని చెప్పారు. రాష్ట్రంలో 975 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉందని, 13 జిల్లాలకు కాను ఆరు జిల్లాల్లో తీర ప్రాంతం ఉందన్నారు. రాష్ట్రంలో నాలుగు ఓడరేవులు ఉన్నాయని.. వచ్చే ఐదేళ్ళలో మరో నాలుగు ఓడరేవులు నిర్మించే యోచనలో ప్రభుత్వం ఉందన్నారు. రాష్ట్రంలో 6 విమానాశ్రయాలున్నాయని జగన్ అన్నారు. రాష్ట్ర ఆదాయంలో ఎక్కువ భాగం పరిశ్రమల నుంచే వస్తోందని, ఏ విషయంలోనైనా యువత ముందుండేలా చూస్తామని, యువతను మీకు కావాల్సిన దానికంటే ఎక్కువ తీర్చి దిద్దుతాంమని జగన్ అన్నారు. గ్లోబల్ స్టాండర్డ్స్ సాధిస్తామని, ఆదిశగా ముందుకెళ్తామని ఆయన అన్నారు. స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరగాలని తమ ప్రభుత్వం కోరుకుంటోందని, యువతలో ఎలాంటి నైపుణ్యాలు కావాలో చెప్తే వారిని ప్రపంచ స్థాయి నాణ్యతతో తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.

రాష్ట్రంలో ఆక్వా పరిశ్రమ అభివృద్ధిలో ఉందని, అంతర్జాతీయ ప్రమాణాలతో రైతులు వ్యవసాయం చేస్తున్నారని సీఎం జగన్ తెలిపారు. పెట్టుబడులు పెట్టేవారికి ధైర్యం కల్పించే బాధ్యత మాదని జగన్ పునరుద్ఘాటించారు. రెండు నెలల క్రితం ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్నప్పుడు విద్యుత్ డిస్కంల పరిస్థితి దారుణంగా ఉందని, 20వేల కోట్ల బకాయిలు ఉన్నాయి. డిస్కంలు సంక్షోభంలో ఉన్నాయి. రెవెన్యూ తక్కువ ఉండి, వ్యయం పెరిగితే డిస్కంలు పనిచేయలేవన్నారు. అందుకే విద్యుత్ ఒప్పందాలపై (పీపీఏ) పునఃసమీక్షిస్తున్నామని, ఇది వివాదాస్పదమైన నిర్ణయం అని అంతా అనుకోవచ్చు.. కానీ పంపిణీ సంస్థలను రక్షించుకోవాలి అంటే ఇది తప్పదన్నారు. వినియోగదారుల, పంపిణీ సంస్థలు, ప్రభుత్వం ఎవరు నష్ట పోకూడదు అన్నదే మా విధానమని, ఇవన్నీ మీకు తెలియాలని, అంతిమంగా పరిశ్రమలే ధరలు చెల్లించాలని, అందుకే ఈ వివాదాస్పద నిర్ణయం తీసుకున్నామని ఒప్పందం కుదుర్చుకున్న వాటిలో అంతర్జాతీయ సంస్థలు, బ్యాంకులు, కార్పొరేట్ సంస్థలు ఉన్నాయని జగన్ తెలిపారు. కానీ ఈ నిర్ణయం తప్పదని, మీకు వాస్తవాలు తెలియాలి అలానే మాపై విశ్వసనీయత పెరగాలన్నారు. పరిశ్రమలు వస్తేనే ఉద్యోగాలు వస్తాయని, పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం రిజర్వేషన్లు కల్పించటం అనే మరో నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇదీ వివాదాస్పద మే అని, కాలుష్యం ఇచ్చే పరిశ్రమలు అక్కడి స్థానిక యువత కు ఉపాధి కల్పించకపోతే ఎలా అని జగన్ అన్నారు. అమెరికాలో కూడా స్థానిక ఉద్యోగాలపై చర్చ జరుగుతోందని, ఉద్యోగ అవకాశాలు లేకపోతే పరిశ్రమల ఏర్పాటుకు భూములు ఎలా ఇస్తారని జగన్ అన్నారు. పోర్టులు, ఎయిర్‌పోర్టుల్లో పెట్టుబడులు పెట్టొచ్చునని, నదుల అనుసంధానానికి కట్టుబడి ఉన్నామని జగన్ అన్నారు. గోదావరి, కృష్ణ నదుల అనుసంధానానికి సహకారం కావాలని, డీజిల్ బస్సులను తీసేసి ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడతామన్నారు. విశాఖపట్నంకు మెట్రో రాబోతుందని, విజయవాడ, గుంటూరుకు కూడా మెట్రో వస్తుందని జగన్ అన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడులేని తీర్పును ప్రజలు మాకు ఇచ్చారని, మాపై ప్రజల్లో భారీ నమ్మకాలు ఉన్నాయని, భారీ ఎత్తున సంక్షేమ కార్యక్రమాలను కూడా కొనసాగిస్తున్నామని, పెట్టుబడులకు మీ సహకారం కావాలని జగన్ పెట్టుబడిదారులను కోరారు. ఢిల్లీ తర్వాత ఈ స్థాయిలో ఇంతమంది దౌత్యవేత్తలు సమావేశం కావటం ఇదే తొలిసారి అనుకుంటున్నారు.

ఈ సమావేశం ఏర్పాటు చేసినందుకు కేంద్రానికి ధన్యవాదాలు అని ముఖ్యమంత్రి జగన్ తెలిపారు. రాష్ట్రంలో పారిశ్రామిక విధానంపై ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి....రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు నవరత్నాలు, పెట్టుబడులు, టూరిజం, హెల్త్ సెక్టార్ వంటి కీలక అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం ప్రెజెంటేషన్ ఇవ్వనున్నారు. కాగా ఈ సదస్సులో యూఎస్ఏ, యూకే, జపాన్, కెనడా, కొరియా, సింగపూర్, ఆస్ట్రియా, పోలాండ్, ఆస్ట్రేలియా, టర్కీ తదితర 35 దేశాల రాయబారులు, హైకమిషనర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పరస్పరం ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలను పెంపొందించుకునే దిశగా పలు ఒప్పందాలు కుదుర్చుకోవటమే లక్ష్యంగా ఈ సదస్సు జరుగుతోంది.

# సుష్మాకు సైకత శిల్పి పట్నాయక్ నివాళి

న్యూఢిల్లీ,ఆగస్టు9(ఆర్ఎన్ఎ): భాజపా సీనియర్ నేత సుష్మాస్వరాజ్‌కు ప్రముఖ సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ నివాళులర్పించారు. పూరీ తీరంలో సుష్మా చేసిన చివరి ట్వీట్ కూడిన సైకత శిల్పాన్ని తీర్చిదిద్ది.. ఆమెకు నివాళులర్పించారు. జమ్మూ-కశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి హోదా రద్దు, ఆ రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించటంపై ప్రధాని మోదీని అభినందిస్తూ సుష్మా మంగళవారం ట్వీట్ చేశారు. థ్యాంక్యూ ప్రైమ్ మినిస్టర్. థ్యాంక్యూ వెరీమచ్. నా జీవితంలో ఇలాంటి రోజు కోసమే ఎదురుచూస్తున్నాను అంటూ ట్విటర్‌లో పేర్కొన్నారు. ఈ ట్వీట్ చేసిన కొద్దిసేపటికే ఆమె గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆమె మృతిపట్ల రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని మోదీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, కేంద్ర మంత్రులు, భాజపా సీనియర్ నేతలు, వివిధ పార్టీల నేతలు దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికార లాంఛనాలతో ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. దీంతోఆమెకు పట్నాయక్ నివాళి అర్పించారు.

# బురద రోడ్లపై వరినట్లు

## నిరసన తెలిపిన గ్రామస్థులు

కామారెడ్డి,ఆగస్టు9 (ఆర్ఎన్ఎ): సదాశివనగర్ మండలంలోని ఉత్తునూరులోని ప్రధాన రోడ్డును బాగుచేయాలని కోరుతూ ఆ గ్రామంలోని మహిళలు గురువారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. దీంతో వారు గ్రామంలోని ప్రధాన రహదారిపై వరినాట్లను వేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామంలోని ప్రధాన రోడ్డు బురదమయంగా మారిందని, దీనివల్ల తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నామని వారు తెలిపారు. అయితే తమ సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా వారు పట్టించుకోలేదు మహిళలు వాపోయారు.

# ఖమ్మంలోనూ వైద్యుల ఆందోళన

ఖమ్మం,ఆగస్టు9 (ఆర్ఎన్ఎ): జాతీయ మెడికల్ కౌన్సిల్ బిల్లు ఆమోదం వ్యతిరేకిస్తూ.. ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు గురువారం ధర్నా నిర్వహించారు. ఆస్పత్రి ప్రధాన ద్వారం ఎదుట నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఎన్ఎమ్‌సీ బిల్లును రద్దు చేయాలని డిమాండు చేశారు. వైద్యరంగం నిర్వీర్యం చేసే చర్యలను ఉపేక్షించబోమని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వవైద్యుల సంఘం నాయకులు డా. బి.శ్రీనివాసరావు. డా.బాబూ రత్నాకర్, డా.కవిత తదితరులు పాల్గొన్నారు.

# బుగ్గవాగు పనులను పరిశీలించిన కలెక్టర్

ఖమ్మం,ఆగస్టు9(ఆర్ఎన్ఎ): కామేపల్లి మండలం పొన్నెకల్లు గ్రామ సమీపంలోని బుగ్గవాగుపై రూ. 2.34 కోట్ల ఆర్ఆర్ఆర్ నిధులతో నూతనంగా నిర్మించిన చెక్‌డ్యామ్ పనులను గురువారం జిల్లా కలెక్టర్ ఆర్వి.కర్ణన్ పరిశీలించారు. ఈ సందర్భంగా చెక్ డ్యామ్ కుడివైపు నిర్మించిన కాల్వను, గైడ్ వాల్‌ను పరిశీలించారు. పనులకు సంబంధించి ఇరిగేషన్ ఈఈ నరసింహారావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నెమలిపురి గ్రామానికి చెందిన రైతులు మరో కాల్వను నిర్మించాలని కలెక్టర్‌కు విన్నవించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో ప్రియాంక, తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీవో రాజేంద ప్రసాద్, డీఈ నరసింహారావు, ఈఈ శంకర్, గుత్తేదారు మద్దినేని రమేష్ చౌదరి పాల్గొన్నారు.

# రైతు సంక్షేమ ప్రభుత్వమిది

# నిరంతర శ్రమతో సాకారం అవుతున్న ప్రాజెక్టులు: రామలింగారెడ్డి

సిద్దిపేట,ఆగస్ట్9(ఆర్ఎన్ఎ): రైతులు బాగుంటేనే దేశం బాగుంటుందని, వారిని ఆదుకునేందుకు సిఎం కెసిఆర్ ప్రాజెక్టులను కొత్త పుంతలు తొక్కిస్తున్నారని టీఆర్ఎస్ దుబ్బాక ఎమ్మెల్యే రామలింగారెడ్డి అన్నారు. సమైక్యాంధ్ర పాలనలో ఆంధ్రా పెత్తందార్ల మోచేతి నీళ్లు తాగిన కాంగ్రెస్ నాయకులు దద్దమ్మలని, తెలంగాణ ప్రాంతానికి రావాల్సిన కరెంట్‌ను ఆంధ్రోళ్లు దోచుకెళ్తుంటే పిరికిపందల్లా కూర్చున్నారని విమర్శించారు. కాళేశ్వరం నీటి తరలింపు పథకం ఓ అద్భుతమైన విజన్ అన్నారు. ఎస్సారెస్పీని నింపసడం అన్నది ముందు చూపుతో తీసుకున్న నిర్ణయమన్నారు. ఎస్సారెస్పీ 365 రోజులు నీళ్లు ఉంటయి కాబట్టి ఇక్కడి నుంచే రైతుల పొలాలకు ఇక నమ్మకంగా నీరు చేరుతుందని అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వానికి మంచి పేరు రావద్దని కాంగ్రెస్ నాయకులు ప్రజలకు నీళ్లు రావద్దనే దుర్మార్గాలు చేస్తున్నారని అన్నారు. ఎక్కడికక్కడ కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని అన్నారు. నీళ్లు ఇవ్వడమే గాకుండా రైతులు పండించిన పంటలకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర కల్పించి ఆదుకుంటుందన్నారు. మిషన్‌కాకతీయ పథకం ద్వారా ఇప్పటికే ఎన్నో చెరువులకు మరమ్మతు చేయడం వల్ల వాటిలో సంవృద్ధిగా నీరు చేరి రైతులకు సాగునీరందుతుందన్నారు. వర్షపు నీటిని వృథాగా పోనివ్వకుండా రైతులు తమ పొలాల్లో కందకాలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నీటి సంరక్షణ కోసం జలనిధి కార్యక్రమం చేపట్టిందని, రైతులు కూడా కందకాల ఏర్పాటు చేసుకుంటే వారి భూముల్లో ఉన్న బావులు, బోర్లలో భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంటుందన్నారు. కందకాల ఏర్పాటుతో తమ భూమి కోల్పోతామనే అపోహలు విడనాడాలన్నారు.

# కేసీఆర్ లక్ష్యంతో తీరనున్న రైతుల కష్టాలు

## బీమాతో రైతుల్లో పెరిగిన భరోసా : ఎమ్మెల్యే

జగిత్యాల,ఆగస్ట్9(ఆర్ఎన్ఎ): గతంలో అధికారంలో ఉన్న ఏ పార్టీ, ఏ ఒక్క ముఖ్యమంత్రి చేయని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు అన్నారు.

రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను చూసి కాంగ్రెస్ నేతలకు నిద్ర పట్టడం లేదన్నారు. ఇప్పటికే మిషన్ కాకతీయ, మిషన్ భగీరథలు వేగంగా సాగుతున్నాయని, వచ్చే యేడాదికి శ్రీరాంసాగర్ నిండుకుండలా మారనుందన్నారు. దీంతో జగిత్యాల ప్రాంత రైతులకు కూడా మేలు జరుగనుందని అన్నారు. రాష్ట్రంలో మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువులు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టారన్నారు.సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలతో టీఆర్ఎస్‌కు ప్రజల్లో మంచి ఆదరణ పెరిగిందని అన్నారు. చెరువుల పూడికతీతో భూగర్భ జలాల నీటిమట్టం గణనీయంగా పెరిగి గ్రామాల్లో సాగు, తాగు నీటి ఇబ్బందులు తొలగిపోయాయన్నారు. కాళేశ్వరం, కొయిలసాగర్, నెట్టెంపాడు వంటి పథకాలను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. బీమా పథకం రైతు కుటుంబాలకు భరోసానిస్తుందని ఎమ్మెల్యే అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు పక్షపాతి అనీ, రైతు కుటుంబాల క్షేమం కోసం బీమా సౌకర్యాన్ని కల్పించారని చెప్పారు. ప్రాజెక్టులు, ఎత్తిపోతల ద్వారా ప్రతి గ్రామంలో చెరువులు, కుంటలు నింపి రైతుల పొలాలకు నీటిని అందిస్తున్నట్లు చెప్పారు.

# కొత్త సారథి ఎవరో?

**- నేడే సీడబ్ల్యూసీ సమావేశం**
**- కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడి ఎంపికపై జరగనున్న చర్చ**
**- తాత్కాలిక చీఫ్‌గా సోనియాను ఎన్నుకుంటారంటూ ఊహాగానాలు**
**- పార్టీ అధ్యక్షుని రేసులో పలువురు సీనియర్లు**
**- నేడు అధ్యక్షుడెవరో తేలిపోతుందన్న అభిషేక్ సింఘ్వీ**

న్యూఢిల్లీ, ఆగస్టు9(ఆర్ఎన్ఎ) : సార్వత్రిక ఎన్నికల ఓటమి అనంతరం బాధ్యత వహిస్తూ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి రాహుల్‌గాంధీ రాజీనామా చేశారు. అప్పటి నుండి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుని ఎంపికపై కసరత్తు సాగుతూనే ఉంది. తాజా శతాధిక సంవత్సరాల పార్టీ కాంగ్రెస్‌కు కొత్త సారథి రాబోతున్నారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) సమావేశం శనివారం జరగనుంది. ఈ సమావేశంలోనే అధ్యక్ష ఎన్నిక జరగనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. పార్టీకి నూతన అధ్యక్షుడిని తప్పకుండా ఎన్నుకుంటామని, ఇక ఆలస్యమయ్యే అవకాశమే లేదని కాంగ్రెస్ సీనియర్ నేత అభిషేక్ సింఘ్వీ శుక్రవారం విలేకరులతో అన్నారు. శనివారం రోజున కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిని తప్పకుండా ఎన్నుకుంటామని, సారథి ఎంపిక ఇక ఆలస్యమయ్యే అవకాశం లేదని తెలిపారు. నాకున్న సమాచారం మేరకు అధ్యక్ష పదవికి నామినేషన్ వచ్చేంత వరకూ చర్చలు జరుగుతాయని, ఆ వెంటనే అంతర్గతంగా ఎన్నిక చేపడతామని సింఘ్వీ తెలిపారు. ఇదిలా ఉండగా.. శనివారం జరగబోయే సీడబ్ల్యూసీ సమావేశంలో తాత్కాలిక చీఫ్‌ను ఎన్నుకుని, కొత్త అధ్యక్షుడి ఎంపికకు ప్యానెల్‌ను ఏర్పాటు చేసే అవకాశాలున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో ఓటమికి బాధ్యత వహిస్తూ రాహుల్ గాంధీ తన పదవికి రాజీనామా చేశారు. అయితే ఈ రాజీనామాకు వెనక్కి తీసుకోవాలని పార్టీ నేతలు ఎంత అభ్యర్థించినా రాహుల్ తన పట్టువీడలేదు. దీంతో పార్టీకి కొత్త అధ్యక్షుడి ఎన్నిక అనివార్యమైంది. అయితే రోజులు గడుస్తున్నా కొత్త సారథి నియామకం జరగకపోవడంతో సొంత పార్టీ నేతలే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎంపిక ఆలస్యమైతే అది పార్టీకి నష్టం కలిగిస్తుందని కొందరు కాంగ్రెస్ వ్యక్తులు బహిరంగంగానే అభిప్రాయాలను వెల్లడించారు. ఈ నేపథ్యంలో కొత్త అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియను పార్టీ వేగవంతం చేసింది. తొలుత అధ్యక్ష పదవి కోసం పలువురి పేర్లు తెరపైకి వచ్చాయి. ప్రియాంక గాంధీని బాధ్యతలు తీసుకోవాలని పార్టీ కోరినప్పటికీ అందుకు ఆమె నసేమిరా అన్నారు. దీంతో సారథి ఎన్నిక కష్టమవుతోంది. మరోవైపు తాత్కాలిక చీఫ్ బాధ్యతలను సోనియాగాంధీకి అప్పగిస్తారనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఆరోగ్య కారణాల రీత్యా ఆమె ఆసక్తి చూపించడం లేదని సమాచారం. ఏదేమైనా ఏళ్ల ఘన చరిత్ర ఉన్న పార్టీకి కొత్త అధ్యక్షుడిగా ఎవరొస్తారో మరికొద్ది గంటల్లో తేలే అవకాశముంది.



# ఉగ్ర గోదారి

**- ఉధృతంగా ప్రవహిస్తున్న గోదారి**
**- భద్రాచలంలో రెండో ప్రమాద హెచ్చరిక జారీ**
**- లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తంచేసిన అధికారులు**

భద్రాద్రి, ఆగస్టు9(ఆర్ఎన్ఎ) : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి ఉగ్రరూపం దాల్చింది. ఎగువ నుంచి వస్తున్న వరదనీటితో పాటు తెలంగాణలో కురుస్తున్న వర్షాలతో గోదావరికి వరద నీరు పోటెత్తుతోంది. భద్రాచలం వద్ద నీటిమట్టం 48 అడుగులకు చేరింది, దీంతో అధికారులు రెండో ప్రమాదహెచ్చరికను జారీ చేశారు. రామాలయం అన్నదాన సత్రం వద్ద గోదావరి బ్యాక్‌వాటర్ మోకాళ్లలోతుకు చేరుకుంది. దీనిని గోదావరిలోకి ఎత్తిపోసేందుకు సిబ్బంది యత్నిస్తున్నారు. అయితే నీటిని ఎత్తిపోసే మోటార్లు మొరాయించడంతో సత్రంలోకి వరదనీరు వచ్చి చేరుతోంది. దీంతో అక్కడి దుకాణాలను అధికారులు ఖాళీ చేయిస్తున్నారు. నదీపరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. ఇప్పటికే లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు, పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లోని ప్రజలను బోట్‌లు ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వారికి కావాల్సిన వసతి సౌకర్యాలను కల్పిస్తున్నారు.

## పోలవరం వద్ద గోదారిలో తప్పిన ప్రమాదం..

గోదావరిలో ఘోర ప్రమాదం తప్పింది. వరద ఉధృతికి పోలవరం ప్రాజెక్టు ఎగువ కాఫర్ డ్యామ్ వద్ద 31మంది మత్స్యకారులు చిక్కుకున్నారు. వీరంతా తాత్కాలికంగా కాఫర్ డ్యాంపైకి చేరుకొని సురక్షితంగా ఉన్నప్పటికీ.. వారిని అక్కడి నుంచి ఒడ్డుకు ఎలా చేర్చాలన్న దానిపై అధికారులు తీవ్ర ప్రయత్నాలు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ధవళేశ్వరానికి చెందిన 31 మంది మత్స్యకారులు 19 పడవల్లో 80 రోజుల క్రితం మరబోట్లతో చేపల వేటకు వెళ్లారు. పది రోజులుగా గోదావరి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో తిరుగు ప్రయాణం పట్టారు. కూనవరం నుంచి ధవళేశ్వరం వెళ్తుండగా.. వీరవరపు లంక సమీపంలోని పోలవరం ఎగువ కాఫర్ డ్యాం వద్ద చిక్కుకున్నారు. నది మధ్యలో చిక్కుకున్న వారిలో 19 మంది పురుషులు, 12 మంది మహిళలు ఉన్నారు. ఉదయం నుంచి ఆహారంలేక ముగ్గురు మహిళలు సొమ్మసిల్లి పడిపోయారు. ఎగువ కాఫర్ డ్యాం చివరిభాగమైన పోచమ్మగండి వైపు వచ్చి, రక్షించాలంటూ ఆర్తనాదాలు పెట్టారు. వీరిని కాపాడేందుకు ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది విఫలయత్నం చేశారు. ఎస్సై ఆర్.శ్రీను, సీఐ ఎఎన్.మూర్తిలు సహాయక చర్యలు చేపట్టారు. వీరిని ఎట్టకేలకు ఒడ్డుకు చేర్చారు.

క్రీడలు

# ఇక క్రికెటర్లకూ డోపింగ్ పరీక్షలు..



హైదరాబాద్: టీమిండియా క్రికెటర్లు ఇక నుంచి డోపింగ్ పరీక్షకు హాజరుకావాల్సి ఉంటుంది. నేషనల్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ ఈ పరీక్షలు నిర్వహిస్తుంది. క్రికెటర్లు డోప్ పరీక్షకు మినహాయింపు కాదు అని ఇవాళ కేంద్ర క్రీడాశాఖ బీసీసీఐకి స్పష్టం చేసింది. దీంతో ఇప్పుడు నాడా నిర్వహించే పరీక్షలకు క్రికెటర్లు హాజరుకావాల్సి ఉంటుంది. నాడా తమపై పరీక్షలు చేయరాదంటూ గతంలో బీసీసీఐ వాదించింది. కానీ ఇప్పుడు క్రీడాశాఖ స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో ఇక క్రికెటర్లు కూడా డోప్ పరీక్షలకు లోనుకానున్నారు. బీసీసీఐకి కూడా నాడా కిందకు రావాలని గతంలో వరల్డ్ డోపింగ్ ఏజెన్సీ పేర్కొన్నది. దాని ప్రకారం ఇప్పుడు చర్యలు మొదలయ్యాయి. క్రికెటర్లు డోపింగ్ నియమావళికి కట్టుబడి ఉంటారని బీసీసీఐ ఈసీవో రాహుల్ జోహ్రీ ఇవాళ క్రీడా కార్యదర్శి రాధేశ్యామ్ జులనియాకు తెలియజేశారు. క్రికెటర్లు అందరూ ఇప్పుడు పరీక్షకు తప్పనిసరిగా హాజరవుతారని జులనియా చెప్పారు. అయితే డోపింగ్ కిట్‌ల గురించి బీసీసీఐ కొన్ని అభ్యంతరాలు చెప్పినట్లు క్రీడాకార్యదర్శి తెలిపారు.

# భారత ఆర్చరీ సంఘంపై సస్పెన్షన్

కోల్‌కతా: నిబంధనలకు వ్యతిరేకంగా ఇద్దరు అధ్యక్షులను ఎన్నుకున్న భారత ఆర్చరీ సంఘం (ఏఏఐ)ను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రపంచ ఆర్చరీ (డబ్ల్యూఏ) గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. డబ్ల్యూఏ విడుదల చేసిన మార్గదర్శకాలకు తిలోదకాలు వదిలి రెండు వేర్వేరు గవర్నింగ్ బాడీలను ఎన్నుకోవడం వల్లే సస్పెన్షన్ విధించినట్లు పేర్కొంది. ఈ నెలాఖరులోగా వివాదానికి ముగింపు పలకాలని లేకుంటే పరిణామాలు ఇంకా తీవ్రంగా ఉంటాయని హెచ్చరించింది. ఈ ఉత్తర్వులు సోమవారం నుంచి అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. భారత ఆర్చరీ సంఘాన్ని సస్పెండ్ చేయాలని జూన్‌లో డబ్ల్యూఏ తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేస్తున్నాం అని ప్రపంచ ఆర్చరీ కార్యదర్శి టామ్ డైలెన్ తెలిపారు. జూలై నెలాఖరుకల్లా పరిస్థితిని చక్కదిద్దాలని గతంలోనే డబ్ల్యూఏ ఆదేశించింది. అయినా పట్టించుకోని భారత ఆర్చరీ సంఘం తమ స్వప్రయోజనాల కోసం ఆర్చర్ల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చింది.

ఈ ఏడాది జూన్ 9న భారత ఆర్చరీ సంఘం రెండు వేర్వేరు ఎన్నికలు నిర్వహించింది. అందులో ఒకటి ఢిల్లీ వేదికగా జరగ్గా.. రెండో దానికి చండీగఢ్ కేంద్రంగా నిలిచింది. వాటిలో అర్జున్ ముండా, బీవీ పాపారావు అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. అర్జున్ ముండాకు దేశంలోని 20 రాష్ట్రాల మద్దతు ఉండగా.. పాపారావుకు 10 రాష్ట్రాల ఆర్చరీ సంఘాలు సపోర్ట్‌గా నిలిచాయి. ఈ అంశంపై త్వరగా తేల్చుకోవాలని గతంలోనే డబ్ల్యూఏ హెచ్చరిస్తే.. కొంత గడువు ఇస్తే పరిస్థితి చక్కదిద్దుకుంటామని భారత ఆర్చరీ సంఘం తెలిపింది. ఆ ఇచ్చిన గడువు పూర్తైనా ఇప్పటి వరకు ఎలాంటి ముందడుగు పడకపోవడంతో ఆగ్రహించిన డబ్ల్యూఏ సస్పెన్షన్ వేటు వేసింది.

నష్టమెవరికి..?

అధికారులు చేసిన తప్పిదానికి యువ ఆర్చర్ల భవిష్యత్తు అంధకారంగా మారింది. సస్పెన్షన్ కారణంగా ఈ ఏడాది నవంబర్‌లో బ్యాంకాక్ వేదికగా జరుగనున్న ఆసియా చాంపియన్‌షిప్‌లో భారత ఆర్చర్లు పాల్గొనడంపై సందేహాలు నెలకొన్నాయి. టోక్యో ఒలింపిక్స్ (2020) బెర్త్‌లు దక్కించుకోవాలంటే మనవాళ్లకు ఈ టోర్నీ ఎంతో ముఖ్యం. ఇలాంటి దశలో ఆటేతర విషయాల కారణంగా ఆర్చర్లు ఇబ్బందులు పడాల్సి రానుంది. ఈ టోర్నీలో వ్యక్తిగత విభాగంలో పాల్గొనే అవకాశమున్నా.. టీమ్ విభాగంలో బరిలో దిగాలంటే మాత్రం సస్పెన్షన్ తీవ్ర ఇబ్బందికి గురిచేయనుంది. పురుషుల విభాగంలో ఇప్పటికే ముగ్గురు భారత ఆర్చర్లు టోక్యో ఒలింపిక్స్ బెర్తులు దక్కించుకోగా.. మహిళల విభాగంలో ఇంతవరకూ ఒక్కరు కూడా అర్హత సాధించలేదు. ఈ నెలాఖరులోగానైనా పరిష్కారం చూపకపోతే.. త్వరలో జరుగనున్న ఆసియా చాంపియన్‌షిప్, పారా ఆసియా చాంపియన్‌షిప్‌ల్లో భారత ఆర్చర్లకు అవకాశమివ్వాలా లేదా అనే అంశంపై దృష్టి పెట్టాల్సి ఉంటుందిఅని టామ్ పేర్కొన్నారు.

# బీజేపీలోకి మాజీ ఎంపీ వివేక్



- అమిత్‌షాను కలిసి పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించిన వివేక్
- జేడీ నడ్డా సమక్షంలో బీజేపీలో చేరిక!
- పాల్గొన్న రాంమాదవ్, కిషన్‌రెడ్డి, లక్ష్మణ్
- కేసీఆర్ అరాచకాలకు చెక్‌పెట్టడం బీజేపీతోనే సాధ్యం
- రాష్ట్ర, కేంద్ర పార్టీ ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తా
- మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి
- తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు మోదీ సిద్ధం- కిషన్‌రెడ్డి

భవిష్యత్‌లో తెలంగాణలో అధికారం బీజేపీదే - లక్ష్మణ్

న్యూఢిల్లీ, ఆగస్టు 9(ఆర్‌ఎన్‌ఎ) : పెద్దపల్లి మాజీ ఎంపీ వివేక్ వెంకట స్వామి బీజేపీలో చేరారు. శుక్రవారం ఉదయం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డిలతో కలిసి బీజేపీ జాతీయ కార్యదర్శి రాంమాదవ్‌ను కలిశారు. అనంతరం ఆ పార్టీ జాతీయాధ్యక్షుడు, కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలిశారు. ఈ సందర్భంగా వివేక్ అమిత్‌షాను శాలువాతో సత్కరించారు. అనంతరం పలు విషయాలపై అమిత్‌షాతో చర్చించారు. ఈ కార్యక్రమంలో కిషన్‌రెడ్డి, రాంమాదవ్, లక్ష్మణ్‌లతో పాటు నిజామాబాద్ ఎంపీ అర్వింద్ తో పాటు పెద్దపల్లి జిల్లా స్థానిక నేతలు పాల్గొన్నారు. కాగా శుక్రవారం సాయంత్రం బీజేపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీ నడ్డా సమక్షంలో వివేక్ పార్టీ కండువా కప్పుకున్నారు. అమిత్‌షాను కలిసిన అనంతరం వివేక్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నియంతృత్వ దోరణితో వెళ్తున్నారని, బీజేపీ కేసీఆర్ అరాచకాలకు చెక్ పెడుతుందని అన్నారు. తెలంగాణలో అవినీతి బాగా పెరిగిపోయిందని అన్నారు. ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా కేసీఆర్ నెరవేర్చలేదని విమర్శించారు. నియంతృత్వ పాలన అంతమై ప్రజాస్వామ్య తెలంగాణ ఏర్పడాలని వివేక్ అన్నారు. కుమారుడు కేటీఆర్‌ను సీఎంగా చేయడమే కేసీఆర్ ప్రధాన దృష్టి అని, పార్టీలో బలమైన, ఉద్యమ నేతలు ఉండకూడదనేది కేసీఆర్ ఉద్దేశమని వివేక్ అన్నారు. ప్రధాని మోదీ నిర్ణయాలు చూసి ఇంకా చాలా మంది భాజపాలో చేరుతారని వివేక్ అభిప్రాయ పడ్డారు.

## తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు మోదీ సిద్ధం- కిషన్‌రెడ్డి

మాజీ ఎంపీ వివేక్‌ను బీజేపీలోకి ఆహ్వానిస్తున్నామని కేంద్ర సహాయ హోంమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను తెరాస ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు మోదీ సిద్ధంగా ఉన్నారని అన్నారు. వివేక్ చేరికతో తెలంగాణ బీజేపీ బలోపేతం అవుతుందని కిషన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం అరాచకాలను తిప్పికొట్టేందుకు బీజేపీ సిద్ధంగా ఉందని, ప్రజలంతా బీజేపీ పక్షాన నిలుస్తున్నారని అన్నారు. దీనికి నిదర్శనం ఇటీవల జరిగిన ఎంపీ ఎన్నికల్లో బీజేపీ నాలుగు ఎంపీ స్థానాలు సాధించటమే నన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో సత్తాచాటేందుకు వ్యూహాత్మకంగా ముందుకెళ్తామని కిషన్‌రెడ్డి అన్నారు.

## భవిష్యత్‌లో తెలంగాణలో అధికారం బీజేపీదే - లక్ష్మణ్

భవిష్యత్‌లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావటం ఖాయమని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. వివేక్ చేరిక సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. వివేక్ కుటుంబం అనేక సేవా కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. ప్రధాని మోదీ పనితీరును, నిర్ణయాలను వివేక్ అనేకసార్లు సమర్థించారు. తానుకూడా బీజేపీ సైనికుడిగా ఉంటానని వివేక్ చెప్పారని లక్ష్మణ్ అన్నారు. జేపీ నడ్డా సమక్షంలో వివేక్ బీజేపీలో చేరుతారని అన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావటం ఖాయమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఖాళీ కావటం ఖాయమన్నారు. ఇక కాంగ్రెస్ పని అయిపోయిందని, తెరాసకు ధీటైన పార్టీగా బీజేపీ ఎదుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి పలువురు త్వరలో బీజేపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని లక్ష్మణ్ తెలిపారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం ఒక్క బీజేపీతోనే సాధ్యమవుతుందని, ఆమేరకు ప్రజలు సైతం నమ్ముతున్నారని అన్నారు. ఎంపీ ఎన్నికల ఫలితాల్లో వీటిని రుజువుచేశారని, రాబోయే కాలంలో జరిగే ఎన్నికల్లో తమ సత్తాను చాటేందుకు సిద్ధంగా ఉన్నామని లక్ష్మణ్ అన్నారు.

# దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

## దరఖాస్తు చేసుకోవాలన్న అధికారులు

మేడ్చల్, హైదరాబాద్,ఆగస్ట్9(ఆర్‌ఎన్‌ఎ): జిల్లాలోని దివ్యాంగుల చేతి చంక, కర్రలు, మూడు చక్రాల సైకిళ్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి స్వరూపరాణి ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులు సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఆదాయ ధృవపత్రం, రేషన్ కార్డు, విద్యార్థులైతే బోన్గా÷ఫైడ్ సర్టిఫికెట్, 3 ఫొటోలతో ఈ నెల 13లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తులను కీసరలోని మేడ్చల్ కలెక్టరేట్ బీ బ్లాక్‌లోని జిల్లా సంక్షేమాధికారి కార్యాలయంలో అందజేయాలని కోరారు.

# తెలంగాణనుంచి ఆర్మీలో తక్కువ రిక్రూట్‌మెంట్

కరీంనగర్,ఆగస్ట్9(ఆర్‌ఎన్‌ఎ): జిల్లా కేంద్రంలో అక్టోబర్ 7 నుంచి 17 వరకు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ బోర్డు డైరెక్టర్ కల్నల్ పవన్‌పురితో కలిసి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన యువతీ యువకులు ర్యాలీలో పాల్గొనవచ్చన్నారు. ఈ నెల 23 నుంచి సెప్టెంబర్ 22 వరకు వెబ్ సైట్ లో పేర్లు నమోదు చేసుకుని దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆర్మీలో తెలంగాణ జిల్లాల నుంచి తక్కువ సంఖ్యలో ఉన్నారని జిల్లాల వారిగా అవగాహన పెంపొందించేందుకే ఒక్కో సంవత్సరం ఒక్కో జిల్లాలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

# చందుర్తి మండలంలో కార్డన్ సర్చ్

కరీంనగర్,ఆగస్ట్9(ఆర్‌ఎన్‌ఎ): జిల్లాలోని చందుర్తి మండలంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. మర్రిగడ్డ గ్రామంలో ఉదయం వేములవాడ డిఎస్పీ వెంకటరమణ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని 50 ద్విచక్ర వాహనాలు, మూడు ఆటోలు స్వాధీనం చేసుకున్నారు. వాటికి జరిమానా విధించారు. ఊరిలో ఎటువంటి సమస్యలున్నా గ్రామస్తులు తమ దృష్టికి తీసుకురావాలని పోలీసులు కోరారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. గ్రామంలో ఎటువంటి సమస్యలు ఉన్నాయో తెలుసుకోవడానికే ఈ కా÷-డర్గ÷న్ సర్చ్ నిర్వహించామన్నారు.

కశ్మీర్ అంశం..

# భారత్ -పాక్ ద్వైపాక్షిక అంశం

- ఇరు దేశాలు సంయమనం పాటించాలి
- స్పష్టం చేసిన అగ్రరాజ్యం అమెరికా

వాషింగ్టన్, ఆగస్టు9(ఆర్‌ఎన్‌ఎ) : కశ్మీర్ అంశం పూర్తిగా భారత్ - పాకిస్థాన్‌ల ద్వైపాక్షిక అంశమని శ్వేతసౌధం అధికార ప్రతినిధి మోర్గాన్ ఓర్టగస్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల పరిణామాలను దృష్టిలో ఉంచుకొని ఇరు దేశాలు సంయమనం పాటించాలని సూచించారు. కశ్మీర్ అంశం పూర్తిగా భారత్-పాక్ ద్వైపాక్షిక అంశమని తెలిపారు. ఇరు దేశాలు కశ్మీర్ వివాదంపై శాంతియుత వాతావరణంలో చర్చలు జరుపుకోవాలని.. దానికి అమెరికా పూర్తి మద్దతు ఉంటుందన్నారు. ఇరుదేశాలతో అమెరికాకు బలమైన సంబంధాలు ఉన్నాయని.. తాజా పరిస్థితుల నేపథ్యంలో ఉభయ దేశాల్లో నెలకొన్న వాతావరణాన్ని గమనిస్తున్నామని వ్యాఖ్యానించారు. కశ్మీర్‌తో సంబంధం ఉన్న అన్ని భాగస్వామ్య పక్షాలు సంయమనం పాటించాలని కోరారు. పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ ఇటీవలి పర్యటన కేవలం కశ్మీర్ ప్రాధాన్యంగా సాగలేదని ఇతర అంశాలు సైతం చర్చకు వచ్చాయన్నారు. కశ్మీర్‌లో భారత్ మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతుందన్న ఇమ్రాన్ ఆరోపణలపై ఓర్టగస్ స్పందించడానికి ఇష్టపడకపోవడం గమనార్హం. వావాదాస్పద ప్రాంతాల్లో చట్ట ప్రకారం వెళ్లాలన్నదే తమ సూచన అని వ్యాఖ్యానించారు. అలాగే అధికరణ 370 రద్దుకు సంబంధించి భారత్ తమకు ముందే సమాచారం అందించిందన్న వార్తల్ని ఓర్టగస్ మరోసారి తోసిపుచ్చారు. ముందే ఖరారైనట్లు అమెరికా ప్రతినిధి ఒకరు త్వరలో భారత్‌లో పర్యటిస్తారని.. ఈ సందర్భంగా తాజా పరిస్థితులపైనా చర్చ జరిగే అవకాశం ఉందన్నారు.

# తమిళనాడు దాహార్తిపై జగన్ తక్షణ స్పందన

## చెన్నైకి నీటి విడుదల కోసం అధికారులకు ఆదేశాలు

## సిఎంతో తమిళనాడు మంత్రుల బృందం భేటీ

అమరావతి,ఆగస్ట్9 (ఆర్‌ఎన్‌ఎ): చెన్నై ప్రజల గొంతు తడిపి వారి కష్టాలు తీర్చాలని విజ్ఞప్తి చేసిన తమిళనాడు మంత్రుల బృందం అభ్యర్థన పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. తాగునీటి కోసం లక్షలాది మంది ప్రజలు ఇబ్బంది పడుతున్నప్పుడు మానవత్వంతో స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మేరకు చెన్నైకి తాగునీటి విడుదలకై అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఇరుగు పొరుగు రాష్ట్రాలు పరస్పరం సోదరాభావంతో మెలగాలని తమిళనాడు మంత్రుల బృందంతో సీఎం జగన్ అన్నారు. ఒకరి కష్టాల్లో ఇంకొకరు పాలు పంచుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కాగా తమిళనాడు ముఖ్యమంత్రి కె.పళనిసామి ఆదేశాల మేరకు మున్సిపల్ శాఖ మంత్రి గణెళిశన్, మత్స్యశాఖ, పాలనా సంస్కరణల శాఖ మంత్రి జయకుమార్, ప్రిన్సిపల్ సెక్రటరీ మనివాసన్ శుక్రవారం సీఎం జగన్‌ను కలిశారు. ఈ సందర్భంగా తాగునీటి కొరతతో అల్లాడుతున్న చెన్నై ప్రజలను ఆదుకోవాలని మంత్రులు విజ్ఞప్తి చేశారు. తాగడానికి నీళ్లులేక 90 లక్షల మంది చెన్నై ప్రజలు అల్లాడుతున్నారని సీఎం జగన్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో ఆయన సానుకూలంగా స్పందించడంతో తమిళనాడు మంత్రుల బృందం ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపింది. అడగగానే మానవత్వంతో స్పందించారంటూ మంత్రులు హర్షం వ్యక్తం చేశారు.

# విద్యుద్ఘాతంలో పాడియావు మృతి

వరంగల్,ఆగస్టు9(ఆర్‌ఎన్‌ఎ): విద్యుదాఘాతంతో ఓ రైతుకు చెందిన జెర్సీ ఆవు మృతిచెందిన ఘటన నల్లబెల్లి మండలకేంద్రంలో చోటుచేసుకుంది. నల్లబెల్లికి చెందిన గాదగోని రమేశ్ అనే రైతు ఇటీవల రూ.80వేలతో జెర్సీ ఆవును కొనుగోలు చేశాడు. గురువారం ఉదయం మేతకోసం బయటకు వెళ్లిన ఆవుకు నియంత్రిక వద్ద విద్యుత్ తీగ తగలడంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందింది. వారం కిందటే ఈ ఆవుకి లేగదూడ జన్మించిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. పాలకోసం లేగదూడ తల్లి వద్దకు వచ్చి నాకుతుండటం చూసిన స్థానికులు కంటతడిపెట్టారు. ఈ ఘటన స్థానికంగా ఉన్న అందరినీ కలిచివేసింది.

# పాక్ ప్రేరేపిత ఉగ్రదాడులు

## నిఘా విభాగం హెచ్చరికలతో హై అలర్ట్

న్యూఢిల్లీ,ఆగస్ట్9(ఆర్‌ఎన్‌ఎ): ఆర్టికల్ 370 రద్దు నేపథ్యంలో పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్ర దాడులపై నిఘా వర్గాల సమాచారంతో పంజాబ్, రాజస్థాన్ రాష్ట్రాలు అప్రమత్తమయ్యాయి. పంజాబ్, రాజస్థాన్ సరిహద్దుల్లో పాకిస్తాన్ తన ముజహిదీన్ బెటాలియన్ సైన్యం సహకారంతో చొరబాట్లను ప్రోత్సహించవచ్చన్న సమాచారంతో ఈ రాష్ట్రాల్లో హైఅలర్ట్ ప్రకటించారు. పాక్ నుంచి ఎలాంటి కవ్వింపు చర్య ఎదురైనా తిప్పికొట్టేందుకు వాస్తవాధీన రేఖ వెంబడి ఇప్పటికే సైన్యం అదనపు సేనలను మోహరించింది. భారత్‌లో ఉగ్ర దాడులను చేపట్టేందుకు రాజస్థాన్, పంజాబ్ సరిహద్దు ద్వారా చొరబాట్లను ప్రేరేపించేందుకు పాక్ సాఫ్ట్ టార్గెట్‌గా ఎంచుకున్నట్టు సమాచారం. పాకిస్తాన్ సరిహద్దుకు చేరువగా ఉన్న రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ వంటి ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతతో పాటు నిఘా పెంచాలని బీఎస్‌ఎఫ్‌తో పాటు వాయుసేనను నిఘా సంస్థలు కోరాయి. మరోవైపు ఆర్టికల్ 370 రద్దుతో పుల్వామా తరహా దాడులు మరికొన్ని చోటుచేసుకుంటాయని పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ చేసిన వ్యాఖ్యలపై శివసేన మండిపడింది.

బ్రాండ్ ఫ్యాక్టరీలో మెగా డిస్కౌంట్ ఆఫర్లు, 8 నుంచి 11వ తేదీ వరకూ

# 50 శాతం తగ్గింపు ధరల్లో అమ్మకం

హైదరాబాద్, ఆగష్టు 9 : భారతదేశంలో ప్రముఖ ఫ్యాషన్ దుకాణం బ్రాండ్ ఫ్యాక్టరీ సరికొత్త ఆఫర్లతో ముందుకొచ్చింది. 'నో కండిషన్స్ అప్లై ఆఫర్' పేరుతో ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకూ ఈ షాపింగ్ ఉత్సవం జరగనుంది. వినియోగదారులు అన్ని బ్రాండ్ ఫ్యాక్టరీ స్టోర్లలో ఉన్న దుస్తులు, సామానులను 50 శాతం తగ్గింపు ధరతో పొందవచ్చు. రూ.4000 షాపింగ్ చేస్తే అదనంగా 20 శాతంపొందే వీలుంది. ఈ సందర్భంగా బ్రాండ్ ఫ్యాక్టరీ సీఈవో సురేష్ సాధ్వానీ మాట్లాడుతూ బ్రాండ్ ఫ్యాక్టరీలో మా వినియోగదారుల కోసం సరికొత్త ఆఫర్లతో ముందుకు వచ్చామని తెలిపారు. ఈ ఆఫర్లు అన్నీ వినియోగదారులు సంపూర్ణంగా ఆనందాన్ని పొందే విధంగా ఉన్నాయన్నారు. బ్రాండ్ ఫ్యాక్టరీ అనేది ఒక ఆదర్శవంతమైన ఫ్యాషన్ ప్రపంచమని పేర్కొన్నారు. 200 కు పైగా ఒరిజనల్ బ్రాండ్స్‌తో బ్రాండ్ ఫ్యాక్టరీ విలసిల్లుతుందన్నారు. సంవత్సరం అంతా 20 నుంచి 70 శాతం తగ్గింపుతో అమ్మకాలు జరుపుతామని తెలిపారు. ప్రముఖ బ్రాండ్లైన బేర్ డెనిమ్స్, ఫిలా, బఫెలో, లీ కూపర్, లెవిస్, రీబాక్, అడిడాస్, కన్వర్స్, విఐపి, స్కైబ్యాగ్స్, లావీ, కాప్రీస్, యుఎస్ పోలో, పార్క్ అవెన్యూతో పాటు దుస్తులు, పాదరక్షలు, సామాను, ఇతర ఉపకరణాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

# ప్రపంచపు అత్యంత ఎక్కువ పొగతాగే జనాభా కలిగిన చైనాలో ఇ-సిగరెట్లపై నిబంధనల రూపొందించే ప్రయత్నం

హైదరాబాద్, ఆగష్టు 9 : చైనాలో దేశపు ఆరోగ్య విధానాల కోసం ముసాయిదాలు రూపొందించడం మరియు వాటిని అమలు చేయడం, నియంత్రించడం చేసే నేషనల్ హెల్త్ కమిషన్ అనే నోడల్ బాడీ ఇప్పుడు ''ఇ-సిగరెట్లు'' మీద పరిశోధన ప్రారంభించడానికి మరియు ఆ విభాగానికి సంబంధించి నియంత్రణలు తీసుకు రావడానికి సిద్ధమైనట్టు ఇటీవల ప్రకటించింది. ప్రపంచపు అత్యంత ఎక్కువ మంది పొగతాగే జనాభా కలిన ఈ దేశంలో మరింతమంది ఆ వ్యసనం బారినపడకుండా కాపాడడమే లక్ష్యంగా ఆ నోడల్ బాడీ ఈ ప్రయత్నానికి సిద్ధమైంది. చైనాలో దాదాపు 300 మిలియన్ల మంది పొగాకు తాగేవారున్నారు. అంటే, మొత్తం ప్రపంచ జనాభాలో దాదాపు మూడోవంతు అన్నమాట. అయినప్పటికీ, పొగాకు తాగే అలవాటుకి ఒక సురక్షిత ప్రత్యామ్నాయమైన వేపింగ్ ధోరణికి సంబంధించి అక్కడ ఇంకా నిబంధనలు రూపొందించలేదు. ఈ విషయంలో ఙఐ, యూరోపియన్ నేషన్, ఙూ, ఇండోనేషియా, కొరియా, ఫిలిప్పైన్, న్యూజిల్యాండ్ మరియు కెనడా దేశాలు ముందున్నాయి.

ఈ విషయమై బీజింగ్‌లో గతవారం నిర్వహించిన ఒక ప్రెస్ కాన్ఫెరెన్సులో నేషనల్ హెల్త్ కమిషన్‌లో భాగమైన ప్లానింగ్ డిపార్ట్మెంట్ హెడ్ మావో క్వినాన్ మాట్లాడుతూ, "మా దేశంలో పొగతాగే రేటు తగ్గించడంతో పాటు యువతరం దానికి బానిస కాకుండా చూడాలనే లక్ష్యంతో ఉన్నాము" అన్నారు. ఆయన ఇంకా మాట్లాడుతూ, "ఔఊఅ ఇప్పుడు సంబంధిత విభాగాలతో కలసి పనిచేయడం ద్వారా ఇ-సిగరెట్ల మీద పరిశోధన జరుపుతోంది. ఆ పరిశోధన ఆధారంగా మేము ఎలక్ట్రానిక్ సిగరెట్ల మీద నియంత్రణ కోసం చట్టం చేయనున్నాము'' అని కూడా అన్నారు. ఇ-సిగరెట్ల మీద మరియు ఇ-సిగరెట్ల మీద పర్యవేక్షణకు సంబంధించి అత్యంత కఠిన నిబంధనలు తీసుకురావాలని ఆ కమిషన్ ఆలోచిస్తోంది. అనేక శాస్త్రీయ అధ్యనాలు మరియు ప్రఖ్యాత ప్రపంచస్థాయి సంస్థలు నిర్వహించిన పరిశోధనల్లో తేలిన ప్రకారం, సంప్రదాయ పొగాకు సిగరెట్లతో పోలిస్తే, ఇ-సిగరెట్లు అనేవి తక్కువ హానికరమైనవి. పొగాకు వినియోగం తగ్గించడం మరియు ఇ-సిగరెట్ల వినియోగం మీద నియంత్రణలు, పొగాకు నియంత్రణ విధానాల్లో సమగ్రంగా మార్పులు చేసిన దేశాల్లో పొగతాగే వారి సంఖ్య గణనీయంగా తగ్గినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. అయితే, వేపింగ్ సంబంధిత ఉత్పత్తులు ప్రాచుర్యంలోకి రాకుండా వాటి వ్యతిరేకులు గట్టి ప్రయత్నాలే చేస్తున్నారు. ఇ-సిగరెట్లకు అనుమతిస్తే, యువత దానికి బానిస అవుతుందనేది అలాంటి వారు చేసే ఒక ఆరోపణ. ఙఐ విషయానికొస్తే, ఎండ్స్ ఉత్పత్తులను చిన్న వయసువారు ఉపయోగించకుండా సరైన నియంత్రణలు తీసుకొచ్చింది. అందుకే, అక్కడి చిన్న వయసు జనాభాలో 1.7% మంది మాత్రమే ప్రతివారం ఇ-సిగరెట్లు వినియోగిస్తారు. నిజానికి, అందులో మెజారిటీ వారు అప్పటికే సంప్రదాయ సిగరెట్లు తాగడానికి అలవాటు పడినవారు. కెనడా సైతం ఎండ్స్ నియంత్రణ కోసం పురోగామి చర్యలు తీసుకోవడంతో పాటు ఎండ్స్ అందుబాటులో ఉండేలా చేసింది. పొగాకు చట్టం మరియు పొగతాగని వారి ఆరోగ్య చట్టంలో 2018 మేలో కెనడా ప్రభుత్వం మార్పులు చేసి వేప్ ఉత్పత్తుల తయారీ, అమ్మకం, లేబుల్ వేయడం మరియు ప్రచారం మీద నిబంధనలు తీసుకు రావడం ద్వారా ఆ ఉత్పత్తులను చిన్న వయసు వారు కొనడం మరియు వినియోగించడాన్ని నిషేధించింది.

ప్రపంచ ఆరోగ్య సంస్థ (చిఊబ) ప్రకారం, ప్రపంచపు మొత్తం పొగతాగేవారిలో 12% మంది భారతదేశంలో ఉన్నారు. తద్వారా, చైనా తర్వాత అత్యధికంగా పొగతాగే జనాభా కలిగిన దేశంగా భారతదేశం రెండో స్థానంలో ఉంది. ప్రస్తుతం, ఈ దేశంలోని చాలా బహిరంగ ప్రదేశాలు మరియు ఆరోగ్య, విద్య, ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన ఆవరణలు మరియు ప్రజా రవాణా వ్యవస్థల వంటి ప్రదేశాల్లో సిగరెట్లు మరియు ఇతర పొగాకు ఉత్పత్తుల వినియోగాన్ని పూర్తిగా నిషేధించారు. అలాగే, కొన్ని ప్రత్యేక ప్రదేశాల్లో మాత్రమే పొగతాగడానికి అనుమతిస్తున్నారు. మరోవైపు, ఇటీవలి మీడియా నివేదికల ప్రకారం, ఎలక్ట్రానిక్ నికోటిన్ డెలివరీ సిస్టమ్ (ఎండ్స్) మీద పూర్తిస్థాయి కఠిన నిషేధం అమలు చేయాలని భారతదేశం ఆలోచిస్తోంది. అయితే, ఇలాంటి ఒక నిషేధం విధించడంలో ఏమాత్రం తార్కికత, హేతుబద్ధత మరియు శాస్త్రీయ దృక్పథం లేదనే వాదన వినిపిస్తోంది.

ఎలాంటి తనిఖీలు లేకుండా సంప్రదాయ సిగరెట్లు అందుబాటులో ఉన్న నేపథ్యంలో, ఎండ్స్ మీద పూర్తిస్థాయి నిషేధం విధించడం వల్ల పొగాకు తాగడం అనే వ్యసనాన్ని తగ్గించడమనే లక్ష్యానికి తీవ్ర విఘాతం కలుగుతుంది. తద్వారా, పొగాకు తాగడానికి అలవాటు పడినవారు సంప్రదాయ సిగరెట్ల వినియోగం ద్వారా మరింత ప్రమాదంలో పడుతారు. కాబట్టి, పొగాకు సిగరెట్లు మరియు ఇతర ప్రమాదకర పొగాకు ఉత్పత్తులు చట్టబద్ధంగా లభిస్తూ, ఇ-సిగరెట్లు మరియు ఇతర తక్కువ ప్రమాదకర ఉత్పత్తుల మీద నిషేధం విధించడం దురదృష్టకరం.

# భారతదేశంలో ఆరోగ్యకర పౌల్ట్రీ వ్యవసాయానికి ప్రోత్సాహం

## – బ్యాక్టీరియా నివారణకు నూతన విధానం ఆవిష్కరణ

హైదరాబాద్, ఆగస్టు , 9: రోజురోజుకు మాంసం, కోడిగుడ్ల కోసం డిమాండ్ పెరుగుతున్న తరుణంలో ఇటీవల పౌల్ట్రీ ఉత్పత్తి కూడా ఎక్కువ అవుతోంది. పౌల్ట్రీ పరిశ్రమకు ఆరోగ్యకరమైన, పర్యావరణ సంబంధమైన సమస్యలు సవాళ్లు విసురుతున్నాయి. పౌల్ట్రీ పరిశ్రమకు తలెత్తే బ్యాక్టీరియా వ్యాధులతో భారీమొత్తంలో ఆర్థిక నష్టానికి, పర్యావరణ వ్యర్థాలు ఒకే చోట చేరడానికి, మానవ ఆరోగ్యానికి పెనుముప్పుగా పరిణమించాయి. ఆహారం విషతుల్యం కావడానికి పౌల్ట్రీ పరిశ్రమలో ప్రతి 10 కేసుల్లో తొమ్మిది కేసులు క్యాంప్యోలోబాక్టర్, సాల్‌మొనెల్లా ఇన్‌పెక్షన్లతో ఆధారపడి ఉన్నాయి. మరోవైపు పశువులకు వాడే ఔషధాలు అదనపుస్థాయిలో వాడటంతో మానవుల ఆరోగ్యం, పర్యావరణంపై దీర్ఘకాలిక ప్రభావం పడుతోంది. అత్యధిక పౌల్ట్రీ ఉత్పాదకుల వద్ద గల చికెన్, కోడిగుడ్ల నిల్వలకు ముప్పు పొంచి ఉంది. ఈ సవాళ్లను అధిగమించేందుకు పోలాండ్ కేంద్రంగా ఇన్నోవేటివ్ బయో టెక్నాలజీతో పని చేస్తున్న ప్రొటైన్ ఫార్మాస్యూటికల్స్ విప్లవాత్మక మార్పులు తీసుకు వచ్చింది. ఇందుకోసం ప్రొటైన్ ఫార్మాస్యూటికల్స్ వ్యవస్థాపక సీఈఓ ప్రొఫెసర్ జారోస్లా దాస్ట్యేచ్ 40కి పైగా అంతర్జాతీయ పబ్లికేషన్లలో రచనలు కొనసాగించారు. నాలుగు బయో టెక్నాలజీ ఆధారిత పేటెంట్లకు సహ యజమానిగా ఉన్నారు. ముంబైలో జరిగిన చర్చాగోష్టిలో ప్రొఫెసర్ దాస్ట్యేచ్ స్పందిస్తూ ఆరోగ్యకరమైన కోడ్ల పెంపకంతో మానవ, పర్యావరణ ఆరోగ్య పరిరక్షణకు విస్తృత ప్రయోజనాలు లభిస్తాయన్నారు.

# బ్యాక్టీరియా వ్యాధి నివారణకు నూతన సుస్థిర ప్రత్యామ్నాయ విధానం ఆవిష్కరణ




హైదరాబాద్, ఆగస్టు 9: రోజురోజుకు మాంసం, కోడిగుడ్ల కోసం డిమాండ్ పెరుగుతున్న తరుణంలో ఇటీవల పౌల్ట్రీ ఉత్పత్తి కూడా ఎక్కువ అవుతోంది. పౌల్ట్రీ పరిశ్రమకు ఆరోగ్యకరమైన, పర్యావరణ సంబంధమైన సమస్యలు సవాళ్లు విసురుతున్నాయి. పౌల్ట్రీ పరిశ్రమకు తలెత్తే బ్యాక్టీరియా వ్యాధులతో భారీమొత్తంలో ఆర్థిక నష్టానికి, పర్యావరణ వ్యర్థాలు ఒకే చోట చేరడానికి, మానవ ఆరోగ్యానికి పెనుముప్పుగా పరిణమించాయి. ఆహారం విషతుల్యం కావడానికి పౌల్ట్రీ పరిశ్రమలో ప్రతి 10 కేసుల్లో తొమ్మిది కేసులు క్యాంప్యోలోబాక్టర్, సాల్‌మొనెల్లా ఇన్‌పెక్షన్లతో ఆధారపడి ఉన్నాయి. మరోవైపు పశువులకు వాడే ఔషధాలు అదనపుస్థాయిలో వాడటంతో మానవుల ఆరోగ్యం, పర్యావరణంపై దీర్ఘకాలిక ప్రభావం పడుతోంది. అత్యధిక పౌల్ట్రీ ఉత్పాదకుల వద్ద గల చికెన్, కోడిగుడ్ల నిల్వలకు ముప్పు పొంచి ఉంది. ఈ సవాళ్లను అధిగమించేందుకు పోలాండ్ కేంద్రంగా ఇన్నోవేటివ్ బయో టెక్నాలజీతో పని చేస్తున్న ప్రొటైన్ ఫార్మాస్యూటికల్స్ విప్లవాత్మక మార్పులు తీసుకు వచ్చింది. ఇందుకోసం ప్రొటైన్ ఫార్మాస్యూటికల్స్ వ్యవస్థాపక సీఈఓ ప్రొఫెసర్ జారోస్లా దాస్ట్యేచ్ 40కి పైగా అంతర్జాతీయ పబ్లికేషన్లలో రచనలు కొనసాగించారు. నాలుగు బయో టెక్నాలజీ ఆధారిత పేటెంట్లకు సహ యజమానిగా ఉన్నారు. ముంబైలో జరిగిన చర్చాగోష్టిలో ప్రొఫెసర్ దాస్ట్యేచ్ స్పందిస్తూ ఆరోగ్యకరమైన కోడ్ల పెంపకంతో మానవ, పర్యావరణ ఆరోగ్య పరిరక్షణకు విస్తృత ప్రయోజనాలు లభిస్తాయన్నారు.

# ఇమ్రాన్ వ్యాఖ్యలపై శివసేన మండిపాటు

## పుల్వామా దాడి వెనక పాక్ హస్తం
## సంపాదకీయంలో ఏకిపారేసిన సామ్నా

ముంబై,ఆగస్ట్9(ఆర్ఎన్ఎ): కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దుపై పాకిస్తాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ చేసిన వ్యాఖ్యలను శివసేన తీవ్రంగా తప్పుపట్టింది. మోదీ ప్రభుత్వ నిర్ణయం మరిన్ని పుల్వామా తరహా ఘటనలకు దారితీస్తాయని ఇమ్రాన్ ఖాన్ చేసిన వ్యాఖ్యలే పుల్వామా దాడి వెనుక పాక్ హస్తం ఉందనేందుకు తిరుగులేని ఆధారమని శివసేన పత్రిక సామ్నా సంపాదకీయం పేర్కొంది. ఇమ్రాన్ వ్యాఖ్యలు ఉగ్రవాదులను ఎగదోసేదిగా ఉందన్నారు. భారత్‌తో ద్వైపాక్షిక వాణిజ్యం రద్దుపై పాక్ నిర్ణయం ఆ దేశానికే నష్టమని స్పష్టం చేసింది. పాక్ నిర్ణయం భారత వృద్ధి రేటుకు ఎంతమాత్రం అవరోధం కాదని పేర్కొంది. భారత రాయబారిని తిప్పిపంపడం, పాక్‌లో తమ రాయబారిని వెనక్కిపిలవడం వంటి పాక్ దౌత్య నిర్ణయాలను స్వాగతిస్తున్నామని పేర్కొంది. కశ్మీర్ వివాదంలో భారత్ గెలుపును పాక్ అంగీకరించాలని శివసేన వ్యాఖ్యానించింది. ఒక చేత్తో చర్చలంటూ మరో చేత కుట్ర పన్నే పాక్ తీరు భారత్‌తో పనిచేయదని తేల్చిచెప్పింది. ఆర్టికల్ 370 రద్దు నిర్ణయానికి ముందు భారత్ తమను సంప్రదించలేదన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటనను సేన తప్పుపట్టింది. ఇరాక్‌పై దండెత్తే సమయంలో, సద్దాం హుస్సేన్ ఉరితీత సందర్భాల్లో అమెరికా భారత్ అభిప్రాయాన్ని కోరిందా అని ప్రశ్నించింది.

# వరద బాధితులకు జెడిఎస్ ఎమ్మెల్యేల విరాళం

## ట్విట్టర్‌లో ప్రకటించిన మాజీ సిఎం కుమారస్వామి

బెంగళూరు,ఆగస్ట్9 (ఆంఎన్ఎ): కర్ణాటకను వర్షాలు ముంచెత్తుతున్నాయి. వరద బాధితుల సహాయార్థం జేడీఎస్ ఎమ్మెల్యేలు తమ నెల జీతాన్ని విరాళంగా ఇవ్వనున్నట్లు మాజీ ముఖ్యమంత్రి కుమార స్వామి ట్విటర్ ద్వారా వెల్లడించారు. భారీ వర్షాలు, వరదల కారణంగా ఇప్పటివరకు 9 మంది మృతి చెందారు. బెళగావిలో ఆరుగురు మృతి చెందగా.. ఉత్తర కన్నడలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. భారీ వర్షాల కారణంగా మైసూరు-హెచ్‌డీ కోటే రోడ్డును తాత్కాలికంగా మూసివేశారు. బెళగావి, బాగల్‌కోట్, రాయ్‌చూర్ జిల్లాల్లో వరద ప్రభావం ఎక్కువగా ఉంది. ఈ ప్రాంతాలకు చెందిన 16,875 మందిని 272 పునరావాస కేంద్రాలకు తరలించారు. ముద్దోల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యడియూరప్ప సందర్శించారు. సహాయ చర్యలను పర్యవేక్షించారు. వర్ష ప్రభావం నేపథ్యంలో ఆల్మట్టి డ్యామ్‌లో భారీగా వరద నీరు చేరింది. ఈనేపథ్యంలో ఇందువల్లే మహారాష్ట్రలో కొన్ని ప్రాంతాలు ముంపునకు గురయ్యాయని కొన్ని మీడియా సంస్థలు కథనాలు రాశాయి. దీనిపై కర్ణాటక సీఎం స్పందించారు. ఆల్మట్టి జలాశయం వల్ల మహారాష్ట్రకు ఎలాంటి నష్టం లేదని, మీడియా అసత్య ప్రచారం చేయరాదని సూచించారు. ఆ రాష్ట్రానికి ఆల్మట్టి ఎంతో దూరంలో ఉందన్నారు.

# పాక్ ఆర్టిస్టులను కూడా మనం నిషేధించాలి

## ప్రధానికి సినీ వర్కర్స్ అసోసియేషన్ వినతి

ముంబయి,ఆగస్ట్9 (ఆంఎన్ఎ): పాక్‌లో భారతీయ సినిమాల ప్రదర్శనను నిలిపివేసిన దరిమిలా, భారత్‌లో పాకిస్థాన్ ఆర్టిస్టుల్ని పూర్తిగా నిషేధించాలని ఆల్ ఇండియన్ సినీ వర్కర్స్ అసోసియేషన్ (ఏఐసీడబ్ల్యూఏ) ప్రధాని మోదీని కోరింది.

అలాగే 370 ఆర్టికల్ రద్దును కూడా స్వాగతించింది. భారతీయ సినిమాలను పాక్ గురువారం నిషేధించింది. ఈ నేపథ్యంలో పాక్ ఆర్టిస్టుల్ని కూడా భారత్‌లో పూర్తిస్థాయిలో నిషేధించాలని డిమాండ్ చేస్తూ ఏఐసీడబ్ల్యూఏ ట్విటర్‌లో ఓ లేఖను పోస్ట్ చేసింది. 'పాకిస్థాన్ ప్రభుత్వం భారత్ సినిమాల్ని నిషేధించిన తర్వాత భారత చిత్ర పరిశ్రమ కూడా పాక్ ఆర్టిస్టులు, సంగీత కళాకారులు, దౌత్యవేత్తలపై నిషేధం విధించాలని ఏఐసీడబ్ల్యూఏ డిమాండ్ చేస్తోంది. పాక్ దర్శక, నిర్మాతలు, కళాకారులు, వర్తక భాగస్వాములపై పూర్తిగా నిషేధం విధించే వరకూ మొత్తం చిత్ర పరిశ్రమ, సినీ కార్మికులు తిరిగి పనులు మొదలుపెట్టరని లేఖలో పేర్కొంది. ఇదే సందర్భంగా కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్-370 చెల్లుబాటును రద్దు చేస్తూ మోదీ సర్కారు తీసుకున్న నిర్ణయాన్ని ఏఐసీడబ్ల్యూఏ అధ్యక్షుడు సురేశ్ గుప్తా స్వాగతించారు. మొత్తం చిత్ర పరిశ్రమ తరఫున మోదీ, అమిత్‌షాకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ నిర్ణయం సాహసోపేతం అని ప్రస్తుతించారు.

# రానా నిర్మాణంలో శ్రీలంక క్రికెటర్ బయోపిక్







క్రీడా నేపథ్యంలో తెరకెక్కిన చాలా చిత్రాలు మంచి విజయం సాధించడంతో ఇప్పుడు మరో లెజండరీ క్రికెటర్ జీవిత నేపథ్యంలో సినిమా చేసేందుకు నిర్మాతలు ముందుకొచ్చారు. శ్రీలంక స్పిన్నర్ ముత్తయ్య మురళీధరన్ జీవిత నేపథ్యంలో సినిమా రూపొందనుందని, అందులో ప్రధాన పాత్రగా విజయ్ సేతుపతి నటించనున్నాడని ఇటీవల వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. శ్రీపతి రంగస్వామి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రానికి 800 అనే టైటిల్ పరిశీలిస్తున్నారు. టెస్ట్ క్రికెట్‌లో మురళీధరన్ 800 వికెట్స్ సాధించగా, ఆ నెంబర్‌తోనే సినిమా రూపొందనుందని అంటున్నారు .

ముత్తయ్య మురళీధరన్ బయోపిక్‌ని థార్‌ఫిలిమ్స్‌తో కలిసి సురేష్ ప్రొడక్షన్, రానా సంయుక్తంగా నిర్మించనున్నారు. ఈ విషయాన్ని రానా తన ట్విట్టర్ ద్వారా పేర్కొన్నారు . బాల్‌ని మెలికలు తిప్పుతూ కళ్ళతో బ్యాట్స్‌మెన్‌ని భయపెట్టించే మురళీధరన్ బయోపిక్ అతి త్వరలోనే సెట్స్ పైకి వెళ్లనుంది. ఈ చిత్రానికి సంబంధించిన మిగతా వివరాలు కూడా త్వరలోనే వెల్లడించనున్నారు.

# అందుకే సినిమాలకు బ్రేక్ ఇచ్చా: అనుష్క శర్మ



బాలీవుడ్ స్టార్ హీరో షారూక్ ఖాన్‌తో కలిసి నటించిన 'జీరో' తర్వాత హీరోయిన్ అనుష్క శర్మ మరో సినిమాను పట్టాలక్కించలేదు. ఇప్పటివరకు మరో ప్రాజెక్టుకు సంతకం కూడా చేయలేదు. దీంతో అనుష్క త్వరలో తల్లి కాబోతోందని, అందుకే ఆమె సినిమాలకు దూరమవుతోందని బాలీవుడ్ మీడియాలో వార్తలు వచ్చాయి. ఈ వార్తలపై తాజాగా అనుష్క స్పందించింది.

'వివాహం తర్వాత నేను వరుసగా సినిమాలు చేయడంతో కుటుంబంతో కలిసి గడపడానికి సమయం లేకుండా పోయింది. అందుకే సినిమాలకు కాస్త విరామం ఇవ్వాలని నిర్ణయించుకున్నాను. రెండు, మూడు నెలల విరామం తీసుకుని విరాట్‌తో, కుటుంబంతో తీరికగాసమయం గడపాలనుకున్నాను. కొత్త ప్రాజెక్టు గురించి త్వరగా నిర్ణయం తీసుకోవాలని నాపై చాలా ఒత్తిడి వస్తోంది. అయితే నాకు ప్రస్తుతం విశ్రాంతి కావాల'ని అనుష్క చెప్పింది.

# వజ్రాల కొనుగోలు..డబ్బుల అడిగితే బెదిరింపులు

## పోలీసులకు ఫిర్యాదుతో వ్యాపారి అరెస్ట్

హైదరాబాద్,ఆగస్ట్9 (ఆంఎన్ఎ): ఖరీదైన వజ్రాలను కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా బెదిరింపులకు పాల్పడుతున్న వ్యాపారిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. సూరత్‌కు చెందిన వజ్రాల వ్యాపారి వికాస్‌చోప్రా నగరంలోని ఆభరణాల తయారీదారులకు వజ్రాలు విక్రయిస్తుంటాడు. పాతబస్తీలోని దారుల్‌షిపా ప్రాంతానికి చెందిన మదన్ సిసోడియా అనే వ్యాపారికి ఇదే విధంగా పలుమార్లు వజ్రాలను విక్రయించాడు. రెండేళ్లక్రితం రూ.24లక్షల విలువైన రెండు వజ్రాలను వికాస్‌చోప్రా తీసుకువచ్చి బంజారాహిల్స్ రోడ్ నం.2లోని కార్యాలయంలో మదన్ సిసోడియాకు విక్రయించారు. దీనికి సంబంధించిన డబ్బును 15రోజుల్లో ఇస్తానని చెప్పిన మదన్ సిసోడియా ముఖం చాటేశాడు. ఎన్నిసార్లు అడిగినా డబ్బులు ఇవ్వకపోవడంతో పాటు ఇటీవల అంతుచూస్తానంటూ బెదిరింపులకు దిగుతున్నాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశబూడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడు మదన్ సిసోడియాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# విద్యార్థులకు పొలంపనులపై అవగాహన

## డిగ్రీకాలేజీ ప్రిన్సిపాల్ నిర్ణయం

సూర్యాపేట,ఆగస్ట్9 (ఆంఎన్ఎ): విద్యార్థులకు పొలం పనులు అంటే ఏమిటో తెలియకుండా పోతుంది. వ్యవసాయ ప్రధానమైన మన దేశంలో.. పొలం పనులపై కొంతమందికి చులకన భావం కూడా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో సూర్యాపేట జిల్లా గిరిజన గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఓ మంచి నిర్ణయం తీసుకున్నారు. కళాశాలలోని విద్యార్థినులకు పొలం పనులు పరిచయం చేయాలని అనుకున్నారు. వృతి విద్యలో భాగంగా వారిచే కాసేపు పొలం పనులు చేయించారు. మునగాల మండలం ఆకుపాముల వద్ద కళాశాల పక్కన ఉన్న పొలాల్లోకి దిగిన విద్యార్థినిలు ఉత్సాహంగా వరి నాట్లు వేశారు. 100 మంది విద్యార్థినిలతో పాటు, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు కూడా ఇందులో పాల్గొన్నారు.

ఈ దృశ్యాలను చూసినవారు విద్యార్థినులపై ప్రశంసలు కురిపించారు. కాగా, ఈ మధ్య కాలంలో పలువురు ప్రభుత్వ అధికారులు కూడా పొలం బాట పడుతున్న సంగతి తెలిసిందే. తమ విధులను కాసేపు పక్కకు పెట్టి పొలం పనులు చేస్తూ సేద తీరుతున్నారు.

# గంజాయి విక్రేతపై పీడి చట్టం నమోదు

హైదరాబాద్,ఆగస్ట్9 (ఆర్ఎన్ఎ): తరచూ గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిపై రాచకొండ కమిషనర్ మహేశ్ భగవత్ పీడీ చట్టాన్ని ప్రయోగించారు. నాగర్ కర్నూలుకు చెందిన కామోజీ కొండల్(31) నగరంలోని బడంగ్‌పేటలో ఉంటూ క్షౌరశాలను నిర్వహిస్తున్నాడు. హైదరాబాద్‌కే చెందిన సుబేదార్ వినోద్ సింగ్‌తో కలిసి గంజాయి విక్రయిస్తూ డబ్బు సంపాదించడం మొదలు పెట్టాడు. విశాఖపట్టణం జిల్లా చింతపల్లి ఏజెన్సీ ప్రాంతానికి చెందిన ఫంగితెల్ల తేజ, వండలం నాగార్జున, చదల చిన్నబ్బాయి ఈ నిషేధిత సరకును వీరికి సరఫరా చేసేవారు. ఏజెన్సీలో రూ.1500కు కిలో గంజాయిని కొనేవారు. ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో తీసుకొచ్చి రూ.2500 చొప్పున కొండల్, వినోద్‌సింగ్‌లకు విక్రయించేవారు. ఆ గంజాయిని కొండల్ ఎక్కువ ధరకు అమ్మేవాడు. ఈ క్రమంలో గత నెల 11న మీర్‌పేట పోలీసులు 185 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కొండల్‌కే అప్పగించేందుకు తెస్తున్నట్లు గుర్తించడంతోపాటు.. గతంలో పలుమార్లు పోలీసులు అరెస్ట్ చేసినా తీరు మార్చుకోకపోవడంతో తాజాగా అతడిపై పీడీ చట్టాన్ని ప్రయోగించారు.

## అఫ్ఘాన్‌లో భూప్రకంపనలు

న్యూఢిల్లీ,ఆగస్టు9 (ఆర్ఎన్ఎ): అఫ్ఘానిస్తాన్ లో భారీ భూకంపం సంభవించింది. హిందూకుష్ లో ఉదయం ఆరున్నరకు భూప్రకంపనలు వచ్చాయి. కొన్ని సెకన్ల పాటు భూమి కంపించడంతో రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 5.8గా నమోదైంది. భూకంపంతో స్థానికులు భయాందోళనలకు గురై ఇళ్లలో నుంచి బయటికి పరుగులు తీశారు. అయితే సునామి వచ్చే అవకాశాలు లేవని తెలిపింది యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.